ఆదివారం
11•3•2018
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 273
• పేజీలు : 16 + (24/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

నేడు టీఆర్ఎస్ఎల్పీ సమావేశం



- బడ్జెట్ సమావేశాలపై దిశానిర్దేశం చేయనున్న సీఎం కేసీఆర్
- పార్టీ రాజ్యసభ అభ్యర్థులను పరిచయం చేసే అవకాశం
- రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు మజ్లిస్ మద్దతు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బడ్జెట్ సమావేశాలు, రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి శాసనసభాపక్ష సమావేశం పార్టీ అధ్యక్షుడు, సీఎం కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఆదివారం మధ్యాహ్నం జరుగనున్నది. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. పార్టీ తరుపున పోటీచేయనున్న ముగ్గురు రాజ్యసభ అభ్యర్థులను ఆయన పరిచయం చేసే అవకాశం ఉన్నది. తెలంగాణభవన్‌లో జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల గురించి చర్చిస్తారు. సభలో జరిగే చర్చల సందర్భంగా ప్రభుత్వ పథకాలను సమర్థంగా లెక్కలతోసహా వివరించడం, ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై మంత్రులు పకడ్బందీగా సమాధానాలు ఇవ్వడం, తదితర అంశాలపై సీఎం కేసీఆర్ స్పష్టమైన సూచనలు చేయనున్నారు. ఈ సమావేశానికి ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానం పంపించారు. రాజ్యసభ ఎన్నికలకు పార్టీ అభ్యర్థులు

మిగతా 2వ పేజీలో

సంక్షేమమే మా విధానం



శనివారం ఢిల్లీలో 51వ స్కోచ్ సదస్సులో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

- సబ్బండ వర్ణాల అభివృద్ధికి కృషిచేస్తున్నాం
- పేదవారిని, పెద్దవారిని కలుపుకొనే పథకాల రూపకల్పన
- స్కోచ్ వార్షిక సదస్సులో మంత్రి కే తారకరామారావు

థర్డ్‌ఫ్రంట్‌తో మంచి పరిణామాలు

- రాబోయే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు మెజార్టీ రాదు
- రాష్ట్రాలపై కేంద్ర పెత్తనం పోవాలనే కేసీఆర్ అంటున్నారు
- శివసేన, టీడీపీ వైదొలగడంతో ఎన్డీయే ఖాళీ
- ఈ పరిస్థితిపై బీజేపీ ఆత్మవిమర్శ చేసుకోవాలి
- సదస్సు అనంతరం మీడియాతో కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

స్వరాష్ట్రంగా అవతరించిన నాటి నుంచి తెలంగాణలో సబ్బండ వర్ణాల సంక్షేమం విధానంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలు, విధానాలు రూపొందిస్తున్నారని తెలిపారు. ఢిల్లీలో శనివారం జరిగిన 51వ స్కోచ్ వార్షిక సదస్సులో పాల్గొన్న మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరించారు. రాష్ట్రంలో వృద్ధిరేటు, ప్రాంతాల అభివృద్ధి, నైపుణ్యాల అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న కేటీఆర్.. దేశంలోనే అన్నిరంగాల్లో తెలంగాణ ముందుకు వెళుతున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ కృషితో విద్యుత్ సమస్యలను అధిగమించి మిగులువిద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతోపాటు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన పారిశ్రామిక విధానం టీఎస్ఐపాస్‌ను వివరించారు. సదస్సు అనంతరం మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అభివృద్ధిపథంలో నడుస్తున్న రాష్ట్రాలన్నింటినీ గుర్తించి స్కోచ్ అవార్డులు ఇస్తున్నారు. మా ప్రభుత్వం గడిచిన మూడున్నరేండ్లుగా సమ్మిళిత అభివృద్ధి సాధిస్తున్నది. వాటిని అందరికీ వివరించాలని నన్ను ఆహ్వానించారు. రాష్ట్రంలో అనుసరిస్తున్న విధానాలను సదస్సులో తెలియజేశాను. విద్యుత్‌రంగంలో సాధించిన పురోగతిని, సోలార్ విద్యుత్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్న విషయాన్ని వివరించాను. నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇంటింటికీ తాగునీరు ఇచ్చే మిషన్ భగీరథ.. ఇలా అనేక కార్యక్రమాలతో పేదలు, పెద్దవారిని కలుపుకొనిపోయేలా చేపడుతున్న విధానాలపై మాట్లాడాను. పురోగమన పారిశ్రామిక విధానం తీసుకొచ్చి దేశంలోనే

మిగతా 2వ పేజీలో

మెగా బడ్జెట్!

పూర్తికావస్తున్న కసరత్తు



- అంచనాలను మించుతున్న రాబడులు
- 19 శాతం ఆర్థికవృద్ధితో మరింత ఊపు
- వాణిజ్యపన్నుల రాబడి 40 వేల కోట్లు
- వ్యవసాయ, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం
- బీసీ సంక్షేమానికి పెరుగనున్న కేటాయింపులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ బడ్జెట్‌కు అధికారులు తుదిరూపమిచ్చారు. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ వరుసగా ఐదోసారి బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టడానికి అవసరమైన తుది కసరత్తును పూర్తిచేస్తున్నారు. ఈసారి గతంలోకంటే బడ్జెట్ భారీగా ఉంటుందని భావిస్తున్నారు. రాబడులు అంచనాలను మించి పెరుగుతున్న క్రమంలో ఈసారి 'మెగా బడ్జెట్' ఉండే అవకాశముందని తెలుస్తున్నది. స్థిరమైన ఆర్థిక వృద్ధితో దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్రం ఈసారి కూడా 19శాతం వృద్ధిరేటునుసా ధించి ఆర్థికప్రగతిలో

మిగతా 13వ పేజీలో

రెండు నాల్కల కాంగ్రెస్

మిల్లింగ్ చార్జీలు పెంచాలని కోరిందీ వారే.. పెంచారని ఇప్పుడు ఆరోపిస్తున్నదీ వారే

- నాడు మిల్లింగ్ చార్జీలు పెంచాలని మంత్రి ఈటలకు పీసీసీ చీఫ్ ఉత్తమ్ లేఖ
- పెంచినందుకు నేడు శివాలెత్తుతున్న కాంగ్రెస్ కొత్త నేత రేవంత్
- తెలివి, సోయిలేకుండా కాంగ్రెస్ నేతల విమర్శలు
- ఉత్తమ్ లేఖను బయటపెట్టిన మిల్లర్ల సంఘం
- ఆరోపణలు రుజువుచేయాలని రేవంత్‌కు సవాల్

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ద్వంద్వ నీతి.. రెండు నాల్కల ధోరణి! ఇటువంటి పదాలు కాంగ్రెస్ నేతలకు సరిగ్గా సరిపోతాయనేందుకు ఇది మరో ఉదాహరణ. ఒకవైపు రైతులకు నీరివ్వాలని డిమాండ్ చేస్తూనే, నీరిచ్చేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టుల నిర్మాణాలకు అడ్డం పడుతున్న కాంగ్రెస్ నేతల ద్వంద్వ వైఖరి తాజాగా మిల్లింగ్ చార్జీల పెంపుదల విషయంలోనూ బయటపడింది. రైస్ మిల్లింగ్ చార్జీలు తక్కువగా ఉన్నాయని, వాటిని పెంచాలని 2015లో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు రెండు పేజీల లేఖ రాస్తే.. అప్పటి సంగతులు తెలియని, కొత్తగా కాంగ్రెస్‌లోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఎడాపెడా మిల్లింగ్ చార్జీలు పెంచేశారంటూ ప్రభుత్వంమీద ఒంటికాలిపై శివాలెత్తుతున్నారు. బస్సుయాత్రలో భాగంగా ఈ నెల 8న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సభలో రేవంత్‌రెడ్డి ఈ ఆరోపణలు చేస్తున్న సమయంలో గతంలో ఈ లేఖ రాసిన



మిల్లింగ్ చార్జీలు పెంచాలంటూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాసిన లేఖను విలేకరుల సమావేశంలో చూపుతున్న కరీంనగర్ జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు భాస్కర్ తదితరులు

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మౌనంగా ఉండటం విశేషం. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాసిన లేఖను కరీంనగర్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ శనివారం బట్టబయలు చేయడంతో కాంగ్రెస్ నిజస్వరూపం మరోసారి ప్రజలకు అర్థమైంది. 2015-16లో మిల్లింగ్ చార్జీలను మంత్రి

మిగతా 11వ పేజీలో

సింగరేణిలో కారుణ్య నియామకాలు

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం.. సర్క్యులర్ జారీచేసిన సంస్థ
- మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- అతి త్వరలో నియామకాల ప్రక్రియ
- కార్మికులు, సంఘాల హర్షాతిరేకాలు

హైదరాబాద్, మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాలు జరిపితీరుతామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిలబెట్టుకున్నారు. డిపెండెంట్ ఉద్యోగాలను సరైన రీతిలో కల్పిస్తామని చెప్పిన ఆయన తొలినుంచి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారు. ఇటీవల సింగరేణి ఏరియాల్లో పర్యటించి కారుణ్య నియామకాలపై త్వరలోనే నిర్ణయం చెప్తామని సీఎం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కార్మికుల ఏండ్ల తరబడి నిరీక్షణకు తెర దించుతూ సింగరేణి సంస్థ శనివారం సర్క్యులర్ జారీచేసింది. సర్వీస్‌లో ఉండగా మరణించిన సందర్భంలో లేదా తీవ్ర అనారోగ్య కారణాలతో ఉద్యోగ బాధ్యత

మిగతా 11వ పేజీలో

ఇండో-ఫ్రెంచ్ సంబంధాల్లో కొత్త శకం

- ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రన్
- భారత్, ఫ్రాన్స్ ఆలోచన విధానం ఒక్కటే: ప్రధాని మోదీ
- ఇరుదేశాల మధ్య 14 కీలక ఒప్పందాలు

5



ఈ-వే బిల్లులొస్తున్నాయ్

వచ్చే నెల 1 నుంచి రాష్ట్రాల మధ్య తప్పనిసరి
15 నుంచి దశలవారీగా రాష్ట్రాల్లోనూ అమలు

15



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో 65వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున టిప్పర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ మరణించాడు

14

అజ్మీర్‌లో గెస్ట్‌హౌస్ స్థలం ఎంపిక

సీఎం కేసీఆర్ ఆమోదించాక తుది నిర్ణయం

అజ్మీర్‌లో కలెక్టర్, రెవెన్యూ అధికారులతో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ బృందం భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న రుబాత్ (గెస్ట్‌హౌస్) కోసం అక్కడి బస్‌స్టాండ్ సమీపంలోని స్థలం పరిశీలనలో ఉన్నదని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. ఈ నెల ఎనిమిదిన డిప్యూటీ సీఎం నేతృత్వంలో తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, మైనారిటీ కమిషన్ సభ్యుడు అర్షద్ అలీ, హజ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ ఎంఏ షఫిఉద్దీన్, టీఆర్‌ఎస్ మైనారిటీ నేత మహ్మద్ షరీఫ్ తదితరులతో కూడిన బృందం రాజస్థాన్‌కు వెళ్లింది. శుక్రవారం అజ్మీర్ కలెక్టర్, రెవెన్యూ అధికారులతో కలిసి పలు స్థలాలను పరిశీలించింది. అజ్మీర్ బస్‌స్టాండ్ ఎదుట ఉన్న 5200 చదరపు గజాల ప్రభుత్వ స్థలం గెస్ట్‌హౌస్‌కు అనువుగా ఉంటుందని బృందం అభిప్రాయపడింది. రెండురోజుల్లో సీఎం కేసీఆర్‌ను కలిసి అజ్మీర్‌లో పరిశీలించిన స్థలాల గురించి వివరిస్తామని డిప్యూటీ సీఎం చెప్పారు. సీఎం ఆమోదించాక తుది నిర్ణయం తీసుకొని స్థల స్వాధీన ప్రక్రియను నెలలోపు పూర్తిచేస్తామన్నారు.



రుబాత్ స్థలం విషయంపై శనివారం అజ్మీర్ కలెక్టర్, ఇతర అధికారులతో చర్చిస్తున్న తెలంగాణ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్ తదితరులు



రాష్ట్ర నీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ కుమారుడి వివాహం శనివారం హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు కే కేశవరావు, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



రాములోరి కల్యాణ ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు

26న రాములోరి కల్యాణం

- ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన మంత్రులు అల్లోల, తుమ్మల
- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం కేసీఆర్ దంపతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. ఈ నెల 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా.. 26న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరుగనున్నది. బ్రహ్మోత్సవం, సీతారాముల కల్యాణోత్సవాల ఆహ్వానపత్రిక, పోస్టర్‌ను మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆవిష్కరించారు. భద్రాద్రిలోని మిథిలా ప్రాంగణంలో జరిగే కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. 26న సీతారాములకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం ఆలయ ఈవో ప్రభాకర శ్రీనివాస శర్మ, ఖమ్మం డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్న తరహాలో భద్రాచలం ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించారని ఆయన పేర్కొన్నారు.

నేడు టీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం

మొదటిపేజీ తరువాయి...

సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఒక స్థానాన్ని యాదవులకు ఇవ్వనున్నట్టు సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. మొత్తం మూడు స్థానాలనూ పార్టీ అభ్యర్థులు సునాయాసంగా గెలుచుకోవడం ఖాయమని తేలిపోయింది. మూడు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 23న జరుగనున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు ఎంఐఎం సంపూర్ణమైన మద్దతు ప్రకటించింది. మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శనివారం ఈ మేరకు ట్వీట్ చేశారు. రాష్ట్ర శాసనసభలో తమ పార్టీ ఎమ్మెల్యేలు.. రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అసెంబ్లీలో మజ్లిస్‌కు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒకవేళ నాలుగో అభ్యర్థి ఈ ఎన్నికల్లో పోటీచేస్తే ఈ నెల 23న పోలింగ్ జరుగుతుంది. ముగ్గురు అభ్యర్థులే బరిలో ఉంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. ఏకగ్రీవంగా ఎన్నిక జరిగితే ఈ నెల 15న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే ఆ ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించినట్టు స్పష్టమవుతుంది. ఎన్నిక జరిగే పరిస్థితి వస్తే మజ్లిస్ ఎమ్మెల్యేలందరూ టీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటేయాలని ఒవైసీ కోరారు. ఈమేరకు మజ్లిస్ పార్టీ శాసనసభా పక్షం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, ముంతాజ్ అహ్మద్ ఖాన్, అహ్మద్‌బిన్‌అబ్దుల్లా బలాల, మౌజం ఖాన్, కౌసర్ మొహియుద్దీన్, జాఫర్‌హుసేన్ మెహరాజ్‌లను అసదుద్దీన్ ఒవైసీ ఆదేశించినట్టు తెలిసింది.

మిలియన్‌మార్చ్ స్ఫూర్తి సభ.. అట్టర్‌ఫ్లాప్!

- కరువైన స్పందన.. కానరాని ప్రజలు
- కోదండరాం పిలుపునకు దక్కని గౌరవం
- సీఎం వెంటే ప్రజలని మరోసారి నిరూపణ
- తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చుతున్న సీఎం కేసీఆర్
- ఏడేండ్ల తర్వాత ఎందుకు గుర్తుకొచ్చింది?
- కోదండరాంను ప్రశ్నించిన ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

2011 మార్చి 10! తెలంగాణ ఉద్యమంలో అతిముఖ్యమైన చారిత్రక ఘట్టం! రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి, ప్రజల ఆకాంక్షను మిలియన్‌మార్చ్ కార్యక్రమంద్వారా ప్రపంచానికిచాటిన సందర్భం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత.. నాటి ఉద్యమనేత కే చంద్రశేఖర్‌రావు నేడు ముఖ్యమంత్రిగా ప్రజారంజకంగా పాలిస్తున్నారు. బంగారు తెలంగాణ లక్ష్యంతో అహర్నిశలు శ్రమిస్తున్నారు. అయితే ప్రస్తుతం అదే మిలియన్ మార్చ్ రోజున 'మిలియన్‌మార్చ్ స్ఫూర్తిసభ' పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించాలనుకున్న వారికి షాక్ తగిలింది. నిరాధార ఆరోపణలతో ప్రజలను రెచ్చగొట్టాలనుకున్నోళ్ల నోరు మూగబోయింది. ప్రతిపక్షాలతో చేతులు కలిపి, తెలంగాణ అభివృద్ధిని ఎలాగైనా అడ్డుకోవాలనే భ్రమతో ప్రభుత్వంపై నిత్యం ఆరోపణలు చేసే టీజేఏసీ చైర్మన్ కోదండరాంకు కాస్తకూడా జనాదరణలేదని రుజువైంది. టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ పిలుపునకు జనాలు స్పందించలేదు. తెలంగాణ ఏర్పడిన నాలుగేండ్ల తర్వాత మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ అని తలపెట్టడంతో ప్రజలు ముందునుంచే ఆసక్తిచూపలేదు. దీన్నొక రాజకీయ స్టంట్‌గానే భావించారు. ఫలితంగానే ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ తదితర చోట్ల ఎక్కడా సందడి కనిపించలేదు. ఎండ తీవ్రతను భరించలేక ఉన్నకొద్దిమంది జేఏసీ నేతలుసైతం రోడ్లమీదకు వచ్చేందుకు ఇష్టపడలేదు. ఒకట్రెండుచోట్ల టీజేఏసీ నేతలు గుమిగూడటంతో స్వల్పంగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేయడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. ఇన్నాళ్లు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కోదండరాంకు ఎంత ప్రజాదరణ ఉందో ఈ సభతో తేలిపోయిందని పలువురు వ్యాఖ్యానించారు. భారీగా ప్రజలువస్తారని ఆశించి భంగపడిన జేఏసీ నేతలు పునరాలోచనలో పడ్డారని తెలుస్తున్నది.

ప్రజారంజక పాలనే కారణం

ఉద్యమనేత కావడం, తెలంగాణ ప్రజల కష్టాలు, అవసరాలు తెలియడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందునుంచి ప్రజల కోణంలోనే ఆలోచించారు. పాలనను వారికి చేరువచేశారు. ప్రస్తుత, భవిష్యత్ తెలంగాణకు అవసరాలను తీర్చే పథకాలకు రూపకల్పన చేశారు. తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్ అయిన.. నిధులు, నీళ్లు, నియామకాలను ప్రజలకు అందిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ పాలన పట్ల నమ్మకం ఏర్పడింది. సీఎం వెంటే తాము అంటూ నిలబడ్డారు. ఇదే విషయాన్ని ఎక్కడ ఎప్పుడు ఎన్నికలు జరిగినా బంపర్ మెజారిటీతో గెలిపించి రుజువుచేశారు. ఈ నేపథ్యంలోనే కోదండరాం పలు సందర్భాల్లో చేసిన విమర్శలకు సమాధానంగా అన్నట్టు ఆయన పిలుపునకు ఎంతటి విలువ ఉన్నదో ఆయనకు అర్థమయ్యేలా ప్రజలు చెప్పారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా తెలంగాణ మార్చ్ స్ఫూర్తి యాత్ర అట్టర్ ఫ్లాప్‌గా మిగిలిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రాజకీయ కోణంతోనే స్ఫూర్తిసభ పిలుపు



మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభలో రాజకీయకోణం దాగి ఉంది. కాంగ్రెస్‌కు ఆయుధంగా మారిన కోదండరాం ప్రజలను రెచ్చగొట్టేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. 2011 నుంచి ఇప్పటివరకు ఏడేండ్లపాటు ఏనాడూ స్ఫూర్తిసభ నిర్వహించని కోదండరాం.. ఇప్పుడు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటి? మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తెలంగాణ వచ్చింది. తెలంగాణ అమరుల ఆశయాలు నెరవేరాయి. కాంగ్రెస్ రాజకీయ అవసరాలు తీర్చేలా కోదండరాం వ్యవహరించడం దురదృష్టకరం. ఈ సభ నిర్వహించి హైదరాబాద్‌లో గందరగోళ పరిస్థితులున్నాయని చెప్పడానికి కోదండరాం పూనుకొన్నారు.

- కర్నె ప్రభాకర్, టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ

ఎవరి కార్యక్రమాలనూ అడ్డుకోలేదు

నాడు జేఏసీ అనేది పార్టీలకతీతంగా ఐక్యంగా నిలిచింది. 2014 నుంచి ఇప్పటి వరకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్రను గానీ, పవన్ కల్యాణ్ సభలను గానీ, తమ్మినేని వీరభద్రం పాదయాత్రనుగానీ ఎక్కడా అడ్డుకోలేదు. కోదండరాం సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు పాదయాత్ర చేసినా అడ్డుకోలేదు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను అడ్డుకోవడంలో టీఆర్‌ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదు. ఇది పోలీసులకు సంబంధించిన వ్యవహారం. దీనిపై టీఆర్‌ఎస్ మీద ఆరోపణలు చేయడం సరికాదు.

- రాకేశ్, తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ చైర్మన్

ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చింది?

ఆనాడు మిలియన్ మార్చ్‌ను అణిచివేయాలని కాంగ్రెస్ చూసింది. కోదండరాం నేడు తెలంగాణ వ్యతిరేకశక్తులతో, రహస్య కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. గత ఏడేండ్లుగా గుర్తుకురాని మిలియన్‌మార్చ్ స్ఫూర్తి సభ ఇప్పుడు ఎందుకు గుర్తుకువచ్చిందో ప్రజలు గమనిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేలా ప్రభుత్వ వ్యతిరేక శక్తులతో కోదండరాం జతకడుతున్నారు. నాటి జేఏసీ నేతలైన స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దేవీప్రసాద్ తదితరులంతా కేసీఆర్‌వెంటే ఉన్నారు. ప్రజల్లో గౌరవం పోగొట్టుకునేలా కోదండరాం వ్యవహరిస్తున్నారు.

- నాగేందర్‌గౌడ్, తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

మల్కాపురం టెండర్లకు చర్యలు

- త్వరలో నీటిపారుదలశాఖ నోటిఫికేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవాదుల ఎత్తిపోతల పథకంలో నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతోపాటు గ్యాప్ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చేపట్టనున్న మల్కాపురం రిజర్వాయర్ నిర్మాణ పనులకు టెండర్లు పిలిచేందుకు నీటిపారుదలశాఖ కసరత్తు చేస్తున్నది. త్వరలో టెండరు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. దేవాదుల ద్వారా కరీంనగర్, వరంగల్, నల్లగొండ, మెదక్ జిల్లాల పరిధిలోని 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలి. కానీ అందుకు తగిన నీటినిల్వ సామర్థ్యం లేకపోవడంతో ప్రభుత్వం మల్కాపురం రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకొన్నది. రూ.3,170.70 కోట్ల అంచనా వ్యయంతో మల్కాపురం ప్రాజెక్టుకు సంబంధించి వ్యాప్కోస్.. డీపీఆర్‌ను కూడా గతంలోనే ప్రభుత్వానికి సమర్పించింది. ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద 1412.58 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ఉండే హెడ్ రెగ్యులేటర్‌ను ఏర్పాటుచేసి, రెండు సర్వీస్ గేట్లు, మరో రెండు అత్యవసర గేట్లు నిర్మిస్తారు. అక్కడి నుంచి గోదావరిజలాల్ని అప్రోచ్ చానల్ ద్వారా సమీపంలో నిర్మించే పంపుహౌజ్‌కు తరలిస్తారు. మోటర్ల ద్వారా లిఫ్టుచేసిన నీటిని 2.5 మీటర్ల డయా ఉండే మూడు డెలివరీ పైపుల ద్వారా మల్కాపురం రిజర్వాయర్ వరకు తరలిస్తారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.31 గంటలకు



సూర్యాస్తమయం: 6.21 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం నవమి ఉదయం 8.38 వరకు, తదుపరి దశమి నక్షత్రం: మూల ఉదయం. 6.29 వరకు తదుపరి పూర్వాషాఢ. అమృతఘడియలు: లేవు, రాహుకాలం: సాయంత్రం 4.53 నుంచి 6.21 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.47 నుంచి 5.34 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.31 నుంచి సాయంత్రం 5.07 వరకు.





ఢిల్లీలో శనివారం జరిగిన 51వ స్కోచ్ వార్షిక సదస్సులో పాల్గొన్న రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు తదితరులు.. మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సంక్షేమమే మా విధానం

మొదటిపేజీ తరువాయి...

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో నిలిచాం. రాష్ట్రంలోకి వస్తున్న పరిశ్రమల గురించి, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాను. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న మంచిని పుస్తకరూపంలో తెస్తే బాగుంటుందని స్కోచ్ నిర్వాహకులకు సూచించాను' అని తెలిపారు. దేశంలో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దేశం అభివృద్ధి చెందుతున్నా, మరోవైపు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తంచేశారు.

థర్డ్ ఫ్రంట్ మంచి పరిణామాలకు దారితీస్తుంది

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇటీవల ప్రతిపాదించిన థర్డ్ ఫ్రంట్ మంచి పరిణామాలకు దారితీస్తుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించినప్పుడు 'థర్డ్ ఫ్రంట్ కాదు.. ఫస్ట్ ఫ్రంట్ అనొచ్చు కదా!' అని చమత్కరించారు. దేశంలో ఉన్నది రెండు పార్టీల వ్యవస్థ కాదని, రెండు పార్టీల మధ్య పోరాటం అంతకన్నా కాదని కేటీఆర్ అన్నారు. బహుళపార్టీల వ్యవస్థ, ప్రాంతీయ పార్టీలు చాలా బలంగా ఉన్న మన దేశంలో ముందస్తు ఎన్నికలు వచ్చినా, షెడ్యూల్ ప్రకారం జరిగినా ఎట్టి పరిస్థితుల్లో ఏ ఒక్క పార్టీకీ పూర్తిస్థాయి మెజార్టీ రాదని రాజకీయ నిపుణులు అంతా భావిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీని చూసినా, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీని చూసినా రెండూ పూర్తి మెజార్టీ సాధించే పరిస్థితుల్లో లేవని అన్నారు. కేంద్రంలో కేంద్రీకృతమైన పెత్తనాన్ని ప్రశ్నించేవిధంగా, ఫెడరల్ వ్యవస్థ ప్రతిబింబంగా దేశంలో ఓ కొత్త ప్రత్యామ్నాయం వస్తే మంచిదనే ఉద్దేశంతో ఓ చర్చకు సీఎం శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. ఢిల్లీలో కేంద్రీకృతమైన పెత్తనాలు, అధికారాలపై చర్చ జరుగాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. ఉపాధి హామీ కూలీల డబ్బులు కూడా ఢిల్లీలో వేస్తే గ్రామాల్లో తీసుకొనే పరిస్థితి ఎందుకు ఉండాలనే దానిపై కేసీఆర్ ప్రశ్నిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో కేంద్రానికి పనేంటని ప్రశ్నించారు. 'రాష్ట్రాలు బాగుంటే దేశం బాగుంటుంది. మొత్తం అధికారాలు కేంద్రీకృతం అయితే దేశానికి అపారమైన నష్టం జరుగుతుంది కాబట్టే ఒక కొత్త చర్చను లేవనెత్తారు. ఇది భవిష్యత్తులో మంచి పరిణామాలకు దారితీస్తుందని విశ్వసిస్తున్నాను' అని మంత్రి కేటీఆర్ చెప్పారు.

బీజేపీ ఆత్మవిమర్శ చేసుకోవాలి

విభజన చట్టంకంటే కేంద్రం నుంచి ఈ మూడున్నరేండ్లలో ఒక్క పైసా కూడా అదనంగా తెలంగాణకు రాలేదని మంత్రి కేటీఆర్ చెప్పారు. 'విభజన చట్టంలో చెప్పిన విధంగా ఒక్క ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ఇవ్వలేదు. ఏపీకైనా కొన్ని ఇచ్చారు. ఎన్ఐడీ, ఐఐఎం వంటివి ఇందులో ఉన్నాయి. మా దగ్గర లెక్కలతో సహా వివరాలు ఉన్నాయి' అని కేటీఆర్ చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే విషయాన్ని తెలిపారని పేర్కొన్నారు. 'రూ.81,000 కోట్లు మాత్రమే తెలంగాణకు వచ్చాయి. మా రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై గతంలో ఎన్నోసార్లు నివేదించాం. ప్రధానమంత్రితోపాటు అనేకమంది మంత్రులను కలిసి విన్నవించాం. అయితే పరిస్థితుల్లో మార్పులేదు. మాకెదురైన అనుభవమే ఆంధ్రా మిత్రులకు కూడా ఎదురైనట్టుంది. అందుకే వారు బయటకు వచ్చారు. నిజంచెప్పాలంటే.. ఎన్డీయేకు ఆ కూటమిలో ఎవరూ మిగలలేదు. శివసేన వైదొలిగిన తర్వాత, టీడీపీ బయటకు వచ్చాక ఆ కూటమిలో ఎవరూ లేరు. బలహీనపడ్డ అకాలీదళ్, బీజేపీ తప్ప ఎన్డీయేలో ఎవరూ లేరు. అధికార కూటమి నుంచి అంతా ఎందుకు వెళ్లిపోతున్నారో బీజేపీ పునరాలోచించుకోవాలి. ఆత్మవిమర్శ చేసుకోవాలి' అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతాలుగా చారిత్రక ప్రదేశాలు

- తెలంగాణ అతిథులకు అన్ని సౌకర్యాలు
- పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు
- నమస్తే తెలంగాణతో టూరిజం కార్పొరేషన్ ఎండీ మనోహర్‌రావు



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: తెలంగాణలో గొప్ప చారిత్రాత్మక ప్రదేశాలు ఉన్నాయని, వాటన్నింటినీ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తామని పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ కొత్త చైర్మన్ బోయినపల్లి మనోహర్‌రావు అన్నారు. తొలిసారి తెలంగాణబిడ్డకు టూరిజం కార్పొరేషన్ ఎండీగా అవకాశం లభించిందని, ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మనఃస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్తున్నానని పేర్కొన్నారు. సీఎం ఆదేశాల ప్రకారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థను సుసంపన్నం చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. శుక్రవారం, టూరి జం కార్పొరేషన్ ఎండీగా ఉత్తర్వులు అందుకొన్న ఆయన సోమవారం బాధ్యతలను చేపడుతారు. ఈ సందర్భంగా మనోహర్‌రావు శనివారం నమస్తే తెలంగాణ ప్రతినిధికి భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. విదేశీ, ఇతర రాష్ట్రాల పర్యాటకులు సాధారణంగా చారిత్రాత్మక ప్రదేశాలను, తెలంగాణలోని గొప్ప గొప్ప దేవాలయాలను సందర్శించేందుకు ఆసక్తిని కనబరుస్తుంటారని, అం దుకని అటువంటి ప్రాంతాలలో దృష్టి కేంద్రీకరిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కుతుబ్‌షాహి టూంబ్స్ అభివృద్ధి కార్యాచరణ, చార్మినార్ అభివృద్ధి పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాలు, చెరువులు, దేవాలయాలను పర్యాటకంగా అభివృద్ధిపరిచేందుకు ప్రణాళికలను రూపొందించి సీఎం కేసీఆర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు. పర్యాటకులు రవాణా సదుపాయాలు, హోటళ్ల వసతి, హాస్పిటాలిటీ, భద్రత వంటి సమస్యలను ఎదుర్కొంటారని, మూడు దశాబ్దాలుగా ఈ రంగంలో ఉన్నందున, అందరి సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకొంటామని చెప్పారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు ఆశీస్సులు తీసుకుంటానని తెలిపారు. కేంద్రం నుంచి స్వదేశీదర్శన్, ప్రసాద్‌దర్శన్ పథకాల ద్వారా నిధులు తెచ్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయని మనోహర్‌రావు వివరించారు. స్వదేశీదర్శన్ పథకంలో భాగంగా ఆగాఖాన్ ట్రస్ట్‌కు రూ.100 కోట్లు ఇచ్చారని, ఈ నిధులతో టూంబ్స్ సుందరీకరణ జరుగుతున్నదని వెల్లడించారు. అటవీశాఖ సమన్వయంతో పర్యావరణ పర్యాటకం అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. హోటలేయర్స్ అసోసియేషన్‌తో సంప్రదించి సదుపాయాలను పెంచేవిధంగా చర్యలు తీసుకొంటామని తెలిపారు. మిషన్ కాకతీయలో దాదాపు తెలంగాణలోని చెరువులన్నీ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నందున, ప్రతీ చెరువునూ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తామన్నారు.

నేటినుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

అవేర్‌నెస్ వాక్‌ను ప్రారంభించనున్న మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి లక్ష్మారెడ్డి ఆదివారం ఉదయం 7.30 గంటలకు సరోజినీదేవి కంటి దవాఖాన నుంచి గ్లకోమా అవేర్‌నెస్ వాక్‌ను ప్రారంభించనున్నారు. ఈ వాక్‌ను అంధత్వ నివారణ సంస్థ, సరోజినీదేవి కంటి దవాఖాన కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆదివారం నుంచి వారంపాటు గ్లకోమా వారోత్సవాలను జరుపుతారు. నీటి కాసులుగా పిలిచే ఈ వ్యాధి నిశబ్దంగా కంటిచూపుపై ప్రభావం చూపిస్తుందని సరోజినీదేవి కంటి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ వ్యాధిపై అవగాహన కోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ర్యాలీలు, సెమినార్లు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

లోకం పోకడ



చీకట్లో శివాలయం అని తెలియక జొరబడ్డాం.. బూడిద తప్ప మరేం దొరుకలేదు సార్, ఆ శివుడి మీదొట్టు!



శనివారం ఢిల్లీలో ఇండో-ఫ్రెంచ్ భాగస్వామ్య సదస్సు సందర్భంగా కేంద్రమంత్రి సురేశ్ ప్రభు, రాష్ట్ర మంత్రి కే తారక రామారావు, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి లీ డ్రెన్ సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న సాఫ్రాన్ సీఈవో ఫిలిప్ పెటిట్‌కొలిన్, తెలంగాణ పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

రాష్ట్రానికి సాఫ్రాన్ ఏరోస్పేస్ యూనిట్

- మంత్రి కేటీఆర్ సమక్షంలో ఫ్రెంచి కంపెనీ ఎంవోయూ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మరో ఏరోస్పేస్ యూనిట్ ఏర్పాటు కానున్నది. ప్రభుత్వ విధానాలు నచ్చి ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక కంపెనీలు ఎంవోయూలు చేసుకోగా.. తాజాగా మరో కంపెనీ మన రాష్ట్రంలో యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. విమానాలకు ప్రధానమైన ఎలక్ట్రికల్ పరికరాలను తయారుచేసే సాఫ్రాన్ ఎలక్ట్రికల్స్ అండ్ పవర్ సిస్టం కంపెనీ.. ఢిల్లీలో శనివారం జరిగిన ఇండో-ఫ్రెంచ్ భాగస్వామ్య సదస్సులో తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నది. కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభు, రాష్ట్ర మంత్రి కేటీఆర్, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి లీ డ్రైన్ సమక్షంలో సాఫ్రాన్ సీఈవో ఫిలిప్ పెటిట్‌కొలిన్, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ ఎంవోయూపై సంతకాలు చేశారు. రూ.52 కోట్లు విలువ చేసే ఈ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తారు. దీనివల్ల 250 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టును పూర్తిచేస్తామని కంపెనీ సీఈవో ఫిలిప్ పెటిట్‌కొలిన్ ప్రకటించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని స్పెషల్ ఎకనామిక్‌జోన్‌లో ఈ యూనిట్ ఏర్పాటుచేస్తారు. సాఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ కంపెనీ [illegible] సిస్టమ్స్ రంగంలో తనదైన ముద్ర వేసింది.

నేడు రెండోవిడుత పల్స్‌పోలియో

- 36,55,204 మంది చిన్నారులకు పోలియో చుక్కలు
- పోలియోరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలి
- వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ సీ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రెండోవిడుత పల్స్‌పోలియో కార్యక్రమంలో ఐదేండ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పోలియో చుక్కల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. ఆదివారం చుక్కలు వేయించని పిల్లల కోసం తదుపరి రెండురోజులు వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. మెహిదీపట్నం సమీపంలోని అఫ్జల్‌సాగర్ యూపీహెచ్‌లో ఉదయం పోలియో చుక్కలు వేసి తాను ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు మంత్రి చెప్పారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పోలియో కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.



22,768 పోలియో కేంద్రాల ద్వారా చుక్కల పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా 36,55,204 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 22,768 పోలియో కేంద్రాల ద్వారా 95,500 మంది సిబ్బంది పోలియో చుక్కలువేస్తారని చెప్పారు. ప్రయాణాల్లో ఉన్నవారి కోసం 737 ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా అన్ని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధానకూడళ్లలో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 787 మొబైల్ టీంలు, 2,280 రూట్ సూపర్‌వైజర్లు, 8,711 మంది ఏఎన్‌ఎంలు, 27,045 మంది ఆశా వర్కర్లు, 32,082 అంగన్‌వాడీవర్కర్లు పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొంటున్నారని మంత్రి వివరించారు. ఈ ఏడాది జనవరి 28న నిర్వహించిన తొలివిడుత పల్స్ పోలియో విజయవంతమైందన్నారు. ఏడేండ్లుగా రాష్ట్రంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని మంత్రి చెప్పారు. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, నైజీరియా వంటి దేశాల్లో పోలియో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.



శనివారం బహ్రెయిన్‌లో టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ కార్యవర్గ సమావేశంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శులు లింబాద్రి, డాక్టర్ రవి, కార్యదర్శులు రవి పటేల్, గంగాధర్, సుధాకర్, సంయుక్త కార్యదర్శులు దేవన్న, విజయ్, సుధాకర్, కార్యవర్గసభ్యులు రాజేశ్, నర్సయ్య, రాజు, రాజేందర్, వెంకటేశ్, సాయన్న, వసంత్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

వానకాలం కోటి ఎకరాల్లో సాగు!

- పెట్టుబడి సాయంతో పెరుగనున్న పంట విస్తీర్ణం
- వ్యవసాయశాఖ అంచనా.. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



గత మూడేండ్లుగా వానకాలం సాగు విస్తీర్ణం వివరాలు

సంవత్సరం	సాగువిస్తీర్ణం
2015	87.03 లక్షల ఎకరాలు
2016	92.12 లక్షల ఎకరాలు
2017	96.37 లక్షల ఎకరాలు
2018	1.15 కోట్ల ఎకరాలు (అంచనా)

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 'పెట్టుబడి సాయం' పథకం అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం కోటి ఎకరాలు దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే వానకాలం సీజన్‌లో రాష్ట్రంలో 1.15 కోట్ల ఎకరాల భూమి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. 2018 వానకాలం పంటల సన్నద్ధతకు సంబంధించి ఢిల్లీలో జరిగిన జోనల్ సదస్సులో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయశాఖ ఈ మేరకు నివేదించింది. గతేడాది వానకాలంలో 1.06 కోట్ల ఎకరాల సాధారణ సాగు అంచనా వేయగా.. 96.61 లక్షల ఎకరాలలో పంట విస్తీర్ణం నమోదైంది. 2018 వానకాలంలో 19 శాతం విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తున్నది. ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి కింద ఎకరాకు రూ. 4000 వేలు ఇవ్వనున్నందున సాగువిస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు స్పష్టంచేశాయి. ప్రస్తుత అంచనాలమేరకు 1.15 కోట్ల ఎకరాలు సాగు అవుతుందని అనుకుంటున్నామని, ఇంకా పెరిగే అవకాశాలున్నట్టు నివేదికలో పేర్కొన్నారని సమాచారం. ఎరువుల కేటాయింపులు ముందస్తుగానే తగిన స్థాయిలోసరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఈ సదస్సులో కోరినట్టు తెలిసింది. చిన్న, సన్నకారు రైతులకు కూడా పెట్టుబడి సొమ్ము ఇస్తే ఇప్పటివరకు సాగులో లేని భూమిలో కొంతైనా సాగుచేసేందుకు ముందుకు వస్తారని ప్రభుత్వం భావిస్తున్నది. ఇటీవల జరిగిన రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సుల్లో వానకాలంలో నికరంగా 1.65 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. రెండు సీజన్లు కలిపి రూ. 12 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని కూడా వెల్లడించారు. వీటన్నింటికీ కాలం సహకరిస్తే సాగుకు ఎటువంటి ఢోకా ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వాస్తవానికి గత మూడేండ్లు వానకాలం సీజన్‌లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తున్నది. ఈ ఏడాది ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయంతో మరింత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయి.

'రెరా' ఏర్పాటుకు అడుగులు

- అధ్యయనం కోసం మహారాష్ట్ర, కర్ణాటకలకు కమిటీ
- రేపట్నుంచి రెండు రోజులపాటు పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'రెరా' (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నది. మహారాష్ట్ర, కర్ణాటకలో అమలవుతున్న 'రెరా'పై అధ్యయనానికి పురపాలకశాఖ డైరెక్టర్ బాలకృష్ణ, జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డి, డీటీసీపీ ప్రాంతీయ సంచాలకుడు కే విద్యాధర్‌లతో కూడిన కమిటీ సోమవారం నుంచి రెండురోజులు ఆ రాష్ట్రాల్లో పర్యటిస్తారు. ఆ రాష్ట్రాల్లో 'రెరా', రెరా పోర్టల్ ఏర్పాటు వంటి అంశాలను కమిటీ అధ్యయనం చేస్తుంది. నిర్మాణసంస్థలు, కొనుగోలుదారుల మధ్య వివాదాల పరిష్కారానికి తీసుకొంటున్న నిర్ణయాలను పరిశీలించి వారం రోజుల్లోపు ప్రభుత్వానికి నివేదికను అందజేస్తుంది. ఆ నివేదిక అందాక.. 'రెరా' పోర్టల్‌ను ఏర్పాటుపై పురపాలక శాఖ నిర్ణయం తీసుకొంటుంది. ప్రభుత్వ నిర్ణయాలతో కొంతకాలంనుంచి రాష్ట్రంలో రియల్ రంగం పుంజుకొన్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్తగా నిర్మాణాలను చేపట్టడానికి అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి.'రెరా' ఏర్పాటు ఈ ప్రక్రియను వేగవంతం చేయడం పట్ల రాష్ట్ర నిర్మాణరంగం హర్షం వ్యక్తంచేస్తున్నది.

బాల్యం భద్రం-భవిత బంగారం

- టీ సాట్‌లో రేపటినుంచి ప్రత్యేక కార్యక్రమం.. ఐదునెలలపాటు ప్రసారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీ-సాట్ నెట్‌వర్క్ చానళ్లు విద్య, ఉద్యోగం, పోటీ పరీక్షల శిక్షణ ప్రసారాలే కాక సామాజిక అంశాలపై దృష్టిసారించాయి. చిన్నారుల భవిష్యత్తుకు ఉపయోగపడే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ నెల 12 నుంచి టీ సాట్ 'బాల్యం భద్రం- భవిత బంగారం' అనే కార్యక్రమాన్ని ప్రసారం చేయనున్నది. రోజు అరగంట చొప్పున 150 రోజులు ప్రసారం చేస్తామని టీ సాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టీ సాట్ నిపుణ చానల్‌లో ఉదయం 11 నుంచి 11.30 గంటలవరకు, విద్య చానల్‌లో మధ్యాహ్నం 3.15 నుంచి 3.45 గంటల వరకు ప్రసారం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మానసిక శాస్త్రవేత్తలు, వైద్యులు ఈ కార్యక్రమం ద్వారా సలహాలు, సూచనలు అందిస్తారని వెల్లడించారు. చిన్నారులకు బాల్యంలోనే మంచి పునాది వేయాలనేసం కల్పంతో ఈ ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్టు ఆయన పేర్కొన్నారు.

మే లోపు 31 పట్టణాల మాస్టర్ ప్లాన్ సిద్ధం!

- డీటీసీపీ ప్రాంతీయ సంచాలకుడు వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లా కేంద్రాల అభివృద్ధికి బృహత్ ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆదేశించడంతో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) కార్యాచరణ ప్రారంభించింది. సిద్ధంగా ఉన్న 26 పట్టణాల మాస్టర్ ప్లాన్లను రివిజన్ చేయాలని డీటీసీపీ నిర్ణయించింది. నాగర్‌కర్నూలు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, పెద్దపల్లి, ఆసిఫాబాద్‌కు సంబంధించిన బృహత్ ప్రణాళికలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ ప్రక్రియను మే నెలలోపు పూర్తిచేయడానికి ప్రయత్నిస్తున్నామని డీటీసీపీ ప్రాంతీయ సంచాలకుడు కే విద్యాధర్ తెలిపారు.

గుండెపోటు ప్రాణాంతకం -తక్షణ ఆంజియోగ్రామ్‌తో 'హార్ట్ ఎటాక్' నుండి సంపూర్ణ రక్షణ

గుండె నొప్పిని నిర్లక్ష్యం చేయవద్దు... తక్షణ చికిత్సతో ప్రాణాలకు ధీమా

మనోహరి (25) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అమెరికాలో వేగంగా మారిపోతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గడువుకంటే ముందే ప్రాజెక్ట్ పూర్తిచేయాలన్న మేనేజ్‌మెంట్ సూచనతో రోజూ అదనపు గంటలు పని చేస్తున్నది. ప్రాజెక్ట్ మూడొంతులు పూర్తయిన దశలో ఓ రోజు సాయంత్రం చాలా బలహీనంగా, ఆందోళనగా ఉండి శ్వాస తీసుకోవటం కష్టంగా అనిపించింది. ఆ విషయం సహోద్యోగులతో చెప్పి ఆ పైన కొద్ది నిముషాలకే కాఫీ మిషన్ దగ్గరకు వెళ్లేందుకు లేచి హఠాత్తుగా వర్క్ స్టేషన్‌లో కుప్పకూలి పడిపోయింది. టీమ్ లీడర్ పూనుకుని వెంటనే దగ్గరలోని ఓ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. సడన్ హార్ట్ ఏటాక్ గురయినట్లు గుర్తించిన డాక్టర్లు వెంటనే ఆంజియోప్లాస్టీ చేయటంతో ప్రాణానికి ప్రమాదం తప్పిపోయింది.

శ్రీధర్ రావు (54) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. ముఖ్యమైన ప్రాజెక్టుకు సంబంధించి రైతుల నుంచి భూముల సేకరణ బాధ్యతను నిర్వహిస్తున్న ఆయన దాని నిర్మాణపు పని ప్రారంభానికి ప్రకటించిన తేదీకల్లా భూసేకరణ పూర్తిచేసేందుకు ఆ ఇంజనీరింగ్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న స్థానిక రాజకీయ నాయకులు, వారి ప్రోద్బలంతో భూములు ఇవ్వటానికి నిరాకరిస్తున్న రైతులతో చర్చలు జరిపి నచ్చజెప్పటంతో తలమునకలుగా ఉన్నారు. రైతుల ప్రతినిధులతో ఒప్పించేందుకు చర్చలు జరుపుతుండగా ఛాతీ-రొమ్ము ఎముక కింద-ఎడమ చేతిలో భారంగా, వత్తిడిగా, నొప్పిగా అనిపించింది. ప్రక్కనే ఉన్న బాటిల్ నుంచి నీళ్లు తాగుతూ అలాగే పక్కకు ఒరిగిపోయారు. అప్పటివరకూ పట్టుదలతో ప్రాజెక్టు భూముల సేకరణ పూర్తిచేసిన తమ పై అధికారి పడిపోవటంతో సిబ్బంది పూనుకుని ఆయనను హడావుడిగా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. శ్రీధర్‌రావుకు హఠాత్తు గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించిన డాక్టర్లు వెంటనే ఆంజియోప్లాస్టీచేసి స్టెంటు వేసారు. సరైన సమయానికి ఆస్పత్రికితెచ్చి సీనియర్ అధికారి ప్రాణాలు కాపాడినందుకు సిబ్బందిని అభినందించారు.

ఈ రకంగా హఠాత్తు గుండెపోటుకు గురై ఆస్పత్రికి వచ్చిన వారిని డాక్టర్లు ఆంజియోగ్రామ్ పరీక్ష చేయించి పరిస్థితి తీవ్రతను గుర్తిస్తారు. అవసరాన్నిబట్టి ప్రైమరీ ఆంజియోప్లాస్టీ చేసి కాపాడతారు. ఊహించని రీతిలో దాడిచేసిన గుండె వ్యాధిని సమయస్ఫూర్తితో ఎదుర్కొనే ఈ ప్రక్రియ (ప్రొసీజర్) ఓ ప్రాణరక్షణ చికిత్సగా విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. అందుకోసం గుండెపోటుకు గురై ఆస్పత్రికి వచ్చిన పేషంట్లకు మొదట కరొనరీ ఆంజియోగ్రామ్ చేసి కారణాన్ని నిర్ధారించుకోవటంతో పాటు ఆంజియోప్లాస్టీ కూడా నిర్వహిస్తారు. మనదేశంలో ప్రతీ 33 సెకండ్లకు ఒకరు చొప్పున గుండెపోటుకు గురవుతున్నారు. ఈ విధంగా ఏటా ఇరవై లక్షల మంది హార్ట్ ఎటాక్ కారణంగా మరణిస్తున్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల వారితో పోలిస్తే భారతీయులు సగటున పది సంవత్సరాలు ముందుగానే గుండెపోటుకు గురవుతున్నారు. వైద్య పరిభాషలో సైలెంట్ మయోకార్డియల్ ఇన్‌ఫెక్షన్ అని పేర్కొనే గుండెపోటుకు గురవుతున్న మన దేశస్థుల్లో ఎక్కువ మంది యువజనులు, మధ్యవయస్కులే. సంపాదనాపరులుగా కుటుంబానికి ఆర్థిక ఆధారంగా ఉండే వీరి అకాల మరణం వల్ల లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. హఠాత్తు గుండెపోటు ఎందుకు వస్తుంది? ఈ రకంగా గుండెపోటుకు గురయినపుడు చేసే ప్రైమరీ ఆంజియోప్లాస్టీ అంటే ఎమిటి? ఈ అంశాలను గూర్చి తెలిసి ఉండటం వల్ల వెంటనే పూనుకుని వారిని రక్షించుకునేందుకు తోడ్పడుతుంది.

గుండెపోటును గుర్తించటం ఎలా?

స్పష్టమైన లక్షణాలతో, ముందుగానే తెలిసి చికిత్స పొందేందుకు వీలయ్యే ఇతర అనేక రకాల వ్యాధులతో పోలిస్తే గుండెపోటు పూర్తిగా భిన్నమైనది. అయితే గుండెపోటు రావటానికి కొంత ముందుగా కనిపించే కొన్ని లక్షణాలతో మాత్రం దీనిని గుర్తించి వెంటనే ఆస్పత్రికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. గుండెపోటును సూచించే లక్షణాలు కొన్ని: చాతీ-రొమ్ము ఎముక కింద-ఎడమచేయి భారంగా, వత్తిడిగా, నొప్పిగా అనిపిస్తుంది. ఈ అసౌకర్యం వీపువైపు, దవడలు-చేతి గుండా వ్యాపిస్తున్నట్లు తోస్తుంది. కడుపు ఉబ్బరంగా, అజీర్తిగా, ఏదో అడ్డుపడుతున్నట్లుగా అనిపిస్తుంది. చెమట పడుతుంది, వికారంగా, వాంతి వస్తున్నట్లుగా ఉంటుంది. చాలా బలహీనంగా, ఆందోళనగా ఉండి శ్వాస తీసుకోవటం కష్టంగా తోస్తుంది. గుండె వేగంగా, అసహజంగా కొట్టుకుంటూంటుంది. ఈ లక్షణాలు గరిష్టంగా అరగంటపాటు కనిపిస్తాయి. కొంత మందిలో ఈ లక్షణాలు ఏమీ కనిపించకుండా గుండెపోటు వస్తుంది. దీనిని సైలెంట్ మయోకార్డియల్ ఇన్‌ఫెక్షన్ (ఎం.ఐ.) అంటున్నారు.

హఠాత్ గుండెపోటుకు కారణాలు ఏమిటి?

గుండెపోటు హఠాత్తుగానే వచ్చినట్లు కనిపించినా ఈ పరిస్థితి ఏర్పడటానికి వ్యక్తికి తెలియకుండా శరీరంలో చాలానే జరుగుతుంది. శరీరంలోని అన్ని ఇతర భాగాల వలెనే గుండె కండరాలకు కూడా ఆక్సీజన్‌తో కూడిన శుద్ధ రక్తం అవసరం. కరొనరి ధమనుల ద్వారా



నిరంతరం ఈ సరఫరా జరుగుతూ ఉంటుంది. ప్రతీ కరొనరి ధమని గుండెలో ఓ నిర్దిష్ట భాగానికి శుద్ధిచేసిన రక్తాన్ని సరఫరా చేస్తుంటుంది. గుండె ధమనులకు వ్యాధి సోకినా అవి కుచించుకుపోయి తగిన పరిమాణంలో శుద్ధ రక్తం సరఫరా చేయలేవు. కొవ్వు-కాల్షియం-ప్రొటీన్‌లు లోపలి గోడలపై పాచిలాగా పేరుకుపోవటం వల్ల లేదా వాచిపోవటం వల్ల ఈ ధమనులు కుచించుకుపోతాయి. ఈ పాచి ఉపరితలంలో దృఢంగా ఉంటుంది. కొంత కాలానికి దీనిలో పగుళ్లు ఏర్పడతాయి. రక్తం గడ్డ కట్టడానికి తోడ్పడే ప్లేట్లెట్లు (సూక్ష్మమైన పళ్లాల రూపంలో ఉంటాయి) ఈ పగుళ్లలో చిక్కుకుపోతాయి. దీంతో ఆ ప్రాంతంలో రక్తం గడ్డ కడుతుంది. ఈ రకంగా కరొనరి ధమనుల లోపలి భాగం మరింతగా కుచిస్తుంది. ఈ పాచి, పగుళ్ల వద్ద గడ్డకట్టిన రక్తం కారణంగా ధమని పూర్తిగా మూసుకుపోయిన పక్షంలో దాని ద్వారా రక్తం సరఫరా కావలసిన గుండె కండరాలకు పోషకాపూర్తిగా నిలిచిపోయి చచ్చుబడిపోతాయి. దాంతో గుండెపోటు వస్తుంది.

సాధారణంగా గుండెపోటుకు ఇదే కారణం అయినప్పటికీ కరొనరీ ధమనులో ఏర్పడే తీవ్రమైన సంకోచ వ్యాకోచాలు కూడా గుండెపోటుకు దారి తీస్తాయి. ఈ విధంగా సంకోచించిన సమయంలో ధమనుల ద్వారా గుండె కండరాలకు జరిగే రక్తం సరఫరా చాలా తక్కువ పరిమాణానికి పడిపోవటమో లేక పూర్తిగా నిలిచిపోవటమో జరుగుతుంది. వ్యక్తి విపరీతమైన శారీరక - మానసిక శ్రమ చేయటం వల్ల, తీవ్ర వత్తిడికి లోనైనప్పుడు ఒక్కసారిగా గుండెపోటు రావచ్చు. విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, కరొనరీ ధమనులకు సంబంధించి పెద్దగా సమస్యలు లేని సందర్భంలో కూడా ఇది జరగవచ్చు. గుండెపోటుకు గురైన విషయం గుర్తించిన వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలనటంలో రెండో మాటకు తావేలేదు. అయితే స్వల్పస్థాయి (మైల్డ్) గుండెపోటు వచ్చిన వెంటనే గుండె కూడా స్వయంగా మరమ్మత్తు చేసుకోవటం ప్రారంభిస్తుంది. చాలా సందర్భాలలో వ్యక్తి తాను మైల్డ్ హార్ట్ ఎటాక్‌కు గుర్తించలేరు. అది జరిగిన ఎనిమిది వారాల్లో పూర్తయ్యే ఈ మరమ్మత్తు వల్ల చర్మం లాగానే అక్కడ మచ్చ ఏర్పడుతుంది. అయితే మరమ్మత్తు జరిగి మచ్చ ఏర్పడిన గుండె భాగం సంకోచ వ్యాకోచ శక్తిని కోల్పో తుంది. అంటే గుండెలోని ఆ భాగం తన విధిని ఇంక ఏమాత్రం నిర్వర్తించ లేదన్నమాట.

హఠాత్తు గుండెపోటు వస్తే ఏం చేయాలి?

హఠాత్తుగా గుండెపోటుకు గురయిన వారిని తక్షణమే ఆస్పత్రికి తరలించాలి. ఈ విధంగా ఏమాత్రం ఆలస్యం చేయకుండా తీసుకువెళితే మూసుకుపోయిన ధమనిని తెరచి, గుండెకు జరిగే నష్టాన్ని నివారించటానికి వీలవుతుంది. గుండెపోటు లక్షణాలు కనిపించిన తరువాత ఒకటి నుంచి రెండు గంటల సమయం అతి ముఖ్యమైనది. ఆ లోపల వైద్యం అందించటంలో జాప్యం జరిగిన కొద్దీ గుండెకు నష్టం పెరిగిపోవటంతో పాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గుండెపోటును నిర్ధారించిన వెంటనే చికిత్స ప్రారంభించాల్సి ఉంటుంది. చాలా సందర్భాలలో ఇది అంబులెన్స్‌లోనే ప్రారంభమవుతుంది. ఆస్పత్రికి చేర్చగానే వ్యక్తిని ఎమర్జనీ గదిలోకి అక్కడి నుంచి కాథ్‌లాబ్‌లోకి తీసుకువెళతారు. మొదట సులభంగా ప్రవహించేందుకు వీలుగా ఎమర్జన్సీ గదిలో రక్తాన్ని పలుచబరచే మందులతో చికిత్స మొదలుపెడతారు. ఆ పైన కాథ్‌లాబ్‌లో వైద్యులు రోగి పరిస్థితిని బట్టి ప్రైమరీ ఆంజియోప్లాస్టీ చేస్తారు. గుండె ధమనుల్లో వందశాతం అడ్డంకులు (బ్లాక్స్) ఏర్పడినట్లయితే మూడు నుంచి ఆరు గంటలలోగా వాటిని తొలగించాల్సి ఉంటుంది. ప్రైమరీ ఆంజియోప్లాస్టీలో అప్పటికప్పుడే స్టంట్ కూడా వేస్తారు. వీటి ద్వారా కుచించుకుపోయిన కరొనరి ధమనిని వెడల్పుచేసి రక్తం సులభంగా ప్రవహించేటట్టు చేయగలుగుతారు. వెంటనే గుర్తించటం తరువాత గుండెపోటుకు గురయిన వ్యక్తిని కాపాడటంలో అతి ముఖ్యమైనది పగలూ రాత్రి తేడా లేకుండా అత్యవసర ఆధునిక వైద్యసేవలను అందించగల ఆస్పత్రికి ఆ వ్యక్తిని తరలించటం చాలా కీలకమైన అంశం. ఇందుకుగాను తమ వద్ద పెద్ద సంఖ్యలో గుండెవ్యాధి నిపుణులు ఉన్నారని, ఇరవై నాలుగు గంటలపాటు వారు చికిత్సా సేవలు అందిస్తున్నారని యశోద ఆస్పత్రిలోని యశోద హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన వైద్యనిపుణులు, కార్డియాలజిస్టులు చెప్పారు. గుండెపోటుకు గురయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన మరుక్షణం గుండె వ్యాధుల నిపుణులు అత్యాధునిక చికిత్స ప్రారంభించగలుగుతారని వారు తెలిపారు.

ప్రైమరీ ఆంజియోప్లాస్టీ అంటే ఏమిటి ?

పూడుకుపోయిన ధమనిని తెరచి రక్తప్రవాహానికి ఆటంకం తొలగించటాన్ని ఆంజియోప్లాస్టీ అంటున్నారు. గుండెపోటుకు గురయిన వారిలో ఈ విధంగా రక్తనాళాన్ని తెరిచి రక్తప్రవాహాన్ని పునరుద్దరించటమే ప్రైమరీ ఆంజియోప్లాస్టీ. దీన్నే కొన్నిసార్లు పి.సి.ఐ.(పికాషనరీ కరొనరి ఇంటర్వెన్షన్) అని కూడా అంటున్నారు. హఠాత్తుగా గుండెపోటు వచ్చిన వారికి డాక్టర్లు ప్రైమరీ ఆంజియోప్లాస్టీ చేస్తారు. ప్రైమరీ ఆంజియోప్లాస్టీ చేసేందుకు ముందు మణికట్టు లేదా గజ్జల ప్రాంతంలో స్థానిక మత్తు (లోకల్ అనెస్థీషియా) ఇస్తారు. అక్కడ ఉండే ప్రధాన ధమనికి చిన్నరంధ్రంచేసి దాని గుండా చిన్న బెలూన్ ఉన్న కాథటర్ (సన్నని ట్యూబ్)ను నెమ్మదిగా గుండె వరకూ పంపిస్తారు. కాథటరును ధమనిలోని అడ్డంకి దాకా పంపించి, కాథటర్ ముందు భాగాన్ని అడ్డంకి ఉన్న ప్రాంతానికి చేరుస్తారు. గడ్డకట్టిన రక్తకణాలు-కొలస్ట్రాల్‌తో కూడి ఆ అడ్డంకిని తొలగించే ప్రయత్నంలో కాథటర్ చివరన ఉన్న బెలూన్‌లో గాలిని నింపి పెద్దది చేస్తారు. గాలి నిండిన బెలూన్ ఆ వ్యర్థ పదార్థాన్ని ధమని గోడల పైపునకు నొక్కివేస్తుంది. దాంతో రక్తనాళం తెరుచుకుంటుంది. గుండె కండరాలకు రక్తం సరఫరా పునరుద్ధరిస్తుంది. దాదాపు అన్ని ప్రైమరీ ఆంజియోప్లాస్టీల్లో ఈ విధంగా ధమనిని వెడల్పుచేసిన తరువాత అడ్డంకిని తొలగించిన ప్రదేశంలో స్టెంట్ వేస్తారు. కాథటర్ చివరన ఉన్న బెలూన్లో ముందుగానే స్టెంటును అమర్చి ఉంటుంది. బెలూన్ నుంచి విడుదల చేసిన లోహంతో చేసిన సన్నని గొట్టపు స్ప్రింగ్‌లాగా ఉండే ఈ స్టెంట్‌ను ధమనిలోకి ప్రవేశించగానే విచ్చుకుంటుంది. ఆ ప్రదేశంలో వ్యాసం మొత్తాన్ని ఆవరించి ధమని గోడలను తాకుతూ ఆ రక్తనాళం తెరిచి ఉండేట్లు చేస్తుంది. మూసుకు పోయి గుండెపోటుకు కారణం అయిన కరోనరి ధమనిలో ఇక నిరంతరాయంగా రక్తం ప్రవహించేందుకు వీలు కలుగుతుంది.

గుండెపోటుని నివారించటం ఎలా?

గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. వత్తిడి అధికంగా ఉండే, శారీరక శ్రమ తక్కువగా ఉండే వృత్తి ఉద్యోగాలలో ఉండి ఇరవై అయిదు సంవత్సరాలకు పైబడిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు విధిగా ప్రతీ సంవత్సరం ముందస్తు జాగ్రత్తగా ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ధూమపానం అలవాటుంటే మానివేయాలి. ఆహారంలో పంచదార, ఉప్పు, నూనెలను పరిమితంగా వాడాలి. వారంలో 5 రోజులపాటు కనీసం అరగంట చొప్పున వ్యాయామం చేయాలి. ఇక ఒకసారి గుండెపోటు వచ్చి చికిత్స పొందినవారు తరువాత మళ్లీ ఆ పరిస్థితి ఎదురవకుండా జాగ్రత్తపడాలి. ఇందుకుగాను వైద్యులు సూచించిన మందులు వాడటంతోపాటు, జీవనశైలికి సంబంధించిన కొన్ని అలవాట్లను మార్చుకోవాలి.

అంతరిక్ష స్టార్టప్‌లను ప్రోత్సహించాలె

విజ్ఞానం

నారాయణ్ ప్రసాద్

ఇటీవలి కాలంలో అంతరిక్షరంగంలోకి ప్రైవేట్ కంపెనీలు ప్రవేశించడం పెరిగిపోతున్నది. భారత్‌కు అంతరిక్ష మార్కెట్‌లో పోటీ శక్తియుక్తులు పుష్కలంగా ఉన్నాయి. అయినా ప్రపంచవ్యాప్తంగా సుమారు 26 వేల కోట్ల అంతరిక్ష మార్కెట్‌లో భారత్ వాటా 0.01 శాతమే! అంతరిక్షంలోస్టార్టప్‌లను పెంచే పరిస్థితులను కల్పించడం ఎట్లా?

ప్రపంచవ్యాప్తంగా అంతరిక్షంపై దృష్టిపెట్టిన స్టార్టప్ సంస్థలు వేయికిపైగా ఉన్నాయనేది నమ్మలేని నిజం. కానీ భారత్ నుంచి వేళ్ళమీద లెక్కపెట్టేంత తక్కువగా ఉన్నాయి. భారత్ ప్రపంచశక్తిగా అవతరిస్తున్న దేశం. ఉపగ్రహాలను, రాకెట్లను తయారుచేయగలదు, ప్రయోగించగలదు, నడిపించగలదు. భారత్ అంతరిక్ష కార్యక్రమంలో అయిదు వందలకు పైగా చిన్న, మధ్య తరహా కంపెనీలు పాలుపంచుకుంటున్నాయి. అయినప్పటికీ ఈ స్టార్టప్ రంగంలో భారత్ వాటా ఒక్కశాతం కూడా లేదు. నేడు మన దేశంలో చెప్పుకోదగిన స్టార్టప్‌లు అంటే.. టీమ్ ఇండస్ గూగుల్ లూనార్ ఎక్స్‌ప్రైజ్‌లో భాగంగా చంద్రుడిపై రోవర్‌ను దింపడం), ఆస్ట్రోమ్ టెక్నాలజీస్ (సాట్‌లైట్ బేస్డ్ బ్రాండ్ వృద్ధి) బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ సొంత లాంచ్ వెహికిల్స్ రూపొందించే దూరదృష్టితో ప్రస్తుతం థ్రస్టర్స్ తయారుచేయడం) మొదలైనవి ఉన్నాయి. వీటితోపాటు సాట్‌ష్యూర్ వంటి స్పేస్ డేటా ఉపయోగించేవి, రాకెటీర్స్ వంటి విద్యాసేవలు వృద్ధి చేసేవి ఉన్నాయి. స్టార్టప్స్ ప్రాతిపదికగా అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను పెంచుకోకపోతే స్థానికంగా అత్యున్నత నైపుణ్యంగల వారిని కాపాడుకోలేము. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) బడ్జెట్ తక్కువ. ఏటా కొన్ని వందల మంది శాస్త్రవేత్తలను లేదా ఇంజినీర్లను మాత్రమే నియోగించుకోగలదు.

టెక్ రంగంలో మాదిరిగా కాకుండా అంతరిక్షరంగంలో స్టార్టప్‌లు మార్కెట్‌కు అనుగుణంగా కుదురుకోవాలంటే ఐదు నుంచి ఏడేండ్లు పడుతది. అంతరిక్ష రంగంలో పెట్టుబడి పెట్టేవారు చాలాకాలం ఓపిక పట్టవలసి ఉంటుంది. భారత్‌లో ఇప్పటివరకు స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టిన సంస్థాగత ఇన్వెస్టర్లు లేరు. స్థానిక స్టార్టప్ వాతావరణాన్ని వృద్ధిచేయాలనే దృక్పథం గల వ్యక్తుల ద్వారా జరుగుతున్నది. మన దేశం అంతరిక్ష కార్యక్రమాలకు ఏటా వందట కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నది. చంద్రుడి మీద, అంగారకుడి మీద ప్రయోగాలు చేస్తున్నది. అయినా స్టార్టప్‌లకు పెంచి పోషించే కార్యక్రమాలు లేకపోవడం ఆశ్చర్యకరం. మరి ఇస్రో అంతరిక్ష కార్యక్రమాలలో దాదాపు 125 ప్రైవేటు సంస్థలు ఎట్లా భాగస్వామ్యం కలిగి ఉన్నాయి? దీనికి కారణం ఉన్నది. 1970 దశకంలో ప్రొఫెసర్ సతీశ్ ధావన్ ఇస్రో చైర్మన్‌గా ఉన్నప్పుడు, ఈ దిశగా పెద్ద ప్రయత్నం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా ప్రైవేట్ పరిశ్రమలను ప్రోత్సహించారు. 2010 నాటి ఆంత్రిక్స్ కార్పొరేషన్ పత్రంలో ఈ వివరాలు ఉన్నాయి. అంతరిక్ష కార్యక్రమాలకు సంబంధించిన– సాలిడ్ ప్రొపెల్లంట్స్, బ్యాటరీ సెల్స్ మొదలైన పరికరాలు, వ్యవస్థలపై కీలక పరిజ్ఞానాన్ని ఇస్రో చిన్న తరహా వ్యాపార సంస్థలకు అందించింది. తమ ప్రమాణాలకు అనుగుణంగా, నమ్మదగినవిగా తయారుచేస్తే, ఆయా పరికరాలను కొంటామని ఇస్రో ఈ సంస్థలకు హామీ ఇచ్చింది. ఆనాడు ఇస్రో అనుసరించిన ఈ విధానం వల్ల ఇవాళ మంగళ్‌యాన్ వంటి కార్యక్రమాలకు కూడా చిన్నతరహా పరిశ్రమలు పరికరాలను సమకూర్చగలిగాయి. ఈ క్రమంలో అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఇతర పరిశ్రమలకు వినియోగించడం ద్వారా మరింత అభివృద్ధి జరిగింది. ఉదాహరణకు మంటలార్పడానికి పొడులను వాడటం మొదలైనవి. ఆనాడు ఇస్రో ఏర్పరిచిన పునాది వల్ల– ఇవాళ నావిగేషన్ సాట్‌లైట్ నిర్మాణంలో మన దేశ ప్రైవేట్ పరిశ్రమలను నమ్మడానికి ఆస్కారం ఏర్పడ్డది. నావిగేషన్ సాట్‌లైట్ నిర్మాణంలో పాలుపంచుకున్న పరిశ్రమల కాన్సార్టియం 2020 నాటికి పీఎస్ఎల్‌వీలో సంయుక్త భాగస్వామ్యం పొందుతున్నది.

భారత్‌లో స్టార్టప్‌లను ప్రోత్సాహక వాతావరణాన్ని మరింత వేగంగా వృద్ధి చేయడం ఎట్లా అనేది ఇప్పుడున్న ప్రశ్న. 1970 దశకంలో తీసుకున్న చర్యలను మళ్ళా ప్రవేశపెట్టాలె. మన స్టార్టప్‌లు దేశ అవసరాలు తీర్చడమేకాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడగలుగాలె. అంతరిక్ష సేవలకు సంబంధించి దేశంలో ఉపయోగించుకోవలసిన మార్కెట్ ఎంతో ఉన్నది. ఉదాహరణకు– ఉపగ్రహ ఆధార బ్రాడ్‌బ్యాండ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని 75 కోట్ల మందికి కనెక్టివిటీ అందించవచ్చు.

ఇస్రోకు సాటివచ్చే సంస్థలైన యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ), నాసా సంగతి వేరే విధంగా ఉన్నది. ఈఎస్ఏ ఇటీవలే 500వ స్టార్టప్‌ను ఇంక్యుబేట్ చేసినందుకు ఉత్సవాలు జరుపుకున్నది. నాసా చిన్న వ్యాపార సృజన పరిశోధన (ఎస్‌బీఐఆర్) చిన్న వ్యాపార సాంకేతిక బదిలీ కార్యక్రమం (ఎస్‌బీటీటీపీ) వంటి పథకాల ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నది. తొలి దశ అంతరిక్ష కార్యక్రమాలకు తోడ్పడటానికి లగ్జంబర్గ్ 15 వందల కోట్ల రూపాయల మేర నిధిని కేటాయించింది.

బ్రెగ్జిట్ నేపథ్యంలో సొంత సంస్థలను ప్రోత్సహించేందుకు యూకే 15 స్టార్టప్ సముదాయాలను వృద్ధి చేస్తున్నది. 2030 నాటికి పది శాతం ప్రపంచ మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని పథకాలను రచిస్తున్నది. ఫ్రాన్స్ ఏరోస్పేస్ వ్యాలీని నిర్మిస్తున్నది. ఏరోనాటిక్స్, స్పేస్, ఎంబెడెడ్ సిస్టమ్స్‌కు సంబంధించిన సముదాయంలో లక్షా ఇరువై నాలుగువేల మంది ఉద్యోగులు ఉన్నారు. 2025 నాటికి ఇందులో దాదాపు నలభై వేల కొత్త ఉద్యోగాలు సృష్టించాలని యత్నిస్తున్నది. చైనాలో ఒకప్పుడు ప్రభుత్వ సంస్థలే ఉండేవి. కానీ ఉపగ్రహాలను తయారు చేయడానికి, ప్రయోగించడానికి ప్రైవేటు కంపెనీలకు అనుమతి ఇస్తున్నట్టు 2014లో ప్రకటించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా గల 400 బిలియన్ డాలర్ల పరిశ్రమలో లాభాలు పొందడానికి భారీ ఎత్తున చైనా పరిశ్రమలు వెలిశాయి. లింక్ స్పేస్ అనే సంస్థ ఉనరుపయోగ రాకెట్ డిజైన్‌ను వెలువరించింది. ఇది ఎలాన్ మాస్క్ స్పేస్ ఎక్స్ వంటి అతిపెద్ద సంస్థలతో పోటీకి దిగుతున్నది.



ఇస్రోకు సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలు గల సంస్థలు ఉన్నాయి. బెంగళూరులోని ఐసాక్ కేంద్రంలో అంతరిక్ష నౌకల నిర్మాణం జరుగుతుంది. త్రివేంద్రంలోని వీఎస్ఎస్సీ, ఎల్‌పీఎస్సీ కేంద్రాలలో ప్రయోగ కేంద్ర పరిజ్ఞానం ఉన్నది. అహ్మదాబాద్ లోని ఎస్ఏసీలో పేలోడ్ వృద్ధి సామర్థ్యం ఉన్నది. హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఎస్సీలో అంతరిక్ష డేటా ఉపయోగ సౌకర్యాలు ఉన్నాయి. వీటన్నిటినీ ఉపయోగించుకొని స్పేస్ స్టార్టప్‌లను ప్రోత్సహించవచ్చు. దేశంలో ఉన్న సాంకేతిక పరిజ్ఞాన పునాది స్టార్టప్‌ల వృద్ధికి ఎంతో ఉపయోగకరం.

ఇస్రో భవిష్యత్ అవసరాల దృష్ట్యా పెంపొందించదలుచుకున్న సాంకేతిక పరిజ్ఞానానికి, శక్తి స్తోమతలకు స్టార్టప్ ఆలోచనలు ఉపయోగపడుతయి. దేశంలో సాంకేతిక పరిజ్ఞానం, సేవలు వృద్ధి చెందుతయి. ఈఎస్ఏ సాంకేతిక కేంద్రాల పరిసరాల్లో ఇం క్యుబేషన్ కేంద్రాలను వృద్ధి చేయవచ్చు.కొత్త ఆలో చనలను గుర్తించి నిధులిచ్చే విధానంలో నాసాను ఆదర్శంగా తీసుకోవచ్చు. ఇస్రో ప్రోత్సాహం వల్ల స్థానిక స్టార్టప్‌లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. విదేశీ పెట్టుబడిదారుల్లో నమ్మకం కుదురుతుంది.

ఇప్పుడు సుమారు 26 వేల కోట్ల మేర ఉన్న ప్రపంచ అంతరిక్ష మార్కెట్‌లో భారత్ వాటా 0.01 శాతం మాత్రమే! అంతర్జాతీయ అంతరిక్ష మార్కెట్ లో మన దేశపు ప్రముఖ సంస్థ అయిన ఆంత్రిక్స్ కార్పొరేషన్‌కు సుమారు 19 వందల కోట్ల మేర రాబడి ఉన్నది. ఇది పూర్తిగా ప్రభుత్వరంగ సంస్థ. స్టార్టప్ అనుకూల వాతావరణం నెలకొల్పితే, దీని ఆధారంగా డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా విధానా లు కూడా సఫలమవుతాయి. అంతరిక్ష రంగంలో మేక్ ఇన్ ఇండియా విధానానికి ఎంతో అవకాశం ఉన్నది. వ్యవస్థాగత పెట్టుబడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా ఈ రంగంలోకి ప్రవహిస్తాయి. 2025 నాటికి పది బిలియన్ డాలర్ల మేర అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేసుకునే పాటవం భారత్‌కు ఉన్నది. ఇందులో లక్షమందికి పైగా అత్యున్నత నైపుణ్యంగల ఇంజినీర్లకు, శాస్త్రవేత్తలకు ఉద్యోగాలు లభిస్తాయి. ఇది సాకారం కావాలంటే స్పేస్ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ కార్యక్రమం అవసరం. దీనివల్ల ఆధునిక అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుంది.

ఇప్పుడు సుమారు 26 వేల కోట్ల మేర ఉన్న ప్రపంచ అంతరిక్ష మార్కెట్‌లో భారత్ వాటా 0.01 శాతం మాత్రమే! అంతర్జాతీయ అంతరిక్ష మార్కెట్ లో మన దేశపు ప్రముఖ సంస్థ అయిన ఆంత్రిక్స్ కార్పొరేషన్‌కు 290 మిలియన్ డాలర్ల మేర రాబడి ఉన్నది. ఇది పూర్తిగా ప్రభుత్వరంగ సంస్థ. స్టార్టప్ అనుకూల వాతావరణం నెలకొల్పితే, దీని ఆధారంగా డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా విధానా లు కూడా సఫలమవుతాయి. అంతరిక్ష రంగంలో మేక్ ఇన్ ఇండియా విధానానికి ఎంతో అవకాశం ఉన్నది. వ్యవస్థాగత పెట్టుబడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా ఈ రంగంలోకి ప్రవహిస్తాయి.

(వ్యాసకర్త: అంతరిక్ష ఇంజినీర్)

ది వైర్ సౌజన్యంతో...

విశ్వకర్మల జీవితాల్లో వెలుగు!

సామాజికం



జూలూరు గౌరీశంకర్

చితికిపోయిన చేతివృత్తులు, ధ్వంసమైన గ్రామీణ జీవన వ్యవస్థను చూసి రాష్ట్రసాధన ఉద్యమంలో తెలంగాణ కన్నీళ్లు పెట్టుకున్నది. దుర్భరస్థితిలో ఉన్న తెలంగాణ ముఖచిత్రం మారాలంటే తెలంగాణ రాష్ట్రం రావటమొక్కటే శరణ్యమని తెలంగాణ తెగించి పోరాడింది. ప్రజల ఆకాంక్షల మేరకు కులవృత్తులకు తిరిగి పురా వైభవాన్ని కలిగించాలన్న దీక్షతో కేసీఆర్ బీసీల కోసం అనేక కోణాల నుంచి ఆలోచిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అందుకు సన్నద్ధం చేస్తూ వస్తున్నారు. బీసీ కమిషన్‌ను వీరి స్థితిగతుల మెరుగు కోసం అధ్యయనం చేయవలసిందిగా ఆదేశించారు. ఎంబీసీలతో పాటు మరింత దీనస్థితిలో, నాగరిక సమాజం తలదించుకునే స్థితిలో ఉన్న సంచారజాతుల బతుకులు మారాలన్న మానవీయ దృక్పథం తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నది. ఇందుకోసం ఎంబీసీల కోసం 1000 కోట్లు ప్రకటించారు. ఇంతకుముందే చేనేత కార్మికుల ఆత్మహత్యలను చూసి చలించిన ప్రభుత్వం వారికోసం ఎంతో శ్రమించింది. చేనేత కార్మికుల బతుకులకు అండదండగా ఉంటున్నది. కొన్ని కులవృత్తులకు నేటికీ బాగా డిమాండ్ ఉన్నది. అలాంటి కులవృత్తులను ఆదుకోవలసి ఉన్నది. ప్రధానంగా వడ్రంగి వృత్తికి డిమాండ్ బాగా ఉండి కూడా ఇక్కడి విశ్వకర్మలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేకపోవటం వల్ల వెనుకబడిపోయారు. గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయరంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తోడవ్వటంతో విశ్వకర్మల జీవితాలు బజారునపడ్డాయి. సృష్టికర్తలుగా సమాజానికి ఉపయోగపడిన వీరిస్థితి దారుణంగా దిగజారింది. సృష్టికర్తలుగా వెలిగిన విశ్వకర్మలు ముష్టికర్మలుగా మారలేక, చేసేందుకు పనులులేక వడ్రంగి, కంసాలి, కంచర, శిల్పులుగా ఉన్న ఈ పంచకర్మ కులస్థులు మరో దారిలేక కుటుంబాలకు కుటుంబాలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఒక అంచనా ప్రకారం కులవృత్తులు దెబ్బతిన్న నేపథ్యంలో గత రెండు దశాబ్దాల లెక్కలుతీస్తే అత్యధికంగా ఆత్మహత్యలకు పాల్పండింది ఈ విశ్వకర్మ కులస్థులే. వీరి జీవన ముఖచిత్రం మార్చటంకోసం ఏదో ఒకటి చేయాలని, విశ్వకర్మ కులస్థులు తిరిగి వారి పురా వైభవాన్ని పొందేందుకు ఏం చేయాలోనన్న ఆలోచనలతో కేసీఆర్ అనేక దఫాలు వీరి గురించి చర్చించటం జరిగింది. మొత్తం బీసీ కులాల్లో అణగారిన స్థితిలో ఉన్న వారందరినీ స్వతంత్రంగా నిలబెట్టుకున్న తలంపులో భాగంగా నే జీవో నెంబర్ 9ని విడుదల చేశారు.

విశ్వకర్మ కులస్థుల్లో వడ్రంగి కులవృత్తిని పూర్తిగా ఆధునీకరించవలసి ఉన్నది. ఈ వృత్తిపై రాష్ట్రంలో ఆరులక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. వడ్రంగి వృత్తి అన్నది నేడు ప్రపంచవృత్తిగా మారింది. చైనా, థాయిలాండ్, జపాన్, సింగపూర్, మలేషియా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలకు చెందిన వుడ్‌వర్క్ నేడు ప్రపంచంలోని అన్నిదేశాలకు విస్తరించాయి. ఈ వృత్తి గ్లోబల్ వృత్తిగా మారినందుకు ఈ వృత్తిదారులు ఆనందించాలో లేక బాధపడాలో అర్థం కానీ దశ ఏర్పడింది. మన దగ్గర వడ్రంగి వృత్తిపై ఆధారపడ్డ వాళు నేటికీ దుగోడ, బాడిశ, ఉలి, సుత్తి పట్టుకొని ఉంటే ప్రపంచం వేగంగా ముందుకు దూసుకుపోతున్నది. గత పాలకులు పుణ్యమాని మన దగ్గర వడ్రంగి వృత్తి సంపూర్ణంగా దెబ్బతిని ఆ కుటుంబాలు సామూహికంగా ఆత్మహత్యలకు పాల్పడ్డాయి. ఈ స్థితి నుంచి ఉన్నత స్థితికి వెళ్లే కొత్తదారులు వేసుకుందామని కేసీఆర్ అనేక సమీక్షా సమావేశాల్లో చర్చించారు. ఇలాంటి చితికిపోయిన కులాల సంరక్షణే ప్రధాన ధ్యేయంగా, అదే ప్రధాన ఎజెండాగా ముందుకుసాగమని బీసీ కమిషన్‌తో అనేకసార్లు చర్చించారు. అధ్యయనానికిపురి కొల్పారు.

ఎంబీసీలకు కోట్లు కేటాయిస్తే రాష్ట్ర ఖజానాకు అంతకుమించిన సంపదను ఎంబీసీలు, సంచారజాతులు రాష్ట్రానికి అందిస్తారన్న నమ్మకం కేసీఆర్‌కు ఉన్నది. ఆ ఒక్క నమ్మకం చాలు తెలంగాణ తప్పక ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుంది. వడ్రంగి వృత్తిదారులకు పూర్తిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించాలి. ఇక్కడి విశ్వకర్మలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసే వస్తువులతో వారి బతుకులు మారటమే కాకుండా వీరి వస్తువులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండేవిధంగా తయారుచేయటమన్నది బృహత్ లక్ష్యం. ఇందుకోసం దేశదేశాల్లో ఈ రంగంలో తయారవుతున్న వస్తువులు, ఆ వస్తువులకున్న డిమాండ్, ఉత్పత్తి, సామర్థ్యం, అందుకయ్యే ఖర్చు, ఇందుకు కావల్సిన ఆధునిక సాంకేతిక శిక్షణ వీటన్నింటిపైన ప్రత్యేక దృష్టి పెట్టవలసి ఉంటుంది. ఆధునిక యంత్రాలను కొనటం, ఆ సాంకేతిక పరిజ్ఞానంతో వస్తువులను ఎవరైనా తయారుచేయవచ్చును. కానీ, తరతరాలుగా ఆవృత్తినే నమ్ముకున్న విశ్వకర్మీయులే ఆ పనిని చేపట్టేవిధంగా చూడాలి. వీళ్లు తయారుచేసిన వస్తువులను మార్కెట్‌తో సంబంధం లేకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సరఫరా చేసే వ్యవస్థను ప్రభుత్వమే ఏర్పాటుచేయాలి. ఇది చట్టపరమైతే తెలంగాణలో విశ్వకర్మలు గొప్ప సంపద సృష్టికర్తలవుతారు. మొత్తం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వడ్రంగి కులస్థులు ఒక శక్తిగా మారుతారు.

కోట్ల రూపాయల విలువైన యంత్రాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో చెక్కలపై విభిన్నరకాల డిజైన్ల వస్తువులు వస్తున్నాయి. జర్మనీ, జపాన్, థాయ్‌లాండ్‌ల నుంచి వస్తున్న సరుకులు విశ్వవేదిక మీదకు వచ్చిపడినాయి. ఆ పెద్ద బహుళజాతి కంపెనీలతో పోటీకి నిలిచేవిధంగా మన వడ్రంగులను నిలబెట్టగలుగాలి. అం దుకోసం విశ్వకర్మ పారిశ్రామికవాడను నెలకొల్పాలి. వడ్రంగి యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి. విశ్వకర్మ పారిశ్రామిక వాడ నుంచి తయారుచేసిన వస్తువులను విక్రయించేందుకు అతిపెద్ద మాల్‌ను ప్రభుత్వ అధీనంలోనే నెలకొల్పాలి. డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ల నిర్మాణంలో వాడే కలపనంతా ఈ విశ్వకర్మ పారిశ్రామిక వాడ నుంచే సరఫరా చేసే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉన్నది. నాణ్యమైన వస్తువులను, తక్కువ ధరలకు వస్తువులను అందించగలుగాలి. ఈ విస్తృత వ్యవస్థ ద్వారా వేలాదిమంది విశ్వకర్మలకు ఉపాధి కలుగుతుంది. ఈ ఫెడరేషన్ పారిశ్రామిక వాడకు కలపను, ముడిసరుకును ప్రభుత్వమే అందించాలి. వడ్రంగి వృత్తివారికి మండల, గ్రామ, పట్టణ స్థాయిల్లో గ్రూప్‌ల ద్వారా రెండు నుంచి పది లక్షల వరకు వెచ్చించి ఆధునిక పరికరాలను ఇప్పించేందుకు బీసీ వెల్ఫేర్ అధికారులు, ఎంబీసీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్‌లు తయారుచేస్తున్నది. హైదరాబాద్‌లో విశాలమైన ప్రాంగణంలో విశ్వకర్మలు తయారుచేసిన వస్తువుల అమ్మకానికి 'విశ్వకర్మ వస్తువులు మాల్'ను నెలకొల్పవలసి ఉన్నది. ఇంటికి కావల్సిన అన్నిరకాల వస్తువులను, ఆధునిక హంగులతో తయారుచేసి ఈ మాల్స్‌లో పెట్టాలి. మహదేవ్‌పూర్, అచ్చంపేటలో ఫారెస్ట్ డిపోలున్నాయి. ఆ ఫారెస్ట్ డిపోలలో వేలంవేసే కలపనంతా ఒక నిర్ణీత ధరకు విశ్వకర్మ పారిశ్రామిక వాడకే ఇవ్వాలి. ఆధునిక ప్రపంచ మార్కెట్ పోటీకి నిలబడేవిధంగా మన విశ్వకర్మలను తయారుచేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా తెలంగాణ విశ్వకర్మలు నిలువాలి. రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ విశ్వకర్మలను తీర్చిదిద్దాలన్న కేసీఆర్ దార్శనిక ఆలోచనలు గెలువాలి. వీరి జీవితాల్లో వెలుగులు నిండాలి.


కోట్ల రూపాయల విలువైన యంత్రాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో చెక్కలపై విభిన్నరకాల డిజైన్ల వస్తువులు వస్తున్నాయి. జర్మనీ, జపాన్, థాయ్‌లాండ్‌ల నుంచి వస్తున్న సరుకులు విశ్వవేదిక మీదకు వచ్చిపడినాయి. ఆ పెద్ద బహుళజాతి కంపెనీలతో పోటీకి నిలిచేవిధంగా మన వడ్రంగులను నిలబెట్టగలుగాలి. అం దుకోసం విశ్వకర్మ పారిశ్రామికవాడను నెలకొల్పాలి. వడ్రంగి యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి.

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)



ఉత్తరకొరియాతో చర్చలకు సమయం, స్థలం నిర్ణయం కావాల్సి ఉంది. చర్చలు ఒక కొలిక్కి వస్తే ప్రపంచానికే శుభసూచకం.

డొనాల్డ్ ట్రంప్



ట్రంప్, కిమ్ జో ఉన్‌ల మధ్య చర్చలు జరుగాలని ఆశిద్దాం. చర్చల ద్వారా పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ లేదు. ఉమ్మడి లక్ష్యం కోసం కట్టుబడి చర్చలు సాగాలి.

సుధీంద్ర కులకర్ణి



మోదీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను, భద్రతను క్షమార్హం కాని విధంగా తాకట్టు పెడుతున్నది. పచ్చి అబద్ధాలతో, న్యూనతతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నది.

రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా



పాకిస్థాన్‌లో హఫీజ్‌సయీద్ లాంటి టెర్రరిస్టు ఎన్నికల్లో పోటీ చేయటానికి సంసిద్ధమవుతున్నాడు. మరోవైపు ఎన్నికైన ప్రధాని పదవి నుంచి తొలిగింపబడ్డాడు. ఇదే ఇప్పటి వికృతం, విషాదం.

బర్ఖాదత్

మానవీయంగా మరణం

న్యాయం



మంగారి రాజేందర్

'ఏ వరికైనా ఎప్పుడైనా
మరణం ఎలా రావాలంటే
పిలవగానే కువకువలాడుతూ
పెంపుడు పావురంలా
భుజంపై వచ్చి వాలాలి
....
నిస్సవడిగా మట్టిలో ఇంకిపోయే బిందువులా
మాగిపోయి మార్దవంగా నేల రాలే పండులా
కాలం ఒడిలోకి జర్రున జారిపోవాలి జీవం'

ఓ తెలుగు కవయిత్రి ఆవేదనాపూరిత కోరిక. ఎంతమందికి మరణం అలా లభిస్తుంది?

మహాత్మాగాంధీకి ఒకలాగా, అరుణా షాన్‌బాగ్‌కు మరోలా మరణం వచ్చింది. మన దేశంలో ఆత్మహత్యా ప్రయత్నం నేరం. భారతీయ శిక్షాస్మృతిలోని నిబంధన 309 ప్రకారం ఆ ప్రయత్నం చేసిన వ్యక్తి శిక్షార్హుడు. ఓ వ్యక్తి తన ప్రాణం తాను తీసుకోవచ్చని, అది రాజ్యాంగబద్ధమని సుప్రీంకోర్టులో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచి సి.రత్నం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ప్రకటించింది. ఈ తీర్పును ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచి జ్ఞాన్‌కౌర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో తోసిపుచ్చింది. బాధ నివారణ మరణం(యుథనేషియా), సహాయంతో ఆత్మహత్య చేసుకోవడం చట్టబద్ధంకాదని తీర్పు చెప్పింది. రాజ్యాంగంలోని అధికరణ 21లో చెప్పిన జీవించేహక్కులో మరణించే హక్కులేదని కూడా స్పష్టంచేసింది. కానీ ఆ తర్వాత ఈ అభిప్రాయంలో మార్పువచ్చింది. అరుణా షాన్‌బాగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు కారుణ్య మరణాలకు అనుమతిని ఇచ్చింది. కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో మాత్రమే కారుణ్య మరణాలకు అనుమతిని ఇవ్వడం సమంజసమని కోర్టు పేర్కొంది. అవి..

1.కృత్రిమ యంత్రాల ద్వారా మాత్రమే మనిషి జీవితాన్ని కొనసాగిస్తున్నప్పుడు. 2.వైద్యపరమైన అద్భుతం జరిగి రోగి మామూలు మనిషిగా మారే అవకాశంలేదని కచ్చితంగా అనుకున్నప్పుడు, అదేవిధంగా కృత్రిమ యంత్రాలతో ఆ వ్యక్తి జీవితాన్ని కొనసాగిస్తున్నప్పుడు మాత్రమే కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వవచ్చని కోర్టు పేర్కొన్నది.

ఈ తీర్పు తర్వాత 2014లో సుప్రీంకోర్టు ముందు మరో కేసు కూడా వచ్చింది. కామన్ కాజ్ సొసైటీ అన్న సంస్థ ఈ కేసులో ఆ వ్యక్తి తనకు కారుణ్య మరణం ప్రసాదించేట్టు వీలునామా రాస్తే ఆ వ్యక్తికి కారుణ్య మరణం వచ్చేవిధంగా చట్టం తీసుకొనిరావాలని సుప్రీంకోర్టును కోరింది. ఆ అచేతనా స్థితిలో వారు తమ చివరి కోరికను చెప్పలేరని దరఖాస్తులో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కారుణ్య మరణం గురించి ఈ కేసులో ఎలాంటి అభిప్రాయం వెలిబుచ్చలేదు. ఆ కేసును రాజ్యాంగ బెంచికి నివేదించింది. సుప్రీంకోర్టు ఈ కేసులో 2018 మార్చి 9న తన తీర్పును ప్రకటిస్తూ వ్యక్తి మరణించడం కూడా గౌరవంగా ఉండాలని పేర్కొంది. అది ప్రాథమికహక్కు అని కూడా పేర్కొంది. కారుణ్య మరణం, మరణం గురించి వీలునామా రాయడం కూడా చట్టబద్ధమేనని కోర్టు పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా, ఎ.కె.సిక్రీ, ఏఎమ్ ఖాన్‌విల్కర్, డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును ప్రకటించింది.

ఒక వ్యక్తి అంతిమ వ్యాధితో బాధపడుతున్నప్పుడు అతను బతికే అవకాశం లేనప్పుడు, అతన్ని కృత్రిమ యంత్రాల ద్వారా బతుకును పొడిగించడం అతని బాధను ఇంకా ఎక్కువ చేయడమేనని న్యాయవాది ప్రశాంతి భూషణ్ సుప్రీంకోర్టు ముందు వాదనలు చేశాడు. తన జీవితాన్ని కృత్రిమ యంత్రాల ద్వారా పొడిగించాల్సిన అవసరం లేదని అతను కాస్త మంచిగా ఉన్నప్పుడు రాసిన వీలునామాను గుర్తించడం కూడా సరైందేనని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.

'లివింగ్ వీలునామా' అంటే ఆ రోగి తాను 'తెలిసే సమ్మతి ఇవ్వలేని' పరిస్థితిలోకి నెట్టివేయబడినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆ వ్యక్తి స్పష్టంగా చెప్పిన పత్రం. ఆ వ్యక్తి అంతిమ వ్యాధితో బాధపడుతున్నప్పుడు, తిరిగి మళ్లీ మామూలు పరిస్థితికి చేరుకోలేనప్పుడు, తనకు ఇవ్వాల్సిన చికిత్స గురించి చెప్పే పత్రం.

కృత్రిమ యంత్రాల ద్వారా అతని జీవితానికి ఇస్తున్న సహాయాలను నిలిపివేయమని ఇచ్చే స్పష్టమైన ఆదేశాలు. అయితే మెడికల్ బోర్డు సూచనలమేరకే ఈ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. తాము ఎలాంటి వైద్యచికిత్సను అందించే పరిస్థితి లేదని మెడికల్ బోర్డు ప్రకటించాల్సి ఉంటుంది. ఈ 'లివింగ్ వీలునామా' ప్రతిపా దనను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. ఇది దుర్వినియోగమయ్యే పరిస్థితి ఉందని, పబ్లిక్ పాలసీకి విరుద్ధమని కేంద్రం సుప్రీంకోర్టు ముందు వాదించింది. అయితే కారుణ్య మరణాలకు కేంద్ర ప్రభు త్వం తన అంగీకారాన్ని కోర్టుకు తెలియజేసింది. అంటే రోగి మామూలు మనిషిగా మారే అవకాశం లేనప్పుడు, కృత్రిమ యం త్రాలతో కృత్రిమ శ్వాసతో ఆ రోగి జీవితాన్ని కొనసాగించడం సరైంది కాదని సుప్రీంకోర్టు ముందు కేంద్రం అంగీకరించింది. అచేతన పరిస్థితిలోకి తన జీవితం మారిపోయిందని రోగి మొదట్లో భావించి నప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి చెప్పే పత్రం లివింగ్ వీలు నామా.

లివింగ్ వీలునామాలను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించడాన్ని కొంత పరిగణనలోకి తీసుకొని సుప్రీంకోర్టు వీలునామా రాసే విషయంలో, అధీ కృతం చేసే విషయంలో కొన్ని మార్గదర్శకాలు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ లివింగ్ వీలునామాలను మెజిస్ట్రేట్ అనుమతించాలని కూడా కోర్టు అభిప్రాయపడింది. అందుకని ఈ విషయాన్ని పూర్తిగా ప్రభుత్వ నిర్ణయానికి ఇవ్వడానికి కోర్టు అంగీకరించలేదు.

రోగి తిరిగి మామూలు మనిషిగా మారే అవకాశం ఏ మాత్రం లేదని మెడికల్‌బోర్డు ధృవీకరించిన తర్వాతనే కృత్రిమ యంత్రాలను, జీవన సహాయాలను తొలిగించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టంచేసింది. అదేవిధంగా వీలునామా రాయడంలో కూడా ఎలాంటి ఒత్తిడి ఉండటానికి వీల్లేదని, ఆ వీలునామా రాసేటప్పుడు స్థిరచిత్తం ఉండాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఈ రెండు విషయాల్లో తగు జాగ్రత్తలు అవసరమే.

ఒక వ్యక్తి అచేతనమైనప్పుడు, జీవించే పరిస్థితి లేనప్పుడు ఆ వ్యక్తి బాధ వర్ణనాతీతం. అదేవిధంగా ఆ వ్యక్తి కుటుంబసభ్యుల పరిస్థితి. ఈ పరిస్థితిని అధిగమించడానికి కారుణ్య మరణం ప్రతిపాదన అవసరమే. అదేవిధంగా కారుణ్య వీలునామాలు అవసరమే. అయితే మన దేశంలో తల్లిదండ్రులను రోడ్డుమీద వదిలివేస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. ఈ వీలునామాలు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వంపై నెలకొల్పడం ఉంటుంది.

అరుణా షాన్‌బాగ్ తీర్పునకు ఈ తీర్పు కొంత కొనసాగింపు మాత్రమే. గౌరవంగా మరణించడం రోగులకే కాదు. అందరికీ అవసరమే.

ఒక వ్యక్తి అచేతనమైనప్పుడు, జీవించే పరిస్థితి లేనప్పుడు ఆ వ్యక్తి బాధ వర్ణనాతీతం. అదేవిధంగా ఆ వ్యక్తి కుటుంబసభ్యుల పరిస్థితి. ఈ పరిస్థితిని అధిగమించడానికి కారుణ్య మరణం ప్రతిపాదన అవసరమే. అదేవిధంగా కారుణ్య వీలునామాలు అవసరమే. అయితే మన దేశంలో తల్లిదండ్రులను రోడ్డుమీద వదిలివేస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. ఈ వీలునామాలు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వంపై ఉంటుంది. అరుణా షాన్‌బాగ్ తీర్పునకు ఈ తీర్పు కొంత కొనసాగింపు మాత్రమే. గౌరవంగా మరణించడం రోగులకే కాదు. అందరికీ అవసరమే.

(వ్యాసకర్త: గతంలో జిల్లా జడ్జీగా పనిచేశారు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఐఎస్ఐ ఆమోదం లేని హెల్మెట్లపై త్వరలో నిషేధం!



న్యూఢిల్లీ: ఐఎస్ఐ ఆమోదంలేని హెల్మెట్ల అమ్మకాలపై నిషేధం విధించనున్నట్టు సుప్రీంకోర్టు ప్యానెల్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) తెలియజేసిందని సీనియర్ రవాణా అధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు రానున్న ఆరు నెల్లలో ఐఎస్ఐ ఆమోదంలేని హెల్మెట్ల అమ్మకాలపై పూర్తిగా నిషేధం విధించనున్నట్టు చెప్పారు. ఈ నిర్ణయాన్ని ఐఎస్ఐ హెల్మెట్ తయారీదారుల సంఘం స్వాగతించింది. భారత్‌లో ద్విచక్రవాహనదారులు ప్రస్తుతం వినియోగిస్తున్న హెల్మెట్లలో 75 నుంచి 80 శాతం హెల్మెట్లు ఐఎస్ఐ ప్రమాణాలు లేనివేనని సంఘం అధ్యక్షుడు రాజీవ్‌కపూర్ తెలిపారు. అలాంటి హెల్మెట్లు ప్రాణాలు కాపాడలేవన్న విషయాన్ని ద్విచక్రవాహనదారులు గుర్తించాలని చెప్పారు. 'నిర్దేశిత ప్రమాణాలతో ఒక హెల్మెట్‌ను తయారుచేసేందుకు కనీసం రూ.300-400 ఖర్చవుతుంది. అంతకంటే తక్కువకు తయారుచేయడం అసాధ్యం. అయినా నాసిరకం హెల్మెట్‌లు తక్కువధరకే మార్కెట్‌లోకి కుప్పలుతెప్పలుగావచ్చిపడుతున్నాయి' అని రాజీవ్ చెప్పారు.

నేడు గోరఖ్‌పూర్ 'పరువు పందెం'

- ఉప ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న యూపీ సీఎం ఆదిత్యనాథ్
- ఎస్పీకి మద్దతిస్తున్న బీఎస్పీ
- హోరాహోరీగా పోరు



లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీజేపీకి గతకొన్నేండ్లుగా కంచుకోటగా ఉన్నది. ఆ స్థానం నుంచి పోటీచేసి వరుసగా ఐదుసార్లు ఎంపీగా యోగి ఆదిత్యనాథ్ గెలుస్తూవచ్చారు. కానీ ఆదివారం జరుగనున్న ఉపఎన్నికల్లో పరిస్థితి మాత్రం ఆ పార్టీకి కొంచెం కష్టతరమైన వ్యవహారమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఉపఎన్నికలు యోగికి 'పరువు పందెం'లాంటివని చెబుతున్నారు. ఉప ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ అభ్యర్థికి బీఎస్పీ మద్దతిస్తున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాల్సి వస్తున్నది. ప్రస్తుతం బీజేపీ, ఎస్పీ అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అనే విధంగా గట్టిపోటీ కనపడుతున్నది. రెండు పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గానే తీసుకున్నాయి. 1989 నుంచి గోరఖ్‌పూర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేసిన ఆదిత్యనాథ్ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌పీఠ్‌కు మహంత్‌గా ఆదిత్యనాథ్ బాధ్యతలు నిర్వహించారు. దీంతో ఆదిత్యనాథ్ తిరుగులేకుండా విజయపరంపర కొనసాగిస్తూవచ్చారు. కానీ, ప్రస్తుతం ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలో ఉన్నది ఆయన కాదు. కాబట్టి ఫలితాల్లో మార్పు కనిపించవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే గోరఖ్‌పూర్ లోక్‌సభస్థానానికి జరిగిన గత ఎన్నికల్లో 52.86 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఇందులో యోగి ఆదిత్యనాథ్ 3.12 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. అయితే, సాధారణ ఎన్నికలతో పోల్చుకుంటే ఉప ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగానే నమోదవుతుంటుంది. 2017 మార్చిలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆదిత్యనాథ్ బాధ్యతలు స్వీకరించడంతో గోరఖ్‌పూర్ స్థానం ఖాళీ అయింది. దీంతో ప్రస్తుతం ఆ స్థానానికి ఆదివారం ఉపఎన్నికలు జరుగనున్నాయి. ఎస్పీ, బీఎస్పీ పొత్తు నిర్ణయంతో ఆ రెండు పార్టీలు ముందుగానే ఓటమిని అంగీకరించినట్లు అర్థమవుతున్నదని చివరిరోజు ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. తమ స్వార్థం కోసమే ఎస్పీ, బీఎస్పీ పొత్తు పెట్టుకున్నాయని, రాష్ట్ర అభివృద్ధి కోసం కాదని ఆరోపించారు. కాగా, ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున ఉపేంద్ర దత్ శుక్లా, ఎస్పీ నుంచి ప్రవీణ్ నిశాద్, కాంగ్రెస్ నుంచి సుర్హిత ఛటర్జీ పోటీ పడుతున్నారు.

మాకూ ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే!

- హోదా సాధన ఉద్యమం కొనసాగిస్తాం
- ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ స్పష్టీకరణ



భువనేశ్వర్: తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టంచేశారు. తమ ప్రభుత్వ ఆధ్వర్యంలో హోదా డిమాండ్‌పై ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. 'ఒడిశాకు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలని మేము ఎప్పుడూ డిమాండ్ చేస్తూనే ఉన్నాం. మరోసారి డిమాండ్ సాధనకు పోరాడుతాం' అని శుక్రవారం ఆయన మీడియాతో చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. లోక్‌సభలో బీజేడీ నేత బర్తృహరి మెహతాబ్ అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ.. ఒకవేళ కేంద్రం ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటిస్తే ఒడిశా కూడా తమ డిమాండ్‌ను తీవ్రం చేస్తుందన్నారు. 'ప్రత్యేక హోదా కోసం ఒడిశా సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నది. ఒకవేళ ఏపీ ప్రత్యేక హోదా సాధిస్తే.. ఈ డిమాండ్ కోసం మేము కూడా పెద్దఎత్తున ఉద్యమిస్తాం' అని చెప్పారు. ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి మరోరాష్ట్రానికి ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు.

నేను ప్రధాని పదవిలో ఉంటే..

పెద్దనోట్ల రద్దు ఫైల్‌ను చెత్తబుట్టలో వేసేవాడిని

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

సింగపూర్, మార్చి 10:



కౌలాలంపూర్‌లో జరిగిన కార్యక్రమంలో రాహుల్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. పెద్దనోట్ల రద్దు తప్పుడు నిర్ణయమని విమర్శించారు. ఒకవేళ తాను ప్రధాని అయిఉంటే పెద్దనోట్ల రద్దు ఫైల్‌ను చెత్తబుట్టలో పడేసేవాడినని చెప్పారు. ఆగ్నేయాసియా పర్యటనలో ఉన్న ఆయన శనివారం మలేషియాలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. పెద్దనోట్ల రద్దును మీరు ఎలా అమలు చేస్తుండేవారని ప్రవాసభారతీయులు ప్రశ్నించగా.. 'ఒకవేళ నేను ప్రధాని స్థానంలో ఉంటే.. అధికారులు తీసుకొచ్చిన పెద్దనోట్ల రద్దు దస్త్రాన్ని చెత్తబుట్టలో పడేసేవాడిని' అని తెలిపారు. పెద్ద నోట్లను రద్దు చేస్తున్నామని నవంబర్ 2016లో ప్రధాని ప్రకటించగానే ఆ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుపట్టిందని గుర్తుచేశారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీని గతంలో కూడా పలుసార్లు వ్యతిరేకించామని చెప్పారు. మహిళా సాధికారతకు కేవలం సమానత్వమే సరిపోదని రాహుల్ పేర్కొన్నారు. 'పురుషులతోపాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంతోనే సాధికారత సాధ్యం కాదు. మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించడం, వారికి మరింత మద్దతుగా నిలువడం అవసరం' అని తెలిపారు. అనంతరం రాహుల్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తూ 'మలేషియా ఇండియన్ కాంగ్రెస్(ఎంఐసీ) అధ్యక్షుడు సుబ్రమణ్యం సదాశివంతో భేటీ అయ్యాను. ఏఐసీసీలో భాగమైన ఎంఐసీ మలేషియా స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించింది' అని పేర్కొన్నారు.

కదం తొక్కుతున్న రైతులు

నేడు ముంబైకి మహా పాదయాత్ర

రేపు మహారాష్ట్ర అసెంబ్లీ ముట్టడి



శనివారం థానే చేరుకున్న రైతుల మహాపాదయాత్ర

ముంబై, మార్చి 10: అన్నదాతల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది రైతులు చేపట్టిన మహాపాదయాత్ర శనివారం భీవండికి చేరుకున్నది. ఆలిండియా రైతు కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహాపాదయాత్ర ఆదివారంనాటికి ముంబై చేరుకోనున్నది. సోమవారం రాష్ట్ర అసెంబ్లీని రైతులు ముట్టడించనున్నట్టు ఏఐకేఎస్ నేత సునీల్ మల్సూరే తెలిపారు. రైతుల పాదయాత్రపై మహారాష్ట్ర సర్కార్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ, రాష్ట్ర ఆర్థికమంత్రి సుధీర్ ముంగంటివర్ స్పందించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రుణమాఫీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఏఐకేఎస్ నేత అశోక్‌ధవ్లే మాట్లాడుతూ 'రైతులకు పూర్తి రుణమాఫీ, స్వామినాథన్ సిఫారసులు అమలుచేయడం, పంటలకు కనీస మద్దతు ధర, వృద్ధ రైతులకు పెన్షన్ చెల్లించడం వంటి ప్రధాన డిమాండ్లతో మహాపాదయాత్ర చేస్తున్నాం. మా సమస్యలు తీర్చేదాకా వెనుకకు తగ్గే ప్రసక్తే లేదు. మేము కచ్చితంగా అసెంబ్లీని ఘెరావ్ చేసేందుకు వెళ్తున్నాం' అని తెలిపారు. నాసిక్ నుంచి మొదలైన మహాపాదయాత్ర ఐదురోజుల్లో 150 కిలోమీటర్ల దూరం సాగింది. ఈ యాత్రలో విదర్భ, మరాఠ్వాడ, ఖందేశ్‌సహా వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొంటున్నారు.

భారత్‌కే అగ్ర ప్రాధాన్యం

- ఇండో-ఫ్రెంచ్ సంబంధాల్లో కొత్త శకం
- ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాం
- ఇండో-పసిఫిక్‌లో శాంతితోనే ప్రాంతీయంగా సుస్థిరత
- ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రన్
- భారత్, ఫ్రాన్స్ ఆలోచన విధానం ఒక్కటే: ప్రధాని మోదీ
- ఇరుదేశాల మధ్య 14 కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ, మార్చి 10:





ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రన్, ఆయన సతీమణి బ్రిగిట్టెలకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి, ప్రధాని; ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరుదేశాల మంత్రులు

దక్షిణాసియాలో మిగతా దేశాల కన్నా భారత్‌కే తాము అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రన్ చెప్పారు. తన భారత పర్యటన వ్యూహాత్మక భాగస్వామ్యం దిశగా సరికొత్త శకానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. దక్షిణాసియాలో భారత్ తమ బలమైన భాగస్వామి అని, ఐరోపాలో భారత్‌తో తామూ అదే సంబంధాన్ని కోరుకుంటున్నామని అన్నారు. నాలుగురోజుల పర్యటన కోసం భారత్‌కు చేరుకున్న మాక్రన్‌కు శనివారం రాష్ట్రపతి భవన్‌లో ఘనస్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌తో ఆయన సమావేశమయ్యారు. ప్రధాని మోదీతో కలిసి ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ఇండో-పసిఫిక్ తీరంలో భద్రతాపరంగా వస్తున్న మార్పులతో పాటు పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా మాక్రన్, మోదీ సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. సముద్ర మార్గాలు ఆధిపత్యశక్తుల ఆటస్థలాలు కారాదని పరోక్షంగా చైనాను ఉద్దేశించి మాక్రన్ స్పష్టంచేశారు. హిందూ మహాసముద్రంలో శాంతి నెలకొంటేనే ప్రాంతీయంగా సుస్థిరత సాధ్యమవుతుందని, అందుకే ఇండో-పసిఫిక్ రీజియన్‌లో నౌకాగమన స్వేచ్ఛ కోసం తాము భారత్‌కు వెన్నంటే ఉంటామని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులోనూ భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సౌర ప్రాజెక్టులో పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. భారత్‌కు ఉన్న నమ్మకమైన రక్షణ భాగస్వాములతో పోల్చితే ఫ్రాన్స్‌తో సహకారం ప్రత్యేకమైనదని, బలమైనదని ఈ సందర్భంగా ప్రధాని మోదీ చెప్పారు. భారత్, ఫ్రాన్స్ ఆలోచనావిధానం ఒక్కటేనని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఇరుదేశాల ప్రజాసంబంధాలే కీలకమని చెప్పారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధం 20 ఏండ్ల నాటిదని, ఆధ్యాత్మిక బంధం కూడా ఎన్నో ఏండ్ల నాటిదని గుర్తుచేశారు. ఉగ్రవాదం సహా ప్రపంచానికి సవాలుగా మారిన అనేక సమస్యలపై కలిసికట్టుగా పోరాడుతామని చెప్పారు. మేకిన్ ఇండియాలో భాగంగా ఫ్రాన్స్ నుంచి రక్షణరంగంలో పెట్టుబడులు ఆహ్వానిస్తున్నట్లు మోదీ తెలిపారు.

రాఫెల్ వివాదం నేపథ్యంలో ఒప్పందం!

భారత్-ఫ్రాన్స్ మధ్య 2016లో రూ.58వేలకోట్ల రాఫెల్ యుద్ధవిమానాల ఒప్పందం పూర్తి వివరాలను బయట పెట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండగా, ప్రభుత్వం అందుకు నిరాకరిస్తున్నది. ఈ నేపథ్యంలో రక్షణ సంబంధిత సమాచారానికి పూర్తి భద్రత కల్పించే ఒప్పందం పైనా ఇరుదేశాలు అంగీకారానికి రావడం గమనార్హం. మోదీ ప్రభుత్వం మొత్తం 36 విమానాల కొనుగోలుకు రూ.12,632కోట్లు అధికంగా ఖర్చుచేసిందని కాంగ్రెస్ ఆరోపించగా, బీజేపీ ఆ ఆరోపణలను కొట్టిపారేసింది. అయితే శనివారం కుదిరిన ఒప్పందం ప్రకారం.. భారత రక్షణ రంగానికి సంబంధించిన ఎలాంటి సమాచారాన్నైనా ఫ్రాన్స్ వెల్లడించడానికి వీలులేదు. ఒప్పందం సందర్భంగా మాక్రన్ మాట్లాడుతూ.. 'రాఫెల్ విమానాలు, స్కార్పెన్ సబ్‌మెరైన్ల సరఫరా ప్రాజెక్టు దీర్ఘకాలికమైనది. ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ప్రాజెక్టు గుండెకాయ లాంటిది' అని పేర్కొన్నారు.

వారణాసికి వెళ్లనున్న మాక్రన్

భారత్‌ను సందర్శించే దేశాధ్యక్షులు.. ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో పర్యటించడం ఇటీవలికాలంలో ఆనవాయితీ మారిన నేపథ్యంలో.. ఫ్రెంచ్ అధ్యక్షుడు మాత్రం మోదీ నియోజకవర్గం వారణాసి (ఉత్తరప్రదేశ్) వెళ్లనున్నారు. గంగానదిలో మోదీతో కలిసి ఆయన బోటు షికారు చేయనున్నారు. మీర్జాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 100 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను వారు ప్రారంభిస్తారు. భారత పర్యటనలో మాక్రన్ దంపతులు ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు.

14 ఒప్పందాలపై సంతకాలు

మాక్రన్, మోదీ సమక్షంలో భారత్-ఫ్రాన్స్ మధ్య 14 కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా రూ.10.4 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి. రక్షణ, అణుశక్తి, ఉగ్రవాద వ్యతిరేకపోరాటం, విద్య, వలసలు, పర్యావరణం, పట్టణాభివృద్ధి, రైల్వే ఇందులో ఉన్నాయి. స్పైస్‌జెట్‌కు విమాన ఇంజిన్ల సరఫరా, ఎయిర్‌లిక్విడె, స్టెర్లైట్ కంపెనీల మధ్య గ్యాస్ సరఫరా, దావణగెరె (కర్ణాటక)లో జలవ్యవస్థ ఆధునికీకరణ కాంట్రాక్టులూ ఇందులో ఉన్నాయి.

సమగ్రాభివృద్ధితోనే సామాజిక న్యాయం


- పోటీతత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- 115 తీవ్ర వెనుకబాటు జిల్లాలను అభివృద్ధిలోకి తేవాలి
- జాతీయ ప్రజాప్రతినిధుల సదస్సులో ప్రధాని మోదీ



ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 10: వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా సమగ్రాభివృద్ధి, దాని ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. శనివారం ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన రెండురోజులపాటు జరుగనున్న ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. అన్ని ప్రాంతాలు సమతుల అభివృద్ధి సాధించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. దేశంలోని అత్యంత వెనుకబడిన జిల్లాలుగా 115 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల గుర్తించింది. వీటిని 'ఆకాంక్ష జిల్లాలు'గా పిలుస్తున్నారు. వాటిని గురించి తన ప్రసంగంలో ప్రస్తావించిన మోదీ.. 'వెనుకబడిన జిల్లాల విషయంలో లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. పనితీరు ఆధారంగా కలెక్టర్ల బదిలీలు ఉంటాయి. అభివృద్ధి కోసం కలెక్టర్లకు ప్రణాళిక, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం అవసరం. కలెక్టర్లు ఉత్తమ పనితీరు కనబర్చిన జిల్లాలతో పోల్చుకోవాలి. పిల్లలందరూ పాఠశాలలకు వెళ్లగలిగితే, ప్రతీ ఇంటికి కరెంటు ఇవ్వగలిగితే సామాజిక న్యాయం సాధించినట్లే' అని పేర్కొన్నారు. '20ఏండ్ల క్రితంవరకు ఆందోళనలు, ర్యాలీలు, జైలుకెళ్లడం వంటివి రాజకీయాలకు ఉపయోగపడేవి. ఇప్పుడు పరిస్థితులు మారాయి. మీ మీ ప్రాంతాల్లో అభివృద్ధిపై దృష్టిపెట్టండి' అని ప్రజాప్రతినిధులకు మోదీ సూచించారు. పోటీతత్వం వల్లే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధి చెందుతాయని ప్రధాని పేర్కొన్నారు.

నాలుగోసారి ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా భయ్యాజీ



న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రధాన కార్యదర్శిగా భయ్యాజీ జోషి మరోమారు ఎన్నికయ్యారు. వరుసగా నాలుగోసారి ఎన్నికైన ఆయన.. 2021 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. నాగ్‌పూర్‌లో జరుగుతున్న ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఏబీపీఎస్)లో శనివారం భయ్యాజీని ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో అత్యధిక కాలం 1987 నుంచి 2000 వరకు హెచ్‌వీ శేషాద్రి పనిచేశారు. ఆయన తర్వాత స్థానంలో భయ్యాజీ నిలిచారు. ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రచార్ ప్రముఖ్ మన్మోహన్ వైద్య మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శి పదవికి పోటీచేసేందుకు ఇతరులు ముందుకురాలేదని తెలిపారు. కాగా, భయ్యాజీ 2009లో తొలిసారి ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆరెస్సెస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి కృష్ణ గోపాల్ మాట్లాడుతూ భారత్‌లో ఆరెస్సెస్ 95% మేర విస్తరించిందని తెలిపారు.

సురేశ్‌ప్రభుకు పౌరవిమానయాన బాధ్యతలు

న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్‌ప్రభుకు పౌరవిమానయానశాఖ అదనపు బాధ్యతలను కేంద్రం అప్పగించింది. ప్రధాని మోదీ సూచనల మేరకు ప్రభుకు అదనంగా విమానయానశాఖను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అప్పగించారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడంపై క్యాబినెట్ నుంచి టీడీపీకి చెందిన అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి వైదొలిగిన సంగతి తెలిసిందే. కాగా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా నిర్ణయం దురదృష్టకరమన్న ప్రభు.. త్వరలో నూతన పారిశ్రామిక విధానం ప్రకటిస్తామన్నారు.

ఫ్లోరిడాలో ఇక స్కూల్ టీచర్లకు ఆయుధాలు

మియామీ: పాఠశాల ఉద్యోగులు, టీచర్లు ఆయుధాలు కలిగి ఉండేందుకు అనుమతించే చట్టం ఫ్లోరిడాలో అమలులోకి రానున్నది. ఈ మేరకు అమెరికాలోని ఫ్లోరిడా గవర్నర్ రిక్ స్కాట్ సదరు చట్టంపై శనివారం సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం ఆయుధాలు కొనుగోలు చేసేందుకు కనీస వయస్సును 18 ఏండ్ల నుంచి 21 ఏండ్లకు పొడిగించారు. ఈ ప్రతిపాదనను నేషనల్ రైఫిల్ అసోసియేషన్ గట్టిగా వ్యతిరేకించింది. చట్టంలోని నిబంధనల ప్రకారం గతంలో సైన్యంలో పని చేసిన అనుభవం గల కోచ్‌లు, టీచర్లు ఆయుధాలు కలిగి ఉండొచ్చు.

మాజీ సైనికుల కౌన్సెలింగ్ కేంద్రంలో కాల్పులు

అమెరికాలో ఘటన.. సాయుధుడితోపాటు ముగ్గురు మహిళలు మృతి

లాస్ ఏంజిల్స్: అమెరికాలోని నాపా వ్యాలీ పరిధిలోని కాలిఫోర్నియా – యౌంట్‌విల్లే వెటరన్స్ హోంలో సాయుధుడు, ముగ్గురు మహిళలు మృతి చెందారు. మానసికంగా దెబ్బ తిన్న మాజీ సైనికుల కౌన్సెలింగ్ కేంద్రంగా ఉన్న వెటరన్స్ హోంలో చికిత్స పొందుతున్న ఆల్బర్ట్ వాంగ్ (36) ముగ్గురు మహిళలను బందీలుగా పట్టుకున్నాడు. కాగా అతడితో సంప్రదింపులకు పోలీసుల ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయి. శనివారం సాయంత్రం వెటరన్స్ హోమ్‌లోకి పోలీసులు ప్రవేశించేసరికి సాయుధుడు ఆల్బర్ట్ వాంగ్, మిగతా ముగ్గురు మహిళల మృతదేహాలు దొరికాయని కాలిఫోర్నియా హైవే పెట్రోల్ కెప్టెన్ క్రిస్ చైల్డ్స్ తెలిపారు.

నిరాయుధీకరణ చర్యలుంటేనే భేటీ

ఉత్తర కొరియా అధినేత కిమ్‌తో చర్చలపై అమెరికా మెలిక

వాషింగ్టన్: అణు నిరాయుధీకరణ, క్షిపణులు, అణ్వస్త్రాల పరీక్షలను నిలిపివేస్తూ ఉత్తర కొరియా స్పష్టమైన చర్యలు చేపట్టిన తర్వాతే ఆ దేశ అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ కానున్నారు. హామీల అమలుకు ఉత్తరకొరియా స్పష్టమైన చర్యలు చేపట్టే వరకు కిమ్‌తో ట్రంప్ సమావేశం జరుగదని వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి సారా శాండర్స్ శనివారం మీడియా సమావేశంలో చెప్పారు. కిమ్‌తో భేటీకి సిద్ధమని శుక్రవారం ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా తన షరతులను వెల్లడించింది.

ఎన్డీఏలో లుకలుకలు

- ఇప్పటికే దూరంగా ఉన్న శివసేన
- మౌనంగానే కొనసాగుతున్న అకాలీదళ్
- ప్రత్యేక హోదా ఇవ్వనందుకు టీడీపీ గుస్సా
- ప్రతి విషయంలో విభేదిస్తున్న పీడీపీ



న్యూఢిల్లీ, మార్చి 10:

కేంద్రంలో చక్రం తిప్పుతున్న నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) లో లుకలుకలు బయటపడుతున్నాయి. ఎన్డీఏలోని మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా బీజేపీకి దూరమవుతున్నాయి. బీజేపీ అధిష్ఠానం అనుసరిస్తున్న విధానాలపై మండిపడుతూ ఎవరి దారి వారు వెతుక్కుంటున్నారు. ఎన్డీఏలో 30 వరకు చిన్నాచితకా పార్టీలుండగా, పలు పార్టీలు ఇప్పటికే విభేదించి బయటకు వచ్చేసినట్లుగా ప్రవర్తిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలను కలిసికట్టుగా ఎదుర్కొని అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో 1998లో ఎన్డీఏ ఏర్పాటైంది. తొలుత బీజేపీతో కలిసి 13 పార్టీలుండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 30 వరకు చేరుకుంది. మిత్రపక్షాల సంఖ్య పెరిగినప్పటికీ.. మోదీ విధానాలపై, నిర్ణయాలపై భాగస్వామ్యపక్షాలు సంతృప్తిగా లేవు. శివసేన చాలాకాలంగా ఎన్డీఏతో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నది. మంత్రిమండలి నుంచి తప్పుకుని బయటినుంచి మద్దతిస్తున్నది. తాము వద్దన్నప్పటికీ సురేశ్ ప్రభును పార్టీలో చేర్చుకుని మంత్రిపదవి కట్టబెట్టడంపై శివసైనికులు ఆగ్రహంతో ఉన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని శివసేన ఇప్పటికే ప్రకటించింది. ఎన్డీఏలో ఉంటూనే బీజేపీకి శివసేన ఇబ్బందికరంగా పరిణమించింది. పంజాబ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో డీలాపడిన అకాలీదళ్.. ఎన్డీఏ కార్యక్రమాలకు కొంతకాలంగా దూరందూరంగా ఉంటున్నది. ఇక జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీతో జతకట్టిన పీడీపీ... పలు విషయాల్లో ఆ పార్టీతో విభేదిస్తున్నది. ప్రత్యేక హోదా డిమాండ్‌తో అసంతృప్తి వ్యక్తం చేసిన టీడీపీ ఇటీవలే తమ ఇద్దరు కేంద్ర మంత్రులతో పదవులకు రాజీనామా చేయించింది.

పెరుగుతున్న అసంతృప్తి

ఎన్డీఏపై భాగస్వామ్యపక్షాల్లో అసంతృప్తి నానాటికి పెరుగుతుండటం బీజేపీ అధిష్ఠానానికి మింగుడుపడటం లేదు. ఒకప్పుడు శివసేన ఒక్కటే బీజేపీకి చెవిలో జోరీగలా ఉండేది. ఇప్పుడు మరికొన్ని పార్టీలు అదే బాటలో నడుస్తుండటం బీజేపీకి ఇబ్బందికరమే. 'మిత్రపక్షాలతో బీజేపీ ఇలాగే వ్యవహరిస్తే 2019 ఎన్నికల్లో ఇప్పుడున్న మెజార్టీ సాధించడం కష్టమైన పని' అని జేఎన్‌యూ సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ మణీంద్రనాథ్ ఠాకూర్ అభిప్రాయపడుతున్నారు. 'ప్రత్యేకహోదా [illegible] ఇవ్వరని తెలిసీ కేంద్ర మంత్రిమండలి నుంచి టీడీపీ తప్పుకుంది. ఒకరకంగా ఇది బీజేపీని భయపెట్టడమే' అని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ఎన్డీఏ నుంచి మరిన్ని మిత్రపక్షాలు బయటకు వస్తాయని ఆయన జోస్యం చెప్పారు. వాజ్‌పేయి పాటించినట్లుగా సంకీర్ణ ధర్మాన్ని నెరవేర్చాల్సిన అవసరముందని శిరోమణి అకాలీదళ్‌కు చెందిన నరేశ్ గుజ్రాల్ చెప్పారు. ప్రస్తుతం బీజేపీ సంపూర్ణ మెజార్టీ కలిగివున్నందున మిత్రపక్షాల మాటలను ఆ పార్టీ పెద్దగా పట్టించుకోవడం లేదు. వచ్చే ఎన్నికల్లో స్పష్టమైన మెజార్టీ సాధించనిపక్షంలో ప్రభుత్వ ఏర్పాటులో మిత్రపక్షాల సహకారం అవసరముంటుందని బీజేపీకి తెలియంది కాదు. బీజేపీ పెద్దలు వ్యవహరించే తీరుపై ఎన్డీఏ భవితవ్యం ఆధారపడి ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు.

రాహుల్‌తో నేను కలిసుంటే గుజరాత్‌లో బీజేపీ ఓడేది: హార్దిక్ పటేల్

ముంబై: గుజరాత్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో తాను కలువనందుకే బీజేపీ గెలుపొందిందని పాటిదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ చెప్పారు. రాహుల్‌తో కలిసినట్లయితే తప్పకుండా కాంగ్రెస్‌కు మరిన్ని సీట్లు వచ్చేవన్నారు. శనివారం ఇండియా టుడే నిర్వహించిన సదస్సులో హార్దిక్ పటేల్ మాట్లాడుతూ 'రాహుల్‌తో భేటీ కాకపోవడం చాలా పెద్ద తప్పిదమే. ఆయన్ని కలిసివుంటే బీజేపీ 99 కాక 79 సీట్లే గెల్చుకునేది' అని చెప్పారు.

హిమాలయాలకు రజనీకాంత్

చెన్నై, మార్చి 10: తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ శుక్రవారం తీర్థయాత్ర కోసం హిమాలయాలకు బయల్దేరి వెళ్లారు. అక్కడ 15 రోజులపాటు ఉంటానని చెన్నై విమానాశ్రయంలో మీడియాతో చెప్పారు. రజనీకాంత్ ప్రతి ఏడాది హిమాలయాలకు వెళ్లి ఆధ్యాత్మికవేత్తలతో సమావేశమవుతుంటారు. గతేడాది డిసెంబర్‌లో రాజకీయాల్లోకి వస్తున్నట్టు రజనీకాంత్ ప్రకటించిన తర్వాత హిమాలయాలకు వెళ్లడం ఇది తొలిసారి. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ మొత్తం 234 స్థానాల్లో పోటీచేస్తుందని ఆయన ఇదివరకే ప్రకటించారు.

యూపీలో మరో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

లక్నో, మార్చి 10: దేశంలో మహనీయుల విగ్రహాల విధ్వంసం కొనసాగుతున్నది. బుధవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చివేసిన దుండగులు మళ్లీ రెచ్చిపోయారు. శనివారం యూపీలోని ఆజాంఘర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం ధ్వంసం చేశారు. త్రిపురలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత లెనిన్ విగ్రహం కూల్చివేతతో విగ్రహాల ధ్వంసం మొదలైంది.

ఆశ.. నిరాశ



విమానాల వద్దకు నో ఎంట్రీతో జనాగ్రహం

సందర్శకులను నిరాశపరిచిన వింగ్స్ ఇండియా ఎయిర్‌షో

డబ్బులు వృథాచేసుకున్నామని జనం గగ్గోలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: టీవీలు, పేపర్లలో బాగా చూపిస్తున్నరు. ఇక్కడికి వస్తేనేమో దగ్గరకి కూడా పోనీయడం లేదు. ఎండలో పడి పిల్లలను వెంటేసుకొని వచ్చాం. తీరా ఇక్కడి వచ్చిన తర్వాత నిరాశే మిగిలింది. మొత్తం రూ.3 వేలు వృథా అయ్యాయి. కనీసం పిల్లల సరదాను తీర్చేందుకైనా విమానాల వద్దకు అనుమతిస్తే బాగుండేది. ఇది కుత్బుల్లాపూర్ నుంచి వచ్చిన నర్సయ్య కుటుంబం వ్యక్తం చేసిన ఆవేదన.. బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న వింగ్స్ ఇండియా ఎయిర్‌షోకు వచ్చిన ప్రతివారు ఇలాంటి నిర్వేదాన్నే వ్యక్తంచేశారు. వీకెండ్ ఎంజాయ్‌చేద్దామనుకున్నవారంతా విమానాశ్రయంలోని పరిస్థితిని చూసి నివ్వెరపోయారు. విమానయాన సంస్థలు శనివారం సైతం పరిమితంగా బిజినెస్ విజిటర్లను మాత్రమే విమానాల వద్దకు అనుమతించాయి. సామాన్యులందరినీ గ్రిల్స్ వద్దే నిలిపివేయడంతో ఏంతో ఆశగా వచ్చినవారంతా నిరాశగా వెనుదిరిగారు. ఎయిర్‌షోలో చివరి రెండు రోజులు సామాన్యులకు ప్రవేశం కల్పిస్తామని నిర్వాహకులు ప్రకటించడంతో శనివారం సుమారు ఏడు వేల మంది తరలివచ్చారు. విమానాలను దగ్గరి నుంచి వీక్షించి.. ఒక్క సారైనా ఎక్కి కోరిక తీర్చుకుందామను కొని ఆశతో వచ్చిన వారికి నిరాశే మిగిలింది. ఆదివారం సైతం రూ.400 టికెట్ కొనుగోలు చేసిన వారిని మాత్రమే విమానాశ్రయంలోనికి అనుమతివ్వనున్నారు.

పండిట్ రవిశంకర్‌పై కేసు నమోదు

సైదాబాద్, నమస్తే తెలంగాణ: బాబ్రీ మసీదు, రామ జన్మభూమి వివాదం తీర్పుపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన ఆధ్యాత్మికవేత్త పండిట్ రవిశంకర్‌పై సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సైదాబాద్ జీవన్ యార్‌జంగ్‌కాలనీకి చెందిన సోషల్‌వర్కర్ ఫయాజుద్దీన్ గురువారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కాట్న సత్తయ్య ఉన్నతాధికారుల, న్యాయపరమైన సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పిన నేపథ్యంలో శనివారం రవిశంకర్‌పై కేసు నమోదు చేశారు. బాబ్రీ మసీదు, రామ జన్మభూమి వివాదం తీర్పు హిందువులకు అనుకూలంగా వెలువడని పక్షంలో దేశం మరో సిరియాగా మారుతుందని, అంతర్ యుద్ధం వచ్చే అవకాశాలున్నాయని పండిట్ శ్రీరవిశంకర్ ముస్లిం ప్రజల మనోభావాలను కించపర్చేలా, దెబ్బతీసేలా, దేశంలో శాంతిని దెబ్బతీసేలా మాట్లాడినందుకు అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సోషల్ వర్కర్ ఫయాజుద్దీన్ ఫిర్యాదు మేరకు రవిశంకర్‌పై 295(ఏ) ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ కాట్న సత్తయ్య తెలిపారు.

గ్రేటర్ చెరువులకు మహర్దశ

రూ.288 కోట్లతో 20 చెరువుల సమగ్రాభివృద్ధి

మిషన్ కాకతీయలో భాగంగా పనులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

అర్బన్ లేక్స్ అండర్ మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌లోని 20 చెరువులకు మహర్దశ పట్టనున్నది. అభివృద్ధిలో భాగంగా పూడికతీత నుంచి పిక్‌నిక్ స్పాట్లుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. నియోజకవర్గాలవారీగా 20 చెరువులను ఎంపికచేసిన అధికారులు వాటిని రూ.288 కోట్లతో సమగ్రంగా అభివృద్ధిచేసేందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. అర్బన్ లేక్స్ అండర్ మిషన్ కాకతీయ పథకం కింద పూడిక తీయడంతోపాటు మురుగునీరు కలువకుండా ప్రత్యేక కాలువలు ఏర్పాటుచేయడం, చెరువు కట్టలను పటిష్ఠపర్చడం, మురుగునీటిని శుద్ధిచేసేందుకు ఎస్‌పీలు నిర్మించడం, పిల్లల ఆటలకు సంబంధించిన ఏర్పాట్లు, వాకింగ్, సైకిల్ ట్రాక్‌లు, రీక్రియేషన్ సెంటర్లు, బోటింగ్, ఓపెన్ జిమ్ములు, పిక్‌నిక్ స్పాట్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామనిజీ హెచ్‌ఎంసీఅ ధికారులు తెలిపారు.

ఓ పౌరుడి ట్వీట్‌కు స్పందించిన అధికారులు

ఈ నేపథ్యంలో శనివారం సరూర్‌నగర్ చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సామాజిక మాధ్యమం ద్వారా ఓ పౌరుడు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. దీనిపై పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ సరూర్‌నగర్ చెరువును అభివృద్ధి చేయడంతోపాటు నగరంలోని మరో 20 ప్రధాన చెరువులను సాధ్యమైనంత త్వరగా అభివృద్ధిచేయనున్నట్టు ప్రకటించారు. అర్బన్ లేక్స్ అండర్ మిషన్ కాకతీయ పథకం కింద పనులు చేపట్టనుండడంతో నీటి పారుదల శాఖ నుంచి నిధులు విడుదలవుతాయని ఓ అధికారి తెలిపారు. ఈ మేరకు ఒకటిరెండు రోజుల్లోనే ఉత్తర్వులువెలు వడతాయన్నారు.

అభివృద్ధికి ప్రతిపాదిత చెరువులు, అంచనా వ్యయం వివరాలు..

నియోజకవర్గం	చెరువు	గ్రామం	వ్యయం (రూ.కోట్లలో)
శేరిలింగంపల్లి	పటేల్‌చెరువు	మదీనగూడ	12.63
కూకట్‌పల్లి	అంబీర్‌చెరువు	ప్రగతినగర్	25.58
కూకట్‌పల్లి	బోయిన్‌చెరువు	హస్మత్‌పేట్	14.75
రాజేంద్రనగర్	మల్కాచెరువు	ఉప్పర్‌పల్లి	4.70
రాజేంద్రనగర్	పెద్దచెరువు	నెక్నంపూర్	21.62
శేరిలింగంపల్లి	మల్కాచెరువు	రాయదుర్గం	7.89
శేరిలింగంపల్లి	పెద్దచెరువు	గంగారం, మదీనగూడ	19.05
ఉప్పల్	చెర్లపల్లిచెరువు	చెర్లపల్లి	12..28
మల్కాజిగిరి	ముక్కిడిచెరువు	ఆర్కేపురం	12.75
శేరిలింగంపల్లి	నల్లగండ్ల చెరువు	నల్లగండ్ల	16.43
ఉప్పల్	ఊరచెరువు	కాప్రా	9.41
ఖైరతాబాద్	అనంతగిరికుంట	షేక్‌పేట్	6.24
చాంద్రాయణగుట్ట	బండ్లగూడ	బండ్లగూడ	8.91
ఎల్బీనగర్	పెద్దచెరువు	మన్సూరాబాద్	7.39
ఎల్బీనగర్	మద్దెలకుంట	బైరామల్‌గూడ	4.69
అంబర్‌పేట్	మోహినిచెరువు	అంబర్‌పేట్	10.07
శేరిలింగంపల్లి	దుర్గంచెరువు	రాయదుర్గం, మాదాపూర్	41.46
ఉప్పల్	నల్లచెరువు	ఉప్పల్	7.85
కుత్బుల్లాపూర్	ఫాక్స్‌సాగర్	జీడిమెట్ల	42.22
ఖైరతాబాద్	సున్నంకుంట	షేక్‌పేట్	2.01
మొత్తం			287.93

కులవృత్తులకు సీఎం కేసీఆర్ అండ

- కాంగ్రెస్, బీజేపీలకు దోచుకోవడం, దాచుకోవడమే తెలుసు
- గంగపుత్రుల ఆత్మగౌరవసభలో ఎంపీ మల్లారెడ్డి



సభలో అభివాదం చేస్తున్న ఎంపీ మల్లారెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు, గంగపుత్ర ప్రతినిధులు

ఉప్పల్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు ప్రజలను దోచుకోవడం, దాచుకోవడంతోనే సరిపోయిందని మల్కాజిగిరి ఎంపీ చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. గంగపుత్రుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్ ఉప్పల్‌లోని మున్సిపల్ మైదానంలో గంగపుత్రుల ఆత్మగౌరవసభను టీఆర్‌ఎస్ నాయకుడు, గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకుడు తవిడబోయిన గిరిబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సభకు ఎంపీ మల్లారెడ్డితోపాటు టీఆర్‌ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి బేతి సుభాష్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర బీసీసెల్ అధ్యక్షుడు ముత గోపాల్, గంగపుత్ర సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస బాలకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గంగపుత్రులకు న్యాయం చేసేలా జీవో 6 రద్దుకు కృషిచేస్తామని, పాతపద్ధతి కొనసాగేలా చూస్తామన్నారు. గంగపుత్రులకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించేలా కృషి చేస్తామన్నారు. కుల సంఘాలకు సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధికి నిధులు కేటాయించారని గుర్తుచేశారు. దేశంలో ఎవరూ చేపట్టనివిధంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. రాష్ట్రంలోని చెరువులను మిషన్ కాకతీయలో అభివృద్ధి చేసి కృష్ణా, గోదావరి జలాలతో నింపి గంగపుత్రులకు ఉపాధి కల్పించారన్నారు. రూ.100 కోట్లు కేటాయించి, వారి సంక్షేమానికి తోడ్పాటు అందించారన్నారు. గంగపుత్రుల భవన నిర్మాణానికి 5 ఎకరాల భూమి, రూ.5 కోట్లు కేటాయించేలా చూస్తామన్నారు. బీసీ 'ఏ'లోనుంచి ఎస్టీలో చేర్చేలా పరిశీలిస్తామని పేర్కొన్నారు. సభలో నాయకులు పూస నర్సింహ, గంగపుత్ర రవి, వంగాల సతీశ్, పబ్బు గంగాధర్, సొల్ల సురేశ్, పబ్బు మురళీధర్, కావూరి వెంకటేశ్, మల్లేశ్, పవన్, సాయిబాబా, ఇటిక్యాల యాదగిరి, మేకల హన్మంతరెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, నందికంటి శివ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన గంగపుత్రులు

పాఠశాలల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ కేంద్రాలు

- టెన్త్ విద్యార్థుల అనుమానాల నివృత్తికి అందుబాటులో ఉపాధ్యాయులు
- హైదరాబాద్ డీఈవో వెంకటనర్సమ్మ



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకూడదని హైదరాబాద్ డీఈవో బీ వెంకటనర్సమ్మ 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. విద్యార్థులు అతిగా ఆలోచించి తమ ప్రవర్తనలో మరో ఆలోచనలకు పునాదులు వేస్తున్నారన్నారు. అలాంటి ప్రమాదకరమైన ఆలోచనలు మార్చేందుకు ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఈనెల 12, 13, 14 తేదీల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థి ప్రవర్తనలో మార్పుతోపాటు అధిక ఆలోచనతో మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. మంచి ప్రతిభ గల విద్యార్థులు సైతం ఒత్తిడికి లోనై ఇతర ఆలోచనలకు అవకాశం ఇచ్చే ప్రమాదం ఉన్నదన్నారు. భవిష్యత్‌ను అభివృద్ధి చేసుకునేందుకు తమ వంతుగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తారన్నారు. ప్రశాంతంగా పరీక్షలకు హాజరై తమ ప్రతిభను చాటినప్పుడే గొప్ప అవకాశాలు లభిస్తాయని వివరించారు. కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా తమ అనుమానాలు, అభద్రతసమ స్యకుపరి ష్కారం దొరకుతుందని తెలిపారు.

సినీదర్శకుల సంక్షేమానికి కృషి

ప్యానల్ ప్రచార సమావేశంలో దర్శకుడు ఎన్ శంకర్

నేడు తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం ఎన్నికలు



ఎన్ శంకర్ ప్యానల్ సమావేశానికి హాజరైన సినీ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, హరీశ్ శంకర్, ఎస్వీ కృష్ణారెడ్డి, బీ గోపాల్, కృష్ణవంశీ, కోదండరామిరెడ్డి తదితర దిగ్గజాలు

'దర్శకులు, దర్శకత్వ విభాగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న సమస్యలేమిటో నాకు తెలుసు. ఆత్మశుద్ధితో మీకు సేవ చేయాలనే సంకల్పంతో మీ ముందుకొస్తున్నా. అహర్నిశలు శ్రమిస్తూ మీ శ్రేయస్సుకు అంకితమవుతా' అన్నారు ప్రముఖ దర్శకుడు ఎన్ శంకర్. 2018 తసంవత్సరానికిగాను తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్‌కు ఆదివారం ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఎన్ శంకర్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో తన మద్దతుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తొలుత ఈ ఎన్నికల్లో పోటీ చేయొద్దనుకున్నానని, అయితే 'మనం చాలా సంక్షోభంలో ఉన్నాం. మీరొచ్చి గట్టెక్కించాలి' అని చాలా మంది సన్నిహితులు కోరడంతో పోటీకి ఒప్పుకున్నా అన్నారు. 2008-10 సంవత్సరంలో తాను టీఎఫ్‌డీఏ అధ్యక్షుడిగా పనిచేశానని, నాడు తమ కమిటీ ఎంతో పారదర్శకంగా పనిచేసిందన్నారు. ఒక్క అనర్హుడు కూడా లబ్ధి పొందకుండా నిజాయితీగా పనిచేశామన్నారు. ఇప్పుడు అదే సంకల్పంతో ముందుకొచ్చామని, గతంలో తాను ఏం చేశానో తెలుసుకుంటే భవిష్యత్‌లో ఏం చేయబోతాననే విషయం అర్థం చేసుకోవచ్చునన్నారు. బూటకపు హామీలు ఇవ్వడం ఇష్టం లేదన్నారు. మనమంతా ఆర్థికంగా బాగుండి మంచి ఆరోగ్యంతో ఉంటే సృజన శక్తులకు పదును పెట్టొచ్చని, తద్వారా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోగలుగుతామన్నారు. దర్శకులు క్రియేటివ్‌గా పనిచేసినప్పుడే రాణిస్తారని, ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని అసోసియేషన్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలనుకుంటున్నామన్నారు. కొన్నేండ్లుగా దర్శకుల సంఘం అవినీతిమయం అయిపోయిందన్నారు. 32 మంది అనర్హులు చిత్రపురికాలనీలో ఇండ్లను సొంతం చేసుకున్నారని, వారెవరో వెలికితీశామన్నారు. తమ కమిటీ ఎన్నికైతే వారందరినీ తొలగించి అర్హులకు ఇండ్లు ఇస్తామన్నారు. అన్యాయాన్ని సహించనని, అసోసియేషన్‌ను సమూలంగా ప్రక్షాళన చేయాలనే లక్ష్యంతో పోటీకి దిగానన్నారు. ప్రతి ఒక్కరూ విచక్షణతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ఒకప్పుడు టీఎఫ్‌డీఏ ఫిలిం చాంబర్‌ను శాసించే స్థితిలో ఉండేదన్నారు. కానీ కొంతమంది అసోసియేషన్‌ను భ్రష్టుపట్టించారని ఆవేదన వ్యక్తంచేశారు. దర్శకుల సంఘానికి శంకర్ పూర్వ వైభవం తీసుకొస్తారనే నమ్మకమున్నదన్నారు. బీ గోపాల్ మాట్లాడుతూ శంకర్ సమర్థతపై ఎంతో నమ్మకం ఉన్నదని, ఆయనను గెలిపించాలని కోరారు. ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం 'మా' అసోసియేషన్ ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నదని, వారి స్ఫూర్తితో టీఎఫ్‌డీఏ పనిచేయాలన్నారు. తెలివిగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

దర్శకుడి ఆలోచన నుంచే సినిమా పుడుతుంది

దర్శకుడి ఆలోచన నుంచే సినిమా పుడుతుందని, యూనియన్ పటిష్ఠంగా ఉంటే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని హరీశ్ శంకర్ ఆకాంక్షించారు. ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ శంకర్ వంటి అనుభవజ్ఞుడు పారదర్శకంగా పనిచేస్తారనే నమ్మకం ఉన్నదన్నారు. గతంలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఓ సమయంలో సభ్యులు కొట్టుకొనే స్థాయికి వెళ్లిందన్నారు. కొత్తగా ఎన్నికయ్యే కమిటీ ఈ సమస్యలను పరిష్కరిస్తుందనే విశ్వాసం ఉన్నదన్నారు. వీరశంకర్ మాట్లాడుతూ అన్ని అసోసియేషన్లు నిజాయితీతో పనిచేయాలని, అన్ని సంఘాలు శ్రమిస్తే దాదాపు 700 మంది అనర్హులు చిత్రపురికాలనీ నుంచి బయటకు వస్తారన్నారు. ఆర్థిక వ్యవహారాలన్నింటనీ డిజిటలైజ్ చేస్తే అక్రమాలను అరికట్టే వీలుంటుందని శ్రీవాస్ అన్నారు. పరిశ్రమలోని మిగతా సంఘాలు బలంగా ఉన్నాయని, ఎంతోమంది ప్రతిభావంతులున్న దర్శకుల సంఘం సమైక్యంగా ఎందుకు ఉండలేకపోతుందో ఆలోచించుకొనే తరుణమిదేనని గోపీచంద్ మలినేని సూచించారు. శంకరన్న ఆధ్వర్యంలో అసోసియేషన్ పురోగతి సాధిస్తుందని సంపత్ నంది విశ్వాసం వ్యక్తంచేశారు. అంతకుముందు దర్శకరత్న దాసరి నారాయణరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో కోదండ రామిరెడ్డి, ధవళ సత్యం, దశరథ్, రేలంగి నరసింహారావు, చంద్రమహేశ్, సంతోష్ శ్రీనివాస్, డార్లింగ్ స్వామి తదితరులు పాల్గొన్నారు. శంకర్ ప్యానల్ నుంచి జీ రాంప్రసాద్, కాశీవిశ్వనాథ్, ఏఎస్ రవికుమార్‌చౌదరి, ఎస్వీ భాస్కరరెడ్డి, కట్టా రంగారావు, ఎంఎస్ శ్రీనివాస్, ఎన్ గోపీచంద్, డీవీ రాజు, శ్రీకాంత్ అడ్డాల, అనిల్ రావిపూడి, ప్రియదర్శిని, జీ గంగాధర్, చంద్రకాంత్ రెడ్డి, కృష్ణబాబు, రామకోటేశ్వరరావు, అంజిబాబు, మధుసూదన్‌రెడ్డి పోటీచేస్తున్నారు. **– సినిమా డెస్క్**



వక్ఫ్ఆస్తుల అద్దెల సవరణ

- విలువైన స్థలాల్లో వాణిజ్య భవనాల నిర్మాణం
- నయీం బంధువు ఆధీనంలోని మూడెకరాలపై చర్యలు
- వక్ఫ్‌బోర్డు పాలకవర్గ సమావేశంలో నిర్ణయాలు



వక్ఫ్‌బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మహ్మద్ సలీం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వక్ఫ్‌కు చెందిన భవనాల అద్దెలను సవరించి స్థానిక మార్కెట్ రేట్ల ప్రకారం ఖరారు చేయాలని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు (టీఎస్‌డబ్ల్యూబీ) నిర్ణయించింది. కీలకప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం వెంటనే చేపట్టాలని శనివారం వక్ఫ్‌బోర్డు చైర్మన్, టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మహ్మద్ సలీం అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశం తీర్మానించింది. వక్ఫ్ ఆస్తిగా ఉన్న నబీ ఖానా భవనం 125 మడిగెల్లో అద్దెకు ఉంటున్నవారితో మాట్లాడి అద్దెను పెంచిన వక్ఫ్‌బోర్డు, మదీనా బిల్డింగ్ వద్ద ఉన్న 400 మడిగెల విషయంలో అదే విధానాన్ని కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నది. బేగంపేట వద్ద గతంలో టాస్క్‌ఫోర్సు కార్యాలయం ఉన్న స్థలంతోపాటు ఖైరతాబాద్‌లోని షాదాన్ కాలేజ్ ఎదురుగా ఉన్న విలువైన స్థలాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించి అద్దెకు ఇవ్వాలని, భువనగిరిలో నయీం బంధువులు ఆక్రమించిన మూడెకరాల వక్ఫ్ స్థలంపై త్వరగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. తాజాగా ఎనిమిది మేనేజింగ్ కమిటీలు, ఐదుగురు ముతవల్లీలను నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకున్నది. వక్ఫ్‌బోర్డు సీఈవో పదవీకాలం ఈ నెల 22తో ముగుస్తుండటంతో, ఆయన పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగించాలని ప్రభుత్వానికి లేఖ రాయాలని బోర్డు ఈ సమావేశంలో నిర్ణయించింది. సమావేశంలో బోర్డు సభ్యులు మౌజంఖాన్, జావేద్, సూఫియా, అక్బర్ నిజాముద్దీన్, వహిద్, వక్ఫ్‌బోర్డు సీఈవో అబ్దుల్ మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

Life is Beautiful
నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 11 మార్చి 2018
WWW. NTNEWS.COM



పూజా హెగ్డే..
జయాపజయాలతో సంబంధం లేకుండా రాణిస్తున్నది.. వరుస ఆఫర్లతో బిజీబిజీగా గడుపుతున్నది.. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్.. ఇలా అన్ని వుడ్‌లను టచ్ చేస్తున్నది.. ప్రస్తుతం రెండు, మూడు ప్రాజెక్టులతో తీరిక లేకుండా ఉన్నా.. మీ కోసం 'జిందగీ'తో తన ఇష్టాయిష్టాలను ఇలా పంచుకున్నది.

తప్పు కాదు.. తప్పదు!

- **రంగస్థలం సినిమాలోలో ప్రత్యేక పాట చేస్తున్నట్టున్నారు?**
- అవును. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్, సమంతలు నటిస్తున్న రంగస్థలంలో స్పెషల్ సాంగ్ చేశాను. జానపద పాటకు నృత్యం చేశాను. సినిమా విడుదలయ్యాక ప్రత్యేకంగా ఈ పాట గురించి చర్చిస్తారనే నమ్మకం ఉన్నది. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో చేయడం హ్యాపీగా అనిపించింది.

- **జిమ్‌లో వర్కవుట్ చేస్తున్న వీడియో లీక్ అయిందా? మీరు పోస్ట్ చేశారా?**
- (నవ్వుతూ..) అది లీక్ అవలేదు. ఇన్‌స్టగ్రామ్‌లో పోస్ట్ చేశాను. సోషల్‌మీడియాలో ఎవరికి తోచినట్టు వాళ్లు లీక్ అయిందని రాసుకుంటున్నారు. అయినా వర్కవుట్ చేసే వీడియో తీసి లీక్ చేయాల్సిన అవసరం ఎవరికి ఉంటుంది? అలా పోస్ట్ చేసినా వాళ్లకు ఏమొస్తుంది?

- **వంశీ పైడిపల్లి, మహేష్‌బాబుల తదుపరి చిత్రంలో నటిస్తున్నట్టున్నారు?**
- ట్విట్టర్‌లో పోస్ట్ కూడా చేశాను. అది అధికారికంగా ప్రకటన చేసి కూడా సుమారు నెల రోజులవుతున్నది.

- **'సాక్ష్యం'లో బ్రాహ్మణ అమ్మాయిగా నటించడం కోసం ఎలా ప్రాక్టీస్ చేశారు?**
- డైరెక్టర్ చాలా రిఫరెన్స్ వీడియోలు పంపారు. వాటిని చూసి లాంగ్వేజ్, యాటిట్యూడ్ ప్రాక్టీస్ చేశాను. బ్రాహ్మణ అమ్మాయి పాత్ర అనడం కన్నా స్పిరిచువల్ స్పీకర్ అనొచ్చు. ఈ పాత్ర కోసం ప్రవచనాలు, శ్లోకాలు నేర్చుకున్నాను. దానికోసం ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చింది. 'ముకుంద'లో గోపికమ్మ పాత్ర, 'దువ్వాడ జగన్నాథం'లో ప్రత్యేకమైన పాత్ర అలాగే ఇది కూడా ఒక భిన్నమైన పాత్ర. సాక్ష్యం సినిమాలో పాత్ర గురించి చెప్పాలంటే మోడ్రన్‌గా ఉండే అమ్మాయి స్పిరిచువల్ స్పీకర్‌గా ప్రసంగాలిస్తుంటుంది.

- **నితిన్, దిల్ రాజుల సినిమాను నిరాకరించారట?**
- ఈ విషయం ఇప్పుడే వింటున్నాను. ఇండస్ట్రీలో గాసిప్స్ కామన్. ఎప్పుడు ఏదో ఒకటి మాట్లాడుకుంటూనే ఉంటారు.

- **ఎన్టీఆర్, త్రివిక్రమ్‌ల సినిమాలో హీరోయిన్ మీరే అంటున్నారు? నిజమేనా?**
- ఈ విషయం మీద నేనేం మాట్లాడలేను. వాళ్లు అనుకున్నారేమో. నా వరకైతే రాలేదు. అది నిజమైతే తప్పకుండా ముందు మీతో (అభిమానులతో)నే పంచుకుంటాను.

- **మీకు నచ్చిన ప్రదేశం ఏది?**
- సెకన్ కూడా ఆలోచించకుండా కేరళ అని చెప్తా. అక్కడి మనుషులు, అక్కడి వాతావరణం అన్నీ స్వచ్ఛంగా ఉంటాయి. ముఖ్యంగా ఆ కొబ్బరి చెట్లు, అక్కడి వంటలు అన్నీ ఇష్టం.



- **మీ టు క్యాంపెయిన్ మీద స్పందించారు? మీరెప్పుడైనా ఇబ్బందిపడ్డారా?**
- నేనే కాదు. భారతదేశంలోని ప్రతి అమ్మాయి ఏదో ఒక సందర్భంలో అలాంటి ఇబ్బంది ఎదుర్కొనే ఉంటారు. అందమైన అమ్మాయనే కాదు.. సాధారణ గృహిణి కూడా రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుంటే రకరకాల కామెంట్లు చేస్తారు. మింగేసేలా చూస్తారు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోని అమ్మాయిలు మన దేశంలో తక్కువే ఉంటారు. మీ టు క్యాంపెయిన్ ద్వారా కొందరైనా మారుతారని భావించి నేను కూడా క్యాంపెయిన్‌లో పాల్గొన్నాను. ఈ క్యాంపెయిన్ వల్ల కొందరైనా మారారని, కొందరి ఆలోచన తీరైనా మారిందని అనుకుంటున్నా.

- **మీ అభిమాని మీపేరు పచ్చబొట్టు రాయించుకున్నాడు? దీనిపై ఎలా స్పందిస్తారు?**
- ఇలాంటి వార్తలు విన్నప్పుడు గర్వంగా అనిపిస్తుంది. ఒక్కోసారి భయం కూడా వేస్తుంది. ఈ అభిమానం ఎక్కడివరకు వెళ్తుందో అని. ఇలాంటి క్రేజీ ఫ్యాన్స్ ఉన్నారని తెలిశాక ఆనందపడ్డాను. అభిమానుల దగ్గర నుంచి ఇలాంటి వార్తలు విన్నప్పుడు ఈ జీవితానికి ఇది చాలు అనిపిస్తుంది. ఇలాంటి సంఘటనలు ఇంకా జరిగే ఉంటాయేమో కానీ నా దృష్టికి ఈ పచ్చబొట్టు వార్త వచ్చింది. ఆ అభిమానిని మాత్రం ఇంకా కలువలేదు.

- **తెలుగులో తదుపరి ప్రాజెక్టులేమున్నాయి?**
- ప్రస్తుతానికి అయితే బెల్లంకొండ శ్రీనివాస్‌తో సాక్ష్యం, వంశీ పైడిపల్లి.. మహేష్‌బాబులతో కలిసి ఒక ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఇంకే ప్రాజెక్ట్ ఇప్పటివరకు ఒప్పుకోలేదు. తదుపరి ప్రాజెక్టులు ఒప్పుకొంటే తప్పకుండా ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తా.

- **స్కూల్‌లో టామ్‌బాయ్‌లా ఉండేవారట?**
- స్కూల్ అనే కాదు.. మిస్ ఇండియా కాక ముందు వరకు చిన్నజుట్టు, ప్యాంట్‌షర్ట్‌లు వేసుకునే దాన్ని. కాలేజ్‌కి వచ్చాక కూడా అలాగే ఉన్నా. మిస్ ఇండియా అయ్యాక డ్రెస్సింగ్ స్టయిల్‌తో పాటు లైఫ్ స్టయిల్ మొత్తం మారిపోయింది.

- **టాలీవుడ్, బాలీవుడ్.. ఏ వుడ్ ఇష్టం?**
- తెలుగులో ఎక్కువ ఫ్రెండ్స్ ఉన్నారు. ఇక్కడే ఎక్కువ సినిమాలకు పనిచేశాను. ఇక్కడే ఎక్కువ నేర్చుకున్నాను. కాబట్టి టాలీవుడ్ అంటేనే ఇష్టం ఉంటుంది. అలాగని వేరే వుడ్‌ల మీద కోసం మాత్రం ఉండదు. చిన్నతనం నుంచి హిందీ సినిమాలు చూస్తూ పెరిగాను కాబట్టి బాలీవుడ్ అంటే ఓ రకమైన గౌరవం, అనుబంధం ఉంది.

- **ఇన్‌స్టగ్రామ్‌లో వంట చేస్తున్న వీడియో పెట్టారు. వంటలు బాగా చేస్తారా?**
- ఖాళీ సమయం దొరికినప్పుడల్లా ఇంట్లో ఉంటే వంట చేస్తా. ప్రత్యేక వంటలు ఏం చేయను కానీ.. నాకు తినాలపించే పాస్తా చేసుకుంటాను. ఓపిక ఉంటే ప్రయోగాలు చేస్తుంటాను.

- **ప్రయాణాలు చేస్తుంటారా?**
- ప్రయాణాలు.. నేనున్న రంగమే అలాంటిది. షూటింగ్‌ల కోసం విదేశాలు, ఇతర రాష్ట్రాలన్నీ తిరుగుతుంటాను. అక్కడ షూటింగ్ గ్యాప్ దొరికితే దగ్గర్లోని పర్యాటక ప్రాంతాలు, మంచి ఆహార పదార్థాలను రుచి చూస్తుంటాను.

- **ఫిట్‌నెస్ కోసం ఎలాంటి వర్కవుట్స్ చేస్తుంటారు?**
- ప్రతిరోజూ సుమారు 45 నిమిషాలైనా వర్కవుట్స్ చేస్తాను. ఒకవేళ షూటింగ్‌కి వెళ్తే అక్కడ కూడా ఏదైనా చిన్న చిన్న వర్కవుట్స్ చేస్తాను. వర్కవుట్స్ మాత్రం మానను.

- **ప్యాడ్‌మెన్ చాలెంజ్ మీద మీ అభిప్రాయం?**
- మంచి పరిణామం. శానిటరీ న్యాప్‌కిన్స్ మీద చర్చ జరుగడం మంచి విషయం. ఒకప్పుడు అదేదో తప్పుగా భావించేవాళ్లు. ఇప్పుడు కనీసం దాని మీద చర్చ జరుగడం, పది మంది మాట్లాడడం, సినిమా రావడం మార్పునకు నాందిగా భావిస్తున్నాను. నెలసరిని అంటుగా భావించే ఆలోచన నుంచి అర్థం చేసుకునే స్థాయికి వచ్చింది. అందరిలో మార్పు రావడం కోసం అందరూ సెలబ్రిటీలతో పాటు ప్యాడ్‌మన్ చాలెంజ్‌లో నేను కూడా పాల్గొన్నాను. సమాజంలో మార్పు కోసం ప్రయత్నించాల్సిన బాధ్యత భారత పౌరురాలిగా నాపై కూడా ఉంటుంది. ఈ విషయమనే కాదు, మంచి కోసం, మార్పు కోసం నా వంతుగా స్పందిస్తుంటాను. అయినా ఇలాంటి విషయాల గురించి మాట్లాడడం తప్పు కాదు. తప్పకుండా మాట్లాడాలి. మాట్లాడకపోతేనే తప్పవుతుంది.

అజహర్ షేక్

రాతలు మారుస్తున్నది!



ఇప్పటికీ అంటరానితనం చాలాచోట్ల కనిపిస్తున్నది. బీహార్‌లోని ముసహర్ అనే దళిత కులాన్ని అక్కడ వెలివేసినట్టే చూస్తారు. కానీ వారికి ఆసరాగా నిలిచి, వాళ్ల కోసం ఎన్నో పనులు చేస్తున్నది పద్మశ్రీ సుధా వర్గీస్.

కేరళలోని కుట్టాయంలో పుట్టి పెరిగింది సుధ. టీనేజ్ వయసులో బీహార్‌కి వెళ్లాల్సి వచ్చింది. అక్కడే మహా దళిత ముసహర్ కమ్యూనిటీ గురించి తెలిసింది. వారి జీవితాల్లో వెలుగులు తీసుకురావడానికి ముందడుగు వేసింది. వాళ్ల సమాజంలో గౌరవంగా జీవించాలని అనుకుంది. వారి హక్కుల కోసం పోరాటం చేయడం మొదలుపెట్టింది. అయితే వారిలో మార్పు తీసుకురావాలంటే ముందు తనకు చదువు రావాలి. అందుకే హిందీ, ఇంగ్లిష్ మీద పట్టు సాధించింది. ఆ తర్వాత హక్కుల కోసం పోరాడాలంటే లాయర్ వృత్తి సరైనదనుకుంది. లా చదివింది. అలాగే 1987లో నారీ గుంజాన్ పేరుతో దళిత మహిళ హక్కుల కోసం ఎన్జీవోని స్థాపించింది. 2005లో ఒక పాఠశాలను కూడా స్థాపించింది. ఇప్పుడు మరో పాఠశాలను కూడా ప్రారంభించే ఏర్పాట్లలో ఉంది సుధ. పిల్లలు కూడా చదువుతో పాటు, ఆటల్లో కూడా ప్రావీణ్యం చూపుతున్నారని చెబుతున్నది సుధా వర్గీస్. వారి కోసం కరాటే టీచర్లను కూడా నియమించింది. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న పిల్లలు ఎన్నో కాంపిటీషన్‌ల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించారు. అలాగే అక్కడి మహిళల కోసం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను ఏర్పాటు చేసింది. వాళ్లు స్వశక్తితో నిలబడేలా వారికి చేయూతనందిస్తున్నది సుధా వర్గీస్. ఆ దళిత మహిళలు ఇప్పుడొక బ్యాండ్ కూడా ఏర్పాటు చేశారు. మగవాళ్లే డప్పు వాయిద్యాలు వాయిస్తారా? వాళ్లకు దీటుగా ఈ రంగంలో రాణిస్తామంటూ ముందుకొచ్చారు. వాళ్లకు సుధ ప్రత్యేక క్లాసులు ఇప్పించింది. ఇన్ని మంచి పనులు చేసిన ఈమెకు 'సైకిల్ దీదీ' అని పేరు. ఎక్కడికి వెళ్లాల్సి వచ్చినా, ఎవరు ఏ సహాయం కోరినా వెంటనే సైకిల్ మీద పరిగెత్తుకొచ్చేస్తుందట. అందుకే ఆ పేరు పెట్టారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఆమె సేవను గుర్తించి అవార్డులు, రివార్డులు అందచేశాయి. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది.

పెదవులపై మీసాలా?

మగవాళ్లకు మీసాలుండాలి. అదే ఆడవాళ్లకు వస్తే బాగుండదు. ఈ అవాంఛిత రోమాలను తొలిగించడానికి సహజమైన పద్ధతులు పాటిస్తే ఈ సమస్య నుంచి గట్టెక్కొయొచ్చు.



- పసుపు, నీళ్లు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని వెంట్రుకలు పెరిగే వ్యతిరేక దిశలో రాయాలి. కొంతసేపు ఆగి చల్లని నీటితో కడిగేయాలి. ఆ తర్వాత మాయిశ్చరైజర్ రాస్తే సరిపోతుంది. ఇలా తరుచుగా చేయడం వల్ల అవాంఛిత రోమాలు తొలిగిపోతాయి.
- పెరుగు, శనగపిండి, పసుపు వేసి బాగా కలుపాలి. దీన్ని పెదవులపై రాసి కాసేపటి తర్వాత కడిగిస్తే సరిపోతుంది.
- చక్కెర పాకం, నిమ్మరసం, నీళ్లను కలిపి మిశ్రమంగా తయారు చేసుకోవాలి. దీన్ని పెదవులపై రాసి ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా తరుచుగా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- మొక్కజొన్న పిండి, పాలను కలిపి పేస్ట్ చేయాలి. దీన్ని వెంట్రుకలపై రాసి 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఇలా చేయండి.
- ఓట్‌మీల్, అరటిపండు కలిపి పేస్ట్ చేయాలి. అందులో తేనె కలిపి వెంట్రుకలపై రాసి అవాంఛిత రోమాలపై రాయాలి. ఇలా చేస్తే తొందర్లోనే అవాంఛిత రోమాలు తొలిగిపోతాయి.
- గెలాటిన్, పాలు, లవంగ నూనెలను కలిపి మిశ్రమంగా చేయాలి. దీన్ని వెంట్రుకలపై రాయాలి. కొంతసేపటికి మాస్క్‌లా ఏర్పడుతుంది. ఆ తర్వాత నీటితో కడిగేయాలి.
- పడుకునే ముందు ఆలుగడ్డను కోసి ఆ ముక్కతో వెంట్రుకలపై మసాజ్ చేయాలి. రాత్రంతా అలాగే వదిలేసి ఉదయం కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.

పర్యావరణానికి ఊపిరి!



మనకు స్వచ్ఛమైన గాలినిచ్చి.. మంచి ఆరోగ్యాన్నిచ్చి పర్యావరణం కాపాడుతుంది. అంత మేలు చేస్తున్న పర్యావరణానికి మనం ఏం చేస్తున్నాం? తిరిగి ఏదైనా చేయాలి. ఏదీ చేయకున్నా దాన్ని పరిరక్షిస్తే సరిపోతుంది. కానీ ఎంతమంది చేస్తున్నాం?

వర్షా జోషి గురించి తెలుసుకుంటే కొందరిలోనైనా మార్పు రావచ్చేమో. ఆమె ఢిల్లీలోని ట్రాన్స్‌పోర్ట్ అధికారి. ట్రాన్స్‌పోర్ట్ విభాగం అంటేనే మామూళ్లకు అడ్డా అనే భావన ప్రజల్లో ఉంటుంది. అడ్డగోలుగా ట్రాన్స్‌పోర్ట్ అనుమతులు ఇచ్చి పైసలు దండుకొని.. పర్యావరణాన్ని పాడుచేస్తుంటారనే అపవాదు కూడా ఉన్నది. కానీ వర్షా జోషి మాత్రం అలాంటి పనులకు నో చెప్పింది. డబ్బు కంటే పర్యావరణ పరిరక్షణకే ప్రాధాన్యత ఇచ్చింది. అసలే ఢిల్లీలో పొగ.. దుమ్ము అలుముకొని వాతావరణం పాడైపోతున్నది. వేడెక్కి జన జీవనానికి ఇబ్బందిగా మారుతున్నది. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్దేందుకు వర్ష కంకణం కట్టుకొని పనిచేస్తున్నది. 1995 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వర్ష.. చిన్నప్పట్నుంచే సమాజంపై అవగాహన కలిగి ఉన్నది. తండ్రి లేకపోవడం.. తల్లి తనకోసం కష్టపడటం అన్నీ గమనించిన ఆమె పురుషాధిక్య పోటీ ప్రపంచాన్ని ఢీకొని ఐఏఎస్‌గా ఎంపికైంది. మనకు అన్నీ ఇచ్చే పర్యావరణాన్ని పరిరక్షించడమే బాధ్యతగా తీసుకొని పనిచేస్తున్నది.

రాత్రిళ్లు ఏ ఆహారం తినాలంటే?

సమయపాలన లేకుండా తినడం వల్ల చాలామంది బరువు పెరుగుతుంటారు. రాత్రిళ్లు ఇష్టం వచ్చినట్లు ఏదిపడితే అది తిని అనారోగ్యాన్ని తెచ్చుకుంటారు. మరి రాత్రిళ్లు ఏ ఆహారం తీసుకోవాలంటే..?



- రాత్రిపూట తీసుకొనే అల్పాహారంలో ఆపిల్/అరటి పండ్లను చేర్చుకోవాలి. ఇవి తింటే కడుపు నిండినట్లుగా అనిపిస్తుంది. వీటిల్లో ఉండే పీచు పదార్థాలు కడుపు శుభ్రమవుతుంది.
- పాలలో ఓట్మీల్/మొక్కజొన్న/ గోధుమ వంటి కార్బోహైడ్రేట్ల కలిగినవి కలిపి తీసుకోవాలి.
- రాత్రిపూట అల్పాహారంలో క్యారెట్లు చేర్చడం వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్లు, మినరల్స్ అందుతాయి. దీంతో సులభంగా విరేచనం అవుతుంది.
- రాత్రి ఒక కప్పు పెరుగు తీసుకోవడం వల్ల కడుపునకు ఉపశమనం కలుగుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది.
- లీన్ ప్రోటీన్లను కలిగిన చేపలను తినడం కూడా మంచిదే. వీటిల్లో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. తక్కువ కొవ్వు ఉండడంతో త్వరగా బరువు తగ్గిపోతారు.
- ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడ ం వల్ల కడుపు నిండుగా ఉండి ఆకలి వేయదు.
- ప్రొటీన్ ఎక్కువ ఉండే డైట్ పాటించే వారి మెదడుకు తక్కువ స్థాయిలో ఉన్న ఆకలి హార్మోన్లు అందుతాయి. దానివలన ఆకలి వేయదు. ఏమీ తినాలనిపించదు.
- అలాగని ప్రొటీన్ ఎక్కువగా అందే పదార్థాలను తీసుకోవడం కూడా మంచిదికాదు. దీని వలన గుండె జబ్బులు కూడా రావొచ్చు. కాబట్టి అవసరాన్ని బట్టి మాత్రమే ప్రొటీన్ ఉన్న ఫుడ్ తీసుకోవాలి.

నమస్తే తెలంగాణ

సింగిడి

[హైదరాబాద్]

ఆదివారం 11 మార్చి 2018

ఆలోచింపజేసే 'సీల్'!

పెండ్లి కాకముందు అమ్మాయిలకు అంతో ఇంతో స్వేచ్ఛ ఉంటుంది. కానీ పెండ్లయ్యాక ఉన్న ఆ కాస్త ఫ్రీడమ్ కూడా పోతుంది. అంగరంగ వైభవంగా.. అట్టహాసంగా చేసి ఇరు కుటుంబాలకు ఆనందాన్నిస్తే.. పెండ్లి కూతురుకు మాత్రం నిర్బంధం తోడుగా వస్తుంది.



పెండ్లి తర్వాత అమ్మాయి జీవితం ఎలా ఉంటుందో చెప్తూ తాజాగా ఓ లఘుచిత్రం వచ్చింది. దానిపేరు 'సీల్' గౌరవ్ మెహ్రా దర్శకత్వంలో వచ్చిన ఈ షార్ట్ ఫిల్మ్ అందర్నీ ఆలోచింపజేస్తున్నది. 12 నిమిషాల 24 సెకన్ల నిడివి ఉన్న ఈ ఫిల్మ్‌లో పెండ్లయి మెట్టినింటికి వెళ్లిన తర్వాత వధువు ఎదుర్కొనే అనుభవాలను చూపించాడు దర్శకుడు. ఫస్ట్‌నైట్ రోజున ఆమెకు ఎదురయ్యే సంఘటనలను ప్రధానంగా ప్రస్తావించాడు. పుట్టినింట్లో ఎలా ఉన్నదో.. మెట్టినింట్లోనూ అలానే ఉంటే కుదురదు. అప్పటికప్పుడు ఆమెకు కొన్ని నిబంధనలు వస్తాయి. షరతులతో కూడిన జీవితం ప్రారంభించాల్సి ఉంటుంది. ఫస్ట్‌నైట్‌ను ఒక్కొక్కరు ఒక్కో రకంగా జడ్జ్ చేస్తారు. ఒక వధువుగా తన ఫస్ట్‌నైట్ గురించి ఆమె ఎలాంటి తీర్పునిచ్చుకుంటుంది? వంటి అంశాలను 'సీల్'లో చెప్పాడు దర్శకుడు గౌరవ్ మెహ్రా. నిడివి తక్కువే అయినా మంచి సందేశాన్ని ఇవ్వడంతో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఇచ్చిన కానుకగా 'సీల్' షార్ట్‌ఫిల్మ్‌ను మెచ్చుకుంటున్నారు నెటిజనులు.

నాకిష్టమైన పాటలు..

1. రూబా రూబా	-	ఆరెంజ్
2. అమ్మా అమ్మా	-	రఘువరన్ బీటెక్
3. ఏవోవే కలలు	-	జీన్స్
4. మంచు తాకిన	-	ఎలా చెప్పను
5. హృదయం ఓర్చుకోలేనిది	-	పరుగు
6. లవ్ మీ అగైన్	-	నాన్నకు ప్రేమతో
7. నీ కోసం.. ఒక	-	హ్యాపీ
8. నీ పాట మధురం	-	త్రీ
9. ఒక దేవత	-	నిన్నే ప్రేమిస్తా
10. తకిట తకజుమ్	-	రారండోయ్ వేడుక చూద్దాం

-రఘు, దుద్యాల్, మహబూబ్‌నగర్

మీకు నచ్చిన పాటలు కూడా పంపొచ్చు. ప్రచురిస్తాం.

ఈమెయిల్ : zindagi.nt@gmail.com

మా అడ్రస్ : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం, # 8-2-603/1/7,8,9 కృష్ణాపురం, రోడ్‌నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034

మరిచిపోలేని క్యారెక్టర్లు!

ఏదైనా సినిమా బాగుందని టాక్ వస్తే చాలు.. ఉన్నఫళంగా టిక్కెట్లు బుక్ చేసుకొని సినిమాకు వెళ్లిపోతాం. సినిమా బాగుండి.. అందులో బాగా నటించిన, నవ్వించిన, మనల్ని మెప్పించిన క్యారెక్టర్ ఏదైనా ఉంటే చాలు.. ఆ క్యారెక్టర్‌ను చాలాకాలం పాటు గుర్తు పెట్టుకుంటాం.. పలు సందర్భాల్లో గుర్తు తెచ్చుకుంటాం. అలాంటి క్యారెక్టర్లు తెలుగు సినిమాల్లో చాలా ఉన్నాయి. ఓ లెక్కవేసి ఇన్ని క్యారెక్టర్లు అని చెప్పడం కాస్త కష్టమే. అయితే.. ఈ మధ్య కాలంలో వచ్చిన కొన్ని సినిమాల్లో చాలా క్యారెక్టర్లు వాటి స్వభావాలు మనల్ని ఆకట్టుకున్నాయి. వాటిని ఈ వారం ఓసారి గుర్తు చేసుకుందామా!

భానుమతి



'బాడ్కావ్.. బల్సిందా రా? బొక్కలిరగ్గొడతా' అంటూ ఎంట్రీ సీన్‌లోనే థియేటర్‌లో విజిల్స్ కొట్టించింది ఫిదా సినిమాలో భానుమతి. ఆ తెగువ, చొరవ, కొంటెతనం ఎవరినైనా ఆకట్టుకునేలా ఉంటాయి. తెలంగాణ యాసలో డైలాగులు పలికించిన భానుమతిలా ఎంతోమంది అమ్మాయిలు ఊహించేసుకున్నారు.. పోల్చి చూసుకున్నారు. తండ్రికి మందులు అందించే సీన్‌లో, పెళ్లి చేసుకొని అక్క అత్తగారింటికి వెళ్లిపోతున్న సమయంలో భానుమతి పలికించిన హావభావాలు ప్రతీ చెల్లె ముఖంలో పలికినవే. అందుకే.. ఫిదా సినిమాలో భానుమతిని 'ఈమె మా భానుమతి.. ఒక్కటే పీస్.. హైబ్రిడ్ పిల్లా' అంటూ తెలుగు ప్రేక్షకులు సొంతం చేసుకున్నారు.

అర్జున్‌రెడ్డి - ప్రీతి - శివ

ఇద్దరు ప్రేమికుల మధ్య ఉండే భావోద్వేగాల్ని, ప్రేమానురాగాల్ని ఇప్పటి జనరేషన్‌కి తగ్గట్టుగా చూపిస్తే.. అదే.. అర్జున్‌రెడ్డి సినిమా. దేనికైనా తొందరగా స్పందించే అర్జున్‌రెడ్డి, ప్రతీ విషయంలో ప్రాక్టికల్‌గా ఆలోచిస్తూ.. అర్జున్‌ని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే సౌమ్యురాలుగా ప్రీతి ప్రేమికుల, ప్రేక్షకుల మనసులో ఒక దేవదాసు పార్వతిలా, ఒక లైలామజ్నూలా, ఒక రోమియో జూలియట్‌లా, సలీం అనార్కలిలా ఎప్పటికీ గుర్తుండిపోతారు. వారి కథ ఒక అప్‌డేటెడ్ లవ్‌స్టోరీలా ఎప్పటికీ గుర్తుండి పోతుంది. ఈ సినిమాలో నిత్యం హీరో వెంట ఉంటూ ప్రేమ విఫలమై తిరుగుతున్న అర్జున్‌రెడ్డిని కాపాడుకొనే ఫ్రెండ్ శివ పాత్ర కూడా అంత తొందరగా మరిచిపోలేం. ప్రతీ ఒక్కరి జీవితంలో ఇలాంటి ఫ్రెండ్ ఒకరు ఉంటారు.



రావణ్ మహరాజ్ ఉరఫ్ జై




'ఆ రావణుడ్ని సంపాలంటే సముద్రం దాటాలా.. ఈ రావణుడ్ని సంపాలంటే.. సముద్ర మంత ధ.. ధ.. ధైర్యం ఉండాలా.. ఉందా?' అంటూ జై లవకుశ సినిమాలో నట విశ్వరూపం చూపించిన జై ఉరఫ్ రావణ్ మహరాజ్ పాత్రను కూడా నందమూరి అభిమానులు, తెలుగు ప్రేక్షకులు ఇప్పట్లో మరిచిపోలేరేమో. ఒక వైపు చిలిపిగా, దొంగలా నటిస్తూ.. మరోవైపు బ్యాంకు మేనేజర్‌గా సౌమ్యంగా హావభావాలు పలికిస్తూ.. భైరంపూర్‌ని పాలిస్తున్న నియంతగా, రావణ్ మహరాజ్‌గా నటించిన పాత్రలు దేనికవే గొప్ప. కానీ.. ప్రేక్షకులు మాత్రం.. 'రావణా.. జై.. జై.. జై.. సింహాసనా' అంటూ జై పాత్రకే జై కొట్టారు. జై కనిపిస్తే థియేటర్లు దద్దరిల్లిపోయేలా విజిల్స్ కొట్టారు. గతేడాది వచ్చిన సినిమాల్లో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో అంతలా ముద్ర వేసుకుంది జై లవకుశ సినిమాలో జై పాత్ర.

భాగమతి ఉరఫ్ చంచల



ఈ ఏడాది వచ్చిన భాగమతి సినిమాలో టైటిల్‌రోల్ చేసిన అనుష్క పెర్ఫార్మెన్స్‌ను ఎవ్వరూ మరిచిపోలేరు. ఒక కేసులో ఐఏఎస్ చంచలను బంధించి ఎవరికీ తెలియని, భయంకరమైన భాగమతి కోటలో ఇంటరాగేషన్ చేస్తుంటారు. ఆ సమయంలో భాగమతి గురించి తెలుసుకొని, భాగమతిగా మారి కేసు నుంచి బయటపడిన చంచల తెలివిని, అనుష్క నటనను ఎవరూ మరిచిపోలేరు. 'నువ్వు నన్నేం చేయలేవురా' అంటూ అరుంధతిలో గర్జించిన అనుష్క, ఈ సినిమాలో 'లెక్కలు తేలాల్సిందే' అంటూ చెప్పిన డైలాగులు అనుష్కలోని నటనా కౌశలాన్ని మరోసారి నిరూపించాయి.

కౌశిక్



'టైం అంటే కౌశిక్.. కౌశిక్ అంటే టైం.. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా బ్లాక్‌లో మందు కొనలేదే తెల్సా' అంటూ సైలెంట్‌గా వచ్చి అందరి అభిమానాన్ని పొందాడు ప్రియదర్శి. పెళ్లి చూపులు సినిమాలో ఏం చేస్తున్నావ్ అని అడిగే ప్రశ్నకు.. 'నా సావు నేను సస్త.. నీకెందుకు.. అనే బుక్ రాస్తున్న' అంటూ సమాధానమిచ్చి అందరినీ నవ్వించాడు. ఖాళీగా ఉండే కుర్రకారును ఇదే ప్రశ్న ఎవరైనా అడిగితే.. బదులు చెప్పడానికి అద్భుతమైన క్లూ ఇచ్చిన పెళ్లిచూపులు కౌశిక్‌ని ఎప్పటికీ మరిచిపోలేరు.

రాముడు - గురు



బాక్సింగ్ కోచ్‌గా గురు సినిమాలో విక్టరీ వెంకటేశ్ లుక్, అటిట్యూడ్, నటన ఆకట్టుకున్నాయి. ఎంతో అనుభవమున్న వెంకటేశ్‌లాంటి నటుడితో పోటీపడి రాముడు పాత్రలో నటించిన రితికా సింగ్ కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. క్లైమాక్స్‌లో ఈ రెండు పాత్రలు గెలుపు కోసం పడిన తపన, గెలువాలన్న కసి ప్రతీ ఆటగాడికి, క్రీడా ప్రేమికుడికి కలకాలం గుర్తుండిపోతాయి. ఒకవైపు గురువుగా భావిస్తూనే.. గురువునే ప్రేమించి, సొంతం చేసుకోవాలనుకునే అమాయక అమ్మాయి పాత్రలో రాముడు (రితికాసింగ్) నటన అంత తొందరగా మరిచిపోలేం.

బాహుబలి



ప్రజలను కన్నబిడ్డలుగా పాలిస్తూ.. శత్రువు గుండెల్లో గుర్రాలు పరుగెత్తించగల వీరుడు, చెలి మనసులో చెరుగని ముద్ర వేసుకున్న సుందరాంగుడు అయిన బాహుబలి క్యారెక్టర్ తెలుగు సినిమాలోనే మరువలేని పాత్ర. తెలుగు సినిమాను ఒక స్థాయికి తీసుకెళ్లిన బాహుబలి సినిమాలో బాహుబలి పాత్రతో పాటు విలనిజానికి రౌద్రాన్ని మరోసారి పరిచయం చేసిన భల్లాలదేవ, శివగామి, కట్టప్ప, శివుడు, దేవసేన, అవంతిక, సంగి, కాలకేయ లాంటి పాత్రలు చరిత్రలోనే కాదు.. ప్రేక్షకుల గుండెల్లో కూడా ఎప్పటికీ మరిచిపోని, మరుపురాని స్థానాన్ని సంపాదించుకున్నాయి.


లక్కీ (భలే భలే మగాడివోయ్)



ఒక విషయం గురించి ఆలోచిస్తూ, మరో విషయాన్ని మరిచిపోయే లక్కీ పాత్రలో నాని చేసిన హడావుడి, హంగామా ప్రేక్షకులకు భలే భలేగా నచ్చాయి. అందుకే భలే భలే నటించావోయ్ అంటూ ఆ సినిమాకు మంచి సక్సెస్ అందించారు. నిజ జీవితంలో మతిమరుపుతో బాధపడేవారి సమస్యలను ఫన్నీగా డిజైన్ చేసి చూపించాడు దర్శకుడు మారుతి. ఈ సినిమాలో నాని పాత్రను చూసి కడుపుబ్బా నవ్వుకున్నోళ్లు.. ఎవరైనా మతిమరుపు వ్యక్తులు ఎదురుపడితే లక్కీనే గుర్తు చేసుకుంటారు.

త్వరలో విడుదల

'నా పేరు చిట్టిబాబండీ.. ఈ ఊరికి నేనే ఇంజనీర్‌ని' అంటూ పరిచయం చేసుకున్న చిట్టిబాబు తన సినిమా విడుదల కాకముందే తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు 'భరత్ అను నేను.. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి' అంటూ రాజకీయ నాయకుడిగా రాబోతున్న భరత్ కూడా ఇప్పటికే సినిమా ప్రేమికులను ఆతృత పెడుతున్నాడు. 'చచ్చిపోతాను గాడ్‌ఫాదర్.. కానీ ఇక్కడ కాదు.. బార్డర్‌లో చచ్చిపోతాను' అంటూ కోపానికి మారుపేరుగా మారిన పాత్రలో అల్లుఅర్జున్ నా పేరు సూర్య అంటూ రాబోతున్నాడు. విడుదలకు ముందే మరిపోకుండా తమదైన శైలిలో ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదించుకున్న ఈ పాత్రలను త్వరలోనే తెర మీద చూడబోతున్నాం. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో.. అద్భుతమైన పాత్రలు తెలుగు తెర మీద ఆవిష్కృతమయ్యాయి. అద్భుతాలుగా చిరకాలం నిలిచిపోయాయి. అలాంటి పాత్రలన్నింటినీ గుర్తు చేసుకుంటూ.. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో గూడు కట్టుకొనే పాత్రలు మరిన్ని పాత్రలు రావాలని కోరుకుంటూ.. అందరికీ హ్యాపీ సండే.



- ప్రవీణ్‌కుమార్ సుంకరి

షిప్ ఆఫ్ థిసియస్ - తాత్త్విక వినోదం !!

అవును చీకటి కుహరంలా కనిపించే మన మనసులోకి వెళితే తప్ప.. విలువైన మానవతా వజ్రపుగనులు కనపడవు.! షిప్ ఆఫ్ థిసియస్.. తప్పకుండా చూడాల్సిన వినోదాత్మక తాత్త్వికమైన సినిమా!


క్లాసిక్ మూవీ

ప్రశ్నలు.. ప్రశ్నలు.. ప్రశ్నలు.. చిన్నప్పటి నుంచీ ప్రశ్నలు.. ఆకాశం లో నక్షత్రాలేమిటి?? అక్కడ ఎవరుంటారు?? పువ్వులింత అందంగా ఎలా ఉన్నాయ్ ?? పక్షుల్లా మనం ఎగిరితే ఎంత బావుంటుంది?? ఈ స్కూలికెందుకు వెళ్లాలి?? ఈపుస్తకాలేంటీ?? పాపం ఎలా తగులుతుంది?? దెయ్యాలున్నాయా?? దేవుడేంటీ?? దేవుడెలా ఉంటాడూ??.. అసలు నేనెవరు? మొదలైనవి ఎన్నో ప్రశ్నలు !!

తాత్త్విక ఆలోచనల సంపుటాన్ని 'థిసియస్ పారడాక్స్' అన్నారు. తాత్త్విక ప్రశ్నల్ని తానూ వేసుకొని, తనకొచ్చిన సమాధానాలూ.. ప్రశ్నలూ అనుమానాలూ సినిమా రూపంలో మనముందుంచాడో యువకుడు. అతని పేరు ఆనంద్ గాంధీ, ఆ సినిమా పేరు షిప్ ఆఫ్ థిసియస్.

సినిమాల్లో చూపించిన మూడు కథల గురించి చాలామంది వివరించారు. అయితే ఆనంద్ గాంధీ కొన్నింటికి సమాధానాలు సరిగ్గా చెప్పలేదనీ.. స్పష్టంగా లేవనీ కొందరన్నారు. ఆయనకుండే స్పష్టత ప్రశ్నలే. తనకి తోచినమేర దాన్ని అర్థం చేసుకోవడానికి...తానర్థం చేసుకున్న దాన్ని మనకి చూపించడానికి ప్రయత్నించాడు. తప్ప ఇవీ నా సమాధానాలు అని మనని సమాధాన పరుచలేదు. ఈ ప్రశ్నలకి ఎవరికి వాళ్ళే సమాధానం చెప్పుకోవసినవి. దొరక్కపోతే అన్వేషించుకోవలసినవి తప్ప... ఎవరో సమాధానం చెప్పరు. చెప్పలేరు.

మొదటికథలో.. ఒక అందమైన అంధురాలు ఫోటోగ్రఫీ చేస్తుంటుంది. ధ్వనిని బట్టి అక్కడ ఉన్న సబ్జెక్టుని తెలుసుకొని.. క్లిక్ మనిపిస్తుంది. చూపు లేకపోయినా మంచి చిత్రాలు తీయగలగే సునిశిత్వత్వం ..కళా ఆమెకి స్వతహాగా అబ్బింది. అమె చిత్రాలు జనాదరణ పొందుతాయి. అలాంటి సమయంలో..ఎవరో కళ్ళు దానం చేయగా అమెకి చూపొస్తుంది. చూపొచ్చాక ఫోటోలు తీసే ప్రయత్నం చేస్తుంది. కానీ అవి తనకే నచ్చవు. చూపు లేనపుడు తాను ఊహించుకున్న ప్రపంచం, సౌందర్యం ...చూపొచ్చాక తనకి కనపడకపోవడమే, ఊహకీ వాస్తవానికీ ఉన్న తేడా అన్న మాట, అమె గొప్పగా ఊహించుకున్నది. కానీ అంత గొప్పేమీ లేదు ప్రపంచంలో! తన విద్యలో. తన కంటిమార్పిడి ద్వారా తనకున్న జ్ఞాననేత్రం మూసుకొని పోవడమే. మన థియరీ ప్రకారం.. వస్తువులో చెడిపోయిన భాగాన్ని రిపేరు చేసి కొత్త భాగం అతికిస్తే అది ఒరిజినల్‌లా పని చేస్తుందా? ఏనాటికీ చేయదు. ఆమెకి కళ్ళొచ్చాయి కానీ కళ కోల్పోయింది. !!



రెండవకథలో జైన యోగి మనుషులకి ఉపయోగపడే మందులు కనుక్కొనే ప్రయోగాల్లో భాగంగా జంతువులు హింసకి గురవుతున్నాయి అంటాడు. ఆవ్యాజ్యాన్ని కోర్టుకెక్కిస్తాడు. కనీసం వాటికి మంచి వసతి ఏర్పాటు చేయాలి చచ్చేవరకూ అని అతని వాదన. కానీ అతని కాలేయానికి వ్యాధి సోకుతుంది. ఆపరేషన్ చేసి కాలేయ మార్పిడి చేయాలంటారు.చివరాఖరికి బాధలో జ్ఞాననేత్రం వెలిగి ఆపరేషన్‌కి సిద్ధమవుతాడు.

ఇక మూడవకథ డబ్బే ప్రపంచంగా బిజినెస్ లో తల మునకలయ్యే ఒక యువకుడికి ఆపరేషన్ జరిగి కిడ్నీ అమరుస్తారు ఎవరో దాతది. డిశ్చార్జ్ అయ్యి ఇంటికొస్తాడు. వాళ్ల నానమ్మ మాత్రం ప్రజాసేవ..జీవిత పరమార్థం అని ఏదో చెపుతుంటుంది. ఆవేశం ఎక్కువ కుర్రాడికి. కానీ ఆమె జారిపడి కాలు విరగడంతో ఆసుపత్రిలో జాయిన్ చేస్తాడు. అక్కడ అమెకీ అతనికి ఒక అర్థవంతమైన చర్చ జరుగుతుంది. అతనిలోకి మరోభాగం అమరింది కనక అతనిలో మార్పు కలగాలిగా ..కలుగుతుంది. హాస్పిటల్లో ఎవరివో ఏడుపువు వినపడటం. ఎవరిదో మరో ఆసుపత్రిలో అపెండిసైటిస్ ఆపరేషన్‌తో పాటూ కిడ్నీ కాజేశారని వినడంతో.. కొంపదీసి ఆ కాజేసి పెట్టింది తనకేనా అని అనుమానమొచ్చి... కూపీ లాగితే చివరాఖరికి తనకి అమర్చలేదని తెలుసుకుంటాడు. ఆ కూపీ లాగడంలో భాగంగా అతను మనుషుల గురించి తెలుసుకుంటాడు.

ఓ వ్యక్తికి సంబంధించిన ఎనిమిది శరీరభాగాలు.. ఎనిమిది మందికి అమర్చబడ్డాయి. షిప్ ఆఫ్ థిసియస్ ప్రకారం ఓ కొత్త భాగం అమర్చడం వల్ల మార్పు ఉంటుందో లేదో తెలియదు కానీ వ్యక్తి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడినపుడు 'జీవితపు విలువ' తెలుసుకోవటం ద్వారా వస్తుంది. శరీరభాగాలు దానం చేసిన వ్యక్తి తీసిన వీడియో పుటేజ్ చూస్తూంటారు గ్రహీతలంతా.. గనుల్లో ఆ వ్యక్తి తీసిన వీడియో పుటేజ్ అది. చీకటిగనుల లోతుల్లోకి వెళ్ళే కొద్దీ తళుక్కున మెరుస్తున్న తెల్లని రాళ్ళు దర్శనమిస్తుంటాయి. అవన్నీ అత్యంత విలువైన వజ్రపు రాళ్ళే !!

చక్రధర్‌రావు భైరంపల్లి, సెల్: 9848519435

సుడోకు

డైలీ సుడోకు 148 సమాధానం

8	1	2	3	5	7	6	4	9
9	3	5	6	4	8	1	7	2
7	4	6	9	2	1	3	8	5
1	2	3	7	8	6	5	9	4
5	7	9	2	3	4	8	1	6
6	8	4	1	9	5	7	2	3
4	6	1	5	7	9	2	3	8
2	9	7	8	6	3	4	5	1
3	5	8	4	1	2	9	6	7

డైలీ సుడోకు -149

			5	1				3
		3	2			7		4
							2	8
6				5		3		
1								2
		5		7				9
4	1							
5		7			3	8		
3				9	4			

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్

డరెన్ సమీ
@darensammy88



మలాంగ్ మంచి మసాజ్ థెరపిస్ట్. పార్క్‌లో నా [illegible]న్ని ఉత్తమంగా తీర్చిదిద్దాడు.



సమీని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
1,109,356

కామన్‌మ్యాన్ వాయిస్

నడక వచ్చిన వాడికి పరుగెత్తడం ఎలాగో నువ్వు నేర్పించాల్సిన పని లేదులే కానీ.. వీలైతే నిలబడడానికి ప్రయత్నించే వాడికి నీ చెయ్యి అందివ్వు చాలు.
-Lakshmi Priyanka

జబర్దస్త్ అనే కార్యక్రమంలో ఆది వేసే డబుల్ మీనింగ్ డైలాగ్‌ల కన్నా.. కిల కిల మని, హ హ అని నవ్వే రోజా, నాగబాబు అతిసూయల వల్లనే ఎక్కువ బూతు అనిపిస్తున్నది.
-Murali Puli

ఒకే ఒక్కసారి యూట్యూబ్ చానల్ వాడిని అరెస్ట్ చేసినా, చైనాలాగ బ్లాక్ చేసినా బూతు కంటెంట్ మొత్తం పోతుంది.
-Sai Yerramsetti

వైరల్ వీడియో



యువకులు పాడుకోవడానికి ఓ గీతం వచ్చింది. ఈ ఏడాదికి గాను యూత్ ఆంథెమ్ పేరుతో నీదీ నాదీ ఒకే కథ సినిమా ఓ పాటను విడుదల చేసింది. అది యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.

Endi Raa Ee Janala Gola Song Lyrical | Needi Naadi Oke Katha Songs | Sree Vishnu | Satna Titus

Total views : 114,741+

Published on Mar 8, 2018

నమస్తే తెలంగాణ
అల్లరి
[హైదరాబాద్]
ఆదివారం 11 మార్చి 2018



చిన్నపిల్లల పెద్ద మనసు..!

చోటా మాస్టార్జీ ఆనంద్‌కృష్ణ మిశ్ర

లక్నోకు చెందిన 14 యేండ్ల ఆనంద్‌కృష్ణ మిశ్ర చిన్న వయసులోనే పెద్ద బాధ్యతను భుజాన వేసుకున్నాడు. 'బాల్ చౌపాల్' అనే సంస్థను ఏర్పాటు చేసి.. వీధి బాలలు, పేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు. ఈ సంస్థ ద్వారా దాదాపు 125మ ంది పిల్లలకు మ్యాథమెటిక్స్, కంప్యూటర్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులు బోధిస్తున్నాడు. ఆనంద్‌కృష్ణ దగ్గర చదువు నేర్చుకునే పిల్లలంతా మురికివాడలు, అనాథలు, గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. పిల్లలకు చదువు చెప్పడంతో పాటు.. ప్రతి ఇంటికీ తిరిగి తల్లిదండ్రులను ఒప్పించి పిల్లలకు మంచి చదువు చెప్పించేలా చేస్తుంటాడు. ఆనంద్‌కృష్ణ ఇప్పటి వరకు బడి మధ్యలో ఆపేసిన దాదాపు 700 మంది విద్యార్థులను బడిలో చేర్పించాడు. వారందరికీ పాఠాలు అర్థమయ్యేలా రాత్రిళ్లు ట్యూషన్ చెబుతూ.. మంచి మార్కులు వచ్చేలా తీర్చిదిద్దుతున్నాడు. ఆనంద్‌కృష్ణ గురించి తెలిసినవారంతా 'చోటా మాస్టార్జీ' అని బిరుదు ఇచ్చేశారు.

పిల్లలూ! వీళ్లు కూడా మీలాగే రోజూ చదువుకుంటూనే సమాజానికి, పేద పిల్లలకు వారికి చేతనైన సాయం చేస్తున్నారు. చిన్నతనం నుంచే సమాజసేవ పట్ల అవగాహన పెంచుకొని సమసమాజ మార్పుకోసం ప్రయత్నం చేస్తున్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా వీళ్లే ముందడుగు వేసి.. చిన్న వయసులోనే తమ పెద్ద మనసును చాటుకుంటున్నారు. వీరంతా కష్టపడేది మీలాంటి వారి భావితరం కోసమే. మరి ఈ ఐదుగురు ఎలాంటి సేవ చేస్తున్నారో చదివి తెలుసుకోండి!

నిరుపేదలకు అండగా మేఘన!



మన హైదరాబాద్‌కు చెందిన 19 యేండ్ల మేఘన దబ్బారా నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నది. 15వ యేట నుంచే సమాజ సేవలో పాల్గొంటున్నది మేఘన. తన ముగ్గురు స్నేహితులు, కో-ఫౌండర్స్‌తో కలిసి 'మేక్ ది వండర్‌ఫుల్ వరల్డ్' అనే ఎన్జీఓను స్థాపించింది. అందులోనే పేద విద్యార్థులకు ఉచితంగా భోజనం పెట్టి చదువు చెప్పిస్తున్నది. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు లింగ సమానత్వం, లౌకికవాదం, మత సమానత్వం వంటి అంశాలను ప్రత్యేకంగా బోధిస్తున్నారు వీళ్లు. ఒకవైపు పేద పిల్లల కోసం ఎన్జీఓ నడిపిస్తూనే 17వ యేట తన స్నేహితులైన ఖ్యాతీ (హైదరాబాద్), సౌమ్య కటూరి (కాలిఫోర్నియా), ప్రణీతా గరిమెల్ల (న్యూయార్క్)తో కలిసి 'ఐబీగ్రూప్స్' అనే స్టార్టప్స్ హబ్‌ను ప్రారంభించింది. 2023వ సంవత్సరంలోపు 2,500 సీపీపీ (చైల్డ్ అడాప్షన్ ప్రోగ్రామ్) సెంటర్లను ఏర్పాటు చేసి.. నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకొని, పేదలు లేని సమాజాన్ని చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నది మేఘన.

రిధిమాకు పర్యావరణమంటే ప్రాణం..



ఉత్తరాఖండ్‌కు చెందిన పదేండ్ల రిధిమాకు పర్యావరణ పరిరక్షణ అంటే చాలా ఇష్టం. ఇందుకు ఎంతదూరమైనా వెళ్తుంది రిధిమా. వెళ్తుందేంటి.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ వరకూ వెళ్లింది కూడా. ఎందుకంటే కేంద్రప్రభుత్వం పర్యావరణంలో జరిగే మార్పులను అంచనా వేయకపోవడంతో కాలుష్యం బాగా పెరిగిపోతున్నదని, వెంటనే ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో పిటీషన్ వేసింది. దీంతో పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నదో వివరించాలని పర్యావరణ మంత్రిత్వ శాఖను గ్రీన్ ట్రిబ్యూనల్ వివరణ కోరింది. గాలిలో కార్బన్ డై ఆక్సైడ్ శాతం పెరిగిపోతున్నదని రిధిమా పాండే పిటిషన్ వేయడంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు ప్రణాళికలు వేసుకుంటూ సాగుతున్నది.

ఐదేండ్ల ముష్కాన్.. లైబ్రేరియన్!



భూపాల్‌కు చెందిన ఏడేండ్ల ముస్కాన్ అహిర్వార్ రెండేళ్ల నుంచి లైబ్రెరీ నడిపిస్తున్నది. మురికివాడలకు చెందిన చిన్నారులకు ఇందులో ప్రవేశం ఉచితం. ముస్కాన్ తండ్రి ఓ కార్పెంటర్. తన కూతురి కోరికమేరకు 'బాల పుస్తకాలయ్' అనే పేరుతో లైబ్రెరీని ప్రారంభించాడు. ఇందులో చిన్న పిల్లలకు అర్థమయ్యే రీతిలో బొమ్మల రూపంలో పుస్తక పఠనం ఉంటుంది. అంతేకాకుండా ఇందులో వందలకొద్దీ పుస్తకాలు చిన్నారులకు అందుబాటులో ఉన్నాయి. తానే లైబ్రేరియన్‌గా ఉంటూ పిల్లలకు కావాల్సినవి, అవసరమైన బుక్స్, బొమ్మలు ఇస్తుంటుంది. తన బాల పుస్తకాలయ్ ముస్కాన్ ఇంటికి కొద్ది దూరంలో ఉంటుంది. ఇది సాయంత్రం మాత్రమే తెరుచుకుంటుంది. సాయంత్రమైతే చాలు.. పిల్లలతో పుస్తకాలయ్ సందడిగా మారుతుంది. పిల్లలంతా ముస్కాన్ చెప్పే కథలు వింటూ ఉంటారు.

లైబ్రరీల నిర్మాణమే.. 'అనన్య' లక్ష్యం!

నోయిడాకు చెందిన 17 యేండ్ల అనన్య సలుజ లడఖ్‌లోని మారుమూల ప్రాంతాల్లో లైబ్రెరీలు నిర్మించాలని కంకణం కట్టుకున్నది. తన ఆశయం నెరవేర్చుకునేందుకు లడఖ్‌లోని '17,000 ఫీట్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఫండ్ రైజింగ్ చేస్తున్నది. 2015 నుంచి ప్రతి యేటా వేసవి సెలవుల్లో మారుమూల గ్రామాలు తిరుగుతూ పేదలను కలుస్తున్నది. ఆయా గ్రామాల్లో విద్యార్థులకు చదువు కూడా చెబుతున్నది. గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలాలు కావాలని కోరుతున్నది. ఎన్జీఓలు, తెలిసినవారి సాయంతో ఫండ్ రైజింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. లడఖ్ పరిసర ప్రాంతాల్లో 19 లైబ్రరీలను నిర్మించేందుకు దాదాపు 10 లక్షల రూపాయలను సమకూర్చింది అనన్య.



తెలుసుకుందాం..!

కుతుబ్ మినార్ నీడ మాయం!!

పిల్లలూ!కు తుబ్‌మి నార్ గురించి మీకు తెలుసా? ప్రతి యేటాఒ కరోజు కుతుబ్ మీనార్ నీడ మాయం అవుతుంటుంది.ఆ ఒ క్కరోజు దాని నీడ భూమి మీద పడదని మీకు తెలుసా?

కుతుబ్ మినార్ ఇటుకలతో చేసిన ప్రపంచంలో ఎత్తయిన మినార్. ఇండో-ఇస్లామియా నిర్మాణాలకు ఇది ఒక అపురూపమైన ఉదాహరణ. ఇది ఢిల్లీలోని మెహ్రౌలీ వద్దగల కుతుబ్ కాంప్లెక్స్‌లో ఉన్నది. దీని ఎత్తు 237.8 అడుగులు. పునాది వద్ద దీని వ్యాసం 14.3 మీటర్లు. పైన దీని వ్యాసం 2.75 మీటర్లు. దీనిని ఐదు అంతస్తుల్లో నిర్మించారు. దీనిని 1193లో నిర్మించారని చరిత్ర చెబుతున్నది. కుతుబుద్దీన్ ఐబక్ దీని నిర్మాణాన్ని ప్రారంభించగా.. అల్తమష్ పూర్తి చేశాడు. అయితే ప్రతి యేటా జూన్ 22న ఇంత ఎత్తున్న ఈ మినార్ నీడ భూమి మీద పడదు. అత్యద్భుతమైన భౌగోళిక శాస్త్ర నిగూఢతను తెలిసిన నాటి శిల్పులు, కళాకారులు ఎంతో పకడ్బందీగా దీనిని నిర్మించారు. 1193 నుంచి కూడా ఇలానే ప్రతియేటా జరుగుతున్నది. దీనికి కారణం.. ఈ కట్టడం 28.5 డిగ్రీల ఉత్తర అక్షాంశం మీద ఉన్నది. పైగా 5 డిగ్రీలు వంపు కూడా కలిగి ఉన్నది. ఇలా భూమధ్య రేఖకు అటు ఇటుగా సూర్యుడి చలనం వల్ల ఈ కట్టడం నీడ ఆ ప్రత్యేక రోజున భూమి మీద పడదట. కుతుబ్ మినార్ మన దేశ ప్రాచీన నిర్మాణ శాస్త్రానికి మచ్చుతునక అని చెబుతుంటారు చరిత్రకారులు. ఇంజినీరింగ్ ప్రతిభకు కూడా ఇది గీటురాయి. ఆనాడే అంత టెక్నాలజీని ఉపయోగించారు మనవాళ్లు. యునెస్కో వారు ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో కుతుబ్ మినార్‌ను నమోదు చేశారు. కుతుబ్ అనగా ధ్రువం, మినార్ అనగా స్తంభం. కుతుబ్ మీనార్ అంటే 'ధ్రువపు స్తంభం' అని అర్థం. దీనిలో 399 మెట్లు పైవరకూ ఉన్నాయి. దీని ప్రాంగణంలో ఉన్న ఇనుప స్తంభం ఇప్పటికీతు ప్పు పట్టకుండా అలాగే ఉండడం మరో విశేషం.




మన యాస



లొల్లి	-	గొడవ
తెర్లు	-	వినాశనం
లాశిగ	-	పెద్దగా
సాన్పి	-	పేడనీళ్లు
ఎగేసింది	-	పురికొల్పింది
ఎడ్డోడు	-	అమాయకుడు
బాసిండ్లు	-	గిన్నెలు
ముంగల	-	ముందర
మొత్తుకోవడం	-	గట్టిగాఅ రువడం
అండ	-	సహాయం

నీతి కథ

పిసినారి నక్క



ఒక ఊరిలో నక్క నివసిస్తుండేది. అది పరమ పిసినారి. బద్ధకం కూడా ఎక్కువ. మిగతా నక్కలు ఏవైనా ఆహారం తీసుకొచ్చి పెడితే మాత్రం ఆబగా తింటుంది. కానీ అది మాత్రం ఒక్క మెతుకు ఎవరికీ విదిల్చేది కాదు. ఒకసారి దానికి ఒక మాంసం ముక్క దొరికింది. దానిని ఏ వీధి అరుగు మీదో, ఏ చెత్త కుండీ చాటునో కూర్చొని తినవచ్చు కదా! ఊహూ.. తోటి నక్కలు చూస్తే తమకూ కాస్త పెట్టమంటాయని దాని భయం. దానికి ఎప్పుడూ మిగతా నక్కల దగ్గర ఆహారం అడిగి తినే అలవాటు ఉంది. అందుకే మాంసం ముక్కను తీసుకొని చాటుగా ఊరవతలికి బయలుదేరింది. అది ఊరవతల మంచి ప్రదేశం కోసం వెతుకుతున్నది. ఇంతలో చెట్టు మీద ఉన్న రెండు కాకులు ఇదంతా గమనించాయి. అవి దొరికిన ఆహారాన్ని కలిసి పంచుకొని తినే అలవాటు ఉన్నవి. నక్క దగ్గర్నుంచి ఎలాగైనా సరే మాంసం ముక్కను కొట్టేయాలి అనుకున్నాయి. అందుకని నక్క ముందు వాలి స్నేహంగా కబుర్లు చెప్పడం మొదలు పెట్టాయి.

'నక్క మామా! నక్క మామా! బాగున్నావా? ఊరిలో నుంచి వస్తున్నావు, ఏమిటి సంగతులు?' అని ఒక కాకి అడిగింది. నక్క ఏమీ లేవనట్టు తల అడ్డంగా ఊపింది నోరూ తెరిస్తే ముక్క ఎక్కడ జారిపోతుందోనని. 'నువ్వు మేలు జాతి నక్కలా ఉన్నావు. నీలాంటి నక్కను ఇంతకముందు మేమెన్నడూ చూడలేదు. నీతో స్నేహం చేయాలని ఉంది. చేస్తావా?' అంటూ పొగిడాయి. కాకుల పొగడ్తలకు పొంగిపోయిన నక్క 'సరే' అని తలూపింది. వెంటనే రెండు కాకులు సంతోషంగా అరుస్తూ నక్క చుట్టూ తిరుగుతూ ఆడుకోసాగాయి. నక్క కూడా అక్కడి నుంచి కదల్లేక అలా నిల్చుంది. ఆ సమయంలో ఒక కాకి నక్క వెనకకు, మరొక కాకి నక్క ముందుకు చేరాయి. వెనకనున్న కాకి హఠాత్తుగా నక్క తోక పట్టి లాగింది. ఉలిక్కిపడిన నక్క మాంసపు పడేసింది. దీంతో కాకి మాంసపు ముక్కను నోటితో కరుచుకొని మరో కాకితో కలిసి వెళ్లిపోయింది. రెండూ చెట్టు మీద కూర్చొని మాంసం ముక్కను పంచుకొని తిన్నాయి. నక్క నోట మాటరాక అలా చూస్తూ ఉండిపోయింది.

నీతి: పొగడ్తలకు లొంగిపోయిన వారు ఎప్పటికైనా ఇబ్బందులపాలు కాక తప్పదు.

సైన్స్ బిట్స్


- **ఇస్రో అతి త్వరలోనే చంద్రయాన్-2 ప్రయోగం చేపట్టనున్నది.**
- **వాతావరణం అనుకూలిస్తే ఈ ఏప్రిల్‌లో లేదా నవంబర్‌లో ప్రయోగం చేపడుతారు.**
- **చంద్రుడి దక్షిణ ధ్రువంపై 100 కిలోమీటర్ల ఎత్తులో ఆర్బిటార్‌ను ఉంచుతారు.**
- **ముందుగా గుర్తించిన స్థలంలోనే ల్యాండర్‌ను దించుతారు.**
- **చంద్రుడిపై పెద్దపెద్ద శిలలు ఎన్నో బిలియన్ యేండ్ల నుంచి ఉన్నాయని, వాటిని విశ్లేషించి, అవగాహన చేసుకోవడానికి ఈ ప్రయోగం సహకరిస్తుందట.**
- **చంద్రయాన్-2 ప్రయోగం ఖర్చు రూ.800 కోట్లు.**
- **2013లో చేపట్టిన చంద్రయాన్-1 ప్రయోగం ఖర్చు రూ. 470 కోట్లు.**

మంచి మాటలు..



- చదువు పాఠం నేర్పి పరీక్ష పెడుతుంది. కానీ జీవితం పరీక్ష పెట్టి పాఠం నేర్పుతుంది.
- పది మందికి మేలు చేసేవాడివైతే.. నీవెనుక ఎప్పుడూ వందమంది ఉంటారు.
- ఒక్కోసారి నీ నిజాయితీ, ధైర్యం, తెలివితేటలు నిన్ను గెలిపించలేనప్పుడు.. ఓర్పు, సహనం మాత్రమే నిన్ను గెలిపించగలవు.
- చెడు మార్గంలో కాకుండా.. సరైన మార్గంలో పయనించాలంటే మంచి గురువు అవసరం.

దారి కనుక్కోండి!



డాక్టర్ అవ్వాలనుకొని.. షూటర్ అయింది!!



మను భకర్.. ఇప్పుడు మనకుప రిచయం అక్కర్లేని పేరు. మెక్సికోలోని ర్వహించిన ప్రపంచ షూటింగ్‌లో రెండు స్వర్ణాలుగెలు చుకున్నదీయువతి . కేవలం 16 యేండ్ల వయసులోనే ప్రపంచ రికార్డులుతుడి పేసింది షూటర్ మను భకర్.

మను భకర్.. హర్యానాకు చెందిన ఈ 16యేండ్ల యువతి గురిపెడితే బంగారం కొల్లగొట్టాల్సిందే. మను చిన్నప్పటి నుంచి అన్ని ఆటల్లోనూ మెరుగైన ప్రదర్శన చూపించింది. మను తండ్రి రామ్ కిషన్ భకర్.. మర్చంట్ నేవీ హైలింగ్‌లో ఇంజినీర్. ఆయన నేవీ అధికారి కావడం, దగ్గర ఎప్పుడూ రివాల్వర్ ఉండడంతో తన కూతురికి షూటింగ్‌లో ఓనమాలు నేర్పించాడు. తండ్రి రివాల్వర్‌తో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న మను చిన్నప్పటి నుంచి ఎన్నో రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. ఒక్క షూటింగే కాదు.. బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్, స్కేటింగ్ వంటి ఆటల్లో నైపుణ్యం సాధించింది. ఆరేండ్ల వయసు నుంచే బాక్సింగ్‌లో శిక్షణ తీసుకొని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నది. మణిపూర్‌కి చెందిన టాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో తన ప్రతిభ చూపింది. స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచింది. బోర్డు పరీక్షల్లో వందశాతం మార్కులతో పాసై.. డాక్టర్ అవ్వాలని కలలుకనేది మను. షూటింగ్‌లో ఆమె ప్రతిభను గుర్తించిన కోచ్ నరేశ్ ప్రాథమిక శిక్షణ ఇచ్చాడు. ఆ తర్వాత మెరుగైన నైపుణ్యం కోసం జాస్పల్ రానా వద్ద శిక్షణ తీసుకుంటున్నది. పోటీ ఏదైనా పతకాల గురించి ఎప్పుడూ ఆలోచించనని అంటున్నది మను. తన టెక్నిక్ మీద గంటల తరబడి శిక్షణ ఇచ్చి.. ఎన్నో విలువైన సలహాలు ఇచ్చిన కోచ్‌లకు కృతజ్ఞులు చెబుతున్నది. ఇంత చిన్న వయసులోనే మను అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదిస్తుందని ఊహించలేకపోయామని తండ్రి రామ్‌కిషన్ అంటున్నాడు.

పదాలు గుర్తించండి

T	H	I	S	C	L	D	O	S	E
P	B	A	N	D	A	I	D	S	H
A	C	L	E	A	N	S	E	R	S
P	T	U	X	I	S	I	T	O	I
E	T	N	T	A	L	N	L	Y	L
R	E	C	E	U	T	F	P	L	O
T	S	H	N	L	R	E	O	O	P
O	E	B	S	V	A	C	U	U	M
W	V	O	I	F	S	T	A	L	F
E	O	X	O	L	H	A	K	S	L
L	L	I	N	T	B	N	N	T	A
S	G	L	C	O	A	T	D	O	S
T	S	I	O	I	G	O	F	O	H
R	U	G	R	L	S	S	B	B	L
E	E	H	D	E	F	U	A	L	I
V	T	T	H	T	I	N	T	G	G
I	S	B	P	P	I	W	T	I	H
R	S	U	H	A	M	M	E	R	T
D	H	L	O	P	T	I	R	H	S
W	A	B	T	E	E	D	I	Y	T
E	H	S	O	R	K	I	E	S	C
R	A	G	S	L	C	K	S	O	S
C	E	T	A	T	U	M	Y	H	O
S	H	A	T	U	B	R	O	O	M

BANDAIDS
BATTERIES
BOOTS
BROOM
BUCKET
CLEANSERS
COAT
DISINFECTANT
EXTENSION CORD
FLASHLIGHT
GLOVES
HAMMER
HAT
KEYS
LIGHTBULBS
LUNCHBOX
MOP
PAPER TOWELS
PHOTOS
POLISH
RAGS
SCREWDRIVER
TOILET PAPER
TRASHBAGS
VACUUM

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
ఆదివారం 11 మార్చి 2018

చిందెయ్ సామిరంగా..


'ఛల్ మోహన్‌రంగ' చిత్రంలో నితిన్

'కత్తులు బల్లెం చేతపట్టి...దుష్టుల తలలు మాలకట్టి నువ్వు పెద్దపులినెక్కి రావమ్మో గండిపేట గండి మైసమ్మ'..ఈ జానపదగీతం తెలంగాణ ప్రాంతీయులకు సుపరిచితమే. బోనాల సందర్భంగా అమ్మ వారి ఔన్నత్యాన్ని చాటుతూ ఈ జానపద గీతాన్ని వింటుంటారు. ఈ పాటను నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'లో పునఃసృష్టిస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ పతాకాలపై ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ కథ అందిస్తున్నారు. మేఘా ఆకాష్ కథానాయిక. 'పెద్దపులి' పాటను కథానాయకుడి ఉపోద్ఘాత (ఇంట్రడక్షన్) గీతంగా తెరకెక్కించారు. 'రంగా రంగా రంగా చిందేయ్ సామి రంగా..శివమెత్తు శుబ్బరంగా.. పొద్దుగాల్లే బైలెళ్లు..బోనం ఎత్తి బైలెళ్లు' అనే పల్లవితో సాగే గీతాన్ని శుక్రవారం రాత్రి వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో విడుదల చేశారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. 'సంగీత దర్శకుడు తమన్ జానపద వాద్యపరికరాలతో ఈ పాటకు రూపకల్పన చేశాడు. శేఖర్ మాస్టర్ నృత్యదర్శకత్వం వహించారు. సాహితి అచ్చ తెలంగాణ మాండలికంలో చక్కటి ప్రాస, యాసల మేళవింపుతో ఈ పాటను రాశారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. హుషారైన స్టెప్స్‌తో ఈ గీతం అభిమానుల్ని ఉర్రూతలూగిస్తుంది' అని చిత్ర బృందం తెలిపింది. డా౹ ౹కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్‌స్వరూప్, ప్రభాస్‌శ్రీను, ప్రగతి, సత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎన్. నటరాజన్ సుబ్రహ్మణ్యన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, సమర్పణ: నిఖితరెడ్డి, నిర్మాత: ఎన్.సుధాకర్‌రెడ్డి, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కృష్ణచైతన్య.


ఆడోళ్లు భలే కఠినాత్ములు..!

నాని ద్విపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'కృష్ణార్జున యుద్ధం'. మేర్లపాక గాంధీ దర్శకుడు. అనుపమ పమేశ్వరన్, రుక్సార్ మీర్ కథానాయికలుగా నటిస్తున్నారు. సాహు గరికపాటి, హరీష్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం చిత్ర బృందం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది. 'యాడుండార్రా గోపీకలూ... నూడుల్స్ చేయడానికి నువ్వు అమ్మాయిల్ని పడేయడానికి ఒకే టైమ్ పడుతోంది ఎలా రా.. అవతలి వాళ్లను మనం ఎంత కోరుకుంటున్నామో అది మన కళ్లల్లో వాళ్లకు కనపడాలి 'ఇట్ షుడ్ హిట్ దెమ్ హార్డ్ లైక్ సైక్లోన్... ఆడోళ్లు భలే కఠినాత్ములురా' అంటూ హీరో నాని మాస్ అండ్ మోడ్రన్ పాత్రల్లో చెబుతున్న డైలాగ్‌లతో విడుదల చేసిన టీజర్ ఆకట్టుకుంటున్నది. 'రామాయణంలో ధర్మరాజు ఏం కర్మ...రెబల్‌స్టార్ కృష్ణంరాజు, ఎడిటర్ గౌతంరాజు కూడా వుంటారు'అని టీజర్‌లో వినిపిస్తున్న డైలాగ్‌లు సినిమాలో ఏ స్థాయి వినోదాన్ని రంగరించారో తెలియజేస్తున్నాయి. 'జెంటిల్‌మన్' చిత్రం తరువాత నాని ద్విపాత్రాభినయం చేస్తున్న రెండవ చిత్రమిది కావడం, ఇటీవల నాని నటించిన చిత్రాలన్నీ వరుస విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి. వాటికి ఏ మాత్రం తీసిపోని విధంగా సినిమా వుంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ చిత్రాన్ని ఏప్రిల్ 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నది.


నాని


'గులేబకావళి' చిత్రంలో హన్సిక

'కాలా'శున కానికి2 కోట్లు!


రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ క్రేజ్ ఏ స్థాయిలో వుంటుందో అందరికి తెలిసిందే. ఆయనకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కాలా'లోని ఓ శునకం కూడా వార్తల్లో నిలుస్తున్నది. ఇటీవల విడుదలైన చిత్ర పోస్టర్స్‌లో రజనీకాంత్ కుక్కపై చేయివేసి కుర్చీలో కూర్చున్న స్టిల్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఫొటోలో రజనీకాంత్ పక్కనున్న శునకం పేరు మణి. ప్రస్తుతం ఈ కుక్కను సొంతం చేసుకోవడానికి వివిధ దేశాల రజనీ అభిమానులు పోటీపడుతున్నారట. దాని యజమాని అయిన సిమన్‌తో సంప్రదింపులు జరుపుతున్నారట. ఓ విదేశీ అభిమాని ఏకంగా రెండు కోట్లు ఇస్తానని ఆఫర్ చేశాడట. ప్రస్తుతం ఈ వార్త చెన్నై సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. రజనీకాంత్ పక్కన కనిపించేసరికి మణికి అనేక చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయట. అయితే తాను ఎంతో ప్రేమగా పెంచుకున్న మణిని ఎవరికి అమ్మేది లేదని యజమాని సిమన్ తేల్చిచెప్పాడు. పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ధనుష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 27న విడుదల కానుంది.

గ్యాంగ్‌వార్ నేపథ్యంలో..


అవినాష్

అవినాష్, ప్రదీప్ రావత్, రాజారాయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వెపన్'. ఆర్.ఎస్.సురేష్ దర్శకత్వం వహిస్తున్నారు. మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చుక్కా శర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశతో వుంది. నిర్మాత మాట్లాడుతూ 'రెండు గ్యాంగ్ ల మధ్య సాగే గ్యాంగ్ వార్ నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. ఓ ఆయుధం కొంత మంది జీవితాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టించింది?. ఆ తరువాత వారి జీవితాలు ఏ తీరం చేరాయి? అనే వినూత్న కథాంశంతో ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందిస్తున్నాం. మంగళ, క్రిమినల్స్ చిత్రాలు మా సంస్థకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఆ చిత్రాల్ని మించి మరింత గుర్తింపును తెచ్చిపెట్టే విధంగా దర్శకుడు సురేష్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 20 నుంచి చివరి షెడ్యూల్ మొదలవుతుంది. ఇప్పటి వరకు 90 శాతం చిత్రీకరణ పూర్తి చేశాం. రామచంద్రాపురం, పసలపూడి తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. రాజు,మ ధుబాబుతది తరులు నటిస్తున్నారు.

ప్రణయ భావాల 'సమ్మోహనం'


అదితీరావు హైదరీ, సుధీర్‌బాబు

'ప్రేమ హృదయాల్ని సమ్మోహనపరిచే ఓ మధురభావన. ఆ అనుభూతిని ఆస్వాదించాల్సిందే కానీ మాటల్లో వర్ణించలేము. పడుచు జంట ప్రణయానుభూతులకు అందమైన దృశ్యరూపమే మా 'సమ్మోహనం' చిత్రం' అన్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన దర్శకత్వంలో సుధీర్‌బాబు, అదితీరావు హైదరీ జంటగా నటిస్తున్న చిత్రం 'సమ్మోహనం'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. జూన్ 15న ప్రేక్షకులముందుకురానుంది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'చివరి షెడ్యూల్‌ను ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 3వరకు హిమాచల్‌ప్రదేశ్, ముంబయిలలో తెరకెక్కిస్తాం. దాంతో చిత్రీకరణ పూర్తవుతుంది. అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నాం' అన్నారు. 'నవతరం ప్రేమకథ ఇది. చక్కటి హాస్యం, రొమాన్స్ అంశాల మేళవింపుతో ఆహ్లాదభరితంగా సాగుతుంది. ప్రేమభావనల్ని హృద్యంగా ఆవిష్కరిస్తుంది. కథానుగుణంగా సంగీతానికి ప్రాధాన్యత ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. నరేష్, తనికెళ్ల భరణి, పవిత్రాలోకేష్, హర్షిణి, నందు, కాదంబరి కిరణ్, హరితేజ, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పి.జి.విందా, ప్రొడక్షన్ డిజైనర్: యస్.రవీందర్, సంగీతం: వివేక్‌సాగర్, రచన-దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

16నుంచి తమిళపరిశ్రమ బంద్?

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో చర్చలు సఫలం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సినిమాల్ని ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ బంద్ విరమణ జరిగినప్పటికీ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో బంద్ యథావిధిగా కొనసాగుతున్నది. ఇదిలావుండగా తమ ఆందోళనను మరింత ఉధృతం చేసేందుకు తమిళ నిర్మాతల మండలి ఈ నెల 16నుంచి చిత్ర పరిశ్రమ సంపూర్ణ బంద్‌కు పిలుపునిచ్చిందని తెలిసింది. ఇందులో భాగంగా సినిమా విడుదలతో పాటు, షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని కూడా నిలిపివేయాలని నిర్ణయించారని సమాచారం. ..వీపీఎఫ్ ఫీజులు వసూలు చేయకూడదని, టికెట్ ధరలను, ఆన్‌లైన్ బుకింగ్ ఛార్జీలను తగ్గించాలని, థియేటర్లలో టికెట్లను కంప్యూటరీకరించాలనే డిమాండ్‌తో పాటు చిన్న సినిమాలకు తగినన్ని థియేటర్లు ఇవ్వాలని, నిర్మాణ వ్యయాన్నికూడా తగ్గించాలనే డిమాండ్స్‌తో తమిళ నిర్మాతలు బంద్‌కు పిలుపునిచ్చారు. ఒక సినిమాకు టికెట్ ధరను నిర్ణయించే అధికారం ఈ చిత్ర నిర్మాతకు మాత్రమే ఉంటుందని, థియేటర్లు కేవలం పర్సంటేజీలు, కమిషన్ పద్ధతిలో మాత్రమే సినిమాల్ని విడుదల చేసుకోవాలన తమిళ నిర్మాతల మండలి కోరిందట.

కాటుకెట్టుకొచ్చింది..!


సత్య మహావీర్, కొవెర, దేవిశ్రీప్రసాద్


కొవెర, హిమాన్షి కాట్రగడ్డ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'యు'. 'కథే హీరో' అని ఉపశీర్షిక. కొవెర క్రియేషన్స్ పతాకంపై విజయలక్ష్మి కొండా నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా కొవెర దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సత్య మహావీర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'కాటుకెట్టుకొచ్చింది చందమామ' అంటూ సాగే తొలి పాటను ఇటీవల యువ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పాట వినగానే నచ్చేసింది. ఈ పాటతో పాటు సినిమాలోని అన్ని పాటలు హిట్ కావాలి. సత్య మహావీర్ అద్భుతమైన ట్యూన్‌లిచ్చారు. సినిమా మంచి విజయాన్ని సాధించాలి' అన్నారు.

రాశీఖన్నా జోరు!



స్టార్స్‌గా వెలిగిపోతున్న తారలు ఆ స్టార్‌డమ్‌ను నిలబెట్టుకోవడం కోసం ప్రత్యేక ఫొటోషూట్‌లు చేయించుకుంటూ ఆ ఫొటోల్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటుంటారు. ఇప్పుడు ఈ జాబితాలో రాశీఖన్నా కూడా చేరిపోయింది. 'సుప్రీమ్' సినిమా విజయం తరువాత వరుస పరాజయాల్ని సొంతం చేసుకున్న ఈ ఢిల్లీ సోయగం వరుణ్‌తేజ్ నటించిన ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ 'తొలిప్రేమ'తో మళ్లీ విజయాల బాటపట్టింది. ఈ సినిమా అందించిన సక్సెస్‌తో మంచి జోరుమీదున్న రాశీఖన్నా తన క్రేజ్‌ను మరింత పెంచుకోవడం కోసం ప్రత్యేకంగా ఓ ఫొటోషూట్‌లో పాల్గొంది. కురచ దుస్తులు, బ్లూకలర్ డెనిమ్ జాకెట్ ధరించి ఆమె పోజిచ్చిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో వరుస చిత్రాల్లో నటిస్తున్న రాశీఖన్నా తాజాగా నితిన్ హీరోగా నటిస్తున్న 'శ్రీనివాస కల్యాణం'లో నటిస్తున్న విషయం తెలిసిందే. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే మొదలైంది.

దయ్యం చెప్పిన కథ!


సుప్రియ

శివ, సుప్రియ జంటగా నటిస్తున్న చిత్రం 'దయ్యం చెప్పిన కథ'. ప్రదీప్‌రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పెనాక దయాకర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. నవన్.జె సంగీతం అందించిన చిత్ర ఆడియోను దర్శకుడు వి.సాగర్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని సాయి వెంకట్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ స్వీకరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఊరి బయటికి వచ్చిన వాళ్లకు కథ చెబుతూ ఓ దయ్యం అంతం చేసూవుంటుంది. ఇంతకీ ఆ దయ్యం చెప్పే కథేంటి? అనేది ఇందులో ఆసక్తికరం' అన్నారు. 'అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

దేశ సేవకు అంకితం కావాలి

- గన్నర్స్ పరేడ్‌లో మేజర్ జనరల్ ఎన్ శ్రీనివాసరావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ సేవకు అంకితం కావాలని యువ సైనికులకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ ఎన్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. శనివారం ఉదయం గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లో 400 మంది గన్నర్స్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని పాసింగ్‌ఔట్ పరేడ్‌లో పాల్గొన్నారు. పరేడ్‌కు మేజర్ జనరల్ ఎన్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సైనికుల కవాతు, వారి యుద్ధ విన్యాస ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మేజర్ జనరల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఏ యుద్ధమైనా కేవలం అత్యాధునిక ఆయుధాలు ఉన్నంత మాత్రాన గెలవలేరని, వాటిని ఉపయోగించే నైపుణ్యం కల్గిన సైనికులు ఉంటేనే విజయం సొంతమవుతుందన్నారు. యుద్ధంలో అత్యంత కీలకమైన ఆర్టిలరీ (గన్స్ విభాగం)లో సైనికులుగా పనిచేయబోతున్నందుకు యువ సైనికులంతా గర్వపడాలన్నారు. మన పూర్వ సైనికుల గౌరవం మరింత పెంచేలా యువ సైనికులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సైనికుడు తన యూనిట్‌ను కుటుంబంగా భావించి అంతా సన్నిహిత సంబంధాలతో మెలగాలన్నారు. దేశ సేవకోసం తమ పిల్లలను సైన్యంలో చేర్చిన తల్లిదండ్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. శిక్షణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఆయన మెడల్స్ అందజేశారు. ఆర్టిలరీ సెంటర్ కమాండెంట్, బ్రిగేడియర్ ఆర్‌ఆర్ కుమార్, ఆర్టిలరీ సెంటర్‌లో శిక్షణ వివరాలు తెలిపారు. దేశంలోనే రెండో అతి పెద్దదైన హైదరాబాద్ ఆర్టిలరీ సెంటర్‌లో ప్రతి ఏటా మూడు వేల మంది ఆర్టిలరీ (గన్స్ పేల్చడంలో శిక్షితులైన సైనికులు)సైనికులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పాసింగ్‌ఔట్ పరేడ్‌కు హాజరైన సైనికుల తల్లిదండ్రులు, స్నేహితులతో ఆర్టిలరీ సెంటర్‌లో సందడి నెలకొంది. పరేడ్‌కు సీనియర్ మిలిటరీ అధికారులు హాజరయ్యారు.


శనివారం గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో సైనికుడికి మెడల్ అందజేస్తున్న మేజర్ జనరల్ ఎన్ శ్రీనివాసరావు

అప్పుడే భగభగలు!

- రాష్ట్రంలో 39.3 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- హైదరాబాద్‌లో హఠాత్తుగా చల్లబడిన వాతావరణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. శనివారం రాష్ట్రంలో అత్యధికంగా 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీఎస్‌డీపీఎస్) అధికారులు తెలిపారు. ఎండలు పెరిగిపోవడంతో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 39.3 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 39, మహబూబాబాద్ 38.9, నల్లగొండ, మహబూబ్‌నగర్ 38.8, ఆదిలాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో 38.3 జగిత్యాల జిల్లాలో 38.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14.8 నుంచి 20.4 డిగ్రీల వరకు నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఇదిలాఉంటే హైదరాబాద్ నగరంలో వాతావరణం కాస్త చల్లబడింది. ద్రోణి ప్రభావం కారణంగా ఈ పరిస్థితి నెలకొన్నది. మొన్నటివరకు అధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కిన నగరం శనివారం ఎండ తీవ్రత కాస్త తగ్గింది. గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు నమోదైనా ఎండ తీవ్రత పెద్దగా కనిపించలేదు.

ఎండాకాలం

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం	జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
			మెదక్	38.0	17.2
			నాగర్‌కర్నూల్	38.0	16.7
			మేడ్చల్	38.0	15.6
జయశంకర్ భూపాలపల్లి	39.3	19.2	రంగారెడ్డి	38.0	14.9
భద్రాద్రి కొత్తగూడెం	39.0	18.0	వికారాబాద్	38.0	14.8
మహబూబాబాద్	38.9	19.4	సూర్యాపేట	37.9	20.4
నల్లగొండ	38.8	17.3	వనపర్తి	37.9	18.7
మహబూబ్‌నగర్	38.8	14.8	ఖమ్మం	37.9	19.7
ఆదిలాబాద్	38.3	19.8	నిజామాబాద్	37.9	18.8
పెద్దపల్లి	38.3	18.7	జోగుళాంబ గద్వాల	37.9	17.2
కరీంనగర్	38.3	17.8	రాజన్న సిరిసిల్ల	37.9	17.9
జగిత్యాల	38.1	18.5	సిద్దిపేట	37.9	17.7
హైదరాబాద్	38.0	19.7	సంగారెడ్డి	37.9	16.8
మంచిర్యాల	38.0	19.2	కామారెడ్డి	37.9	16.7
వరంగల్ అర్బన్	38.0	18.5	నిర్మల్	37.8	19.1
కుమ్రంభీం ఆసిఫాబాద్	38.0	17.8	జనగామ	37.8	16.7
వరంగల్ రూరల్	38.0	19.0	యాదాద్రి భువనగిరి	37.8	16.4

సింగరేణిలో కారుణ్య నియామకాలు

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించలేని (మెడికల్ ఇన్వ్యాలిడేషన్) పరిస్థితుల్లో కుటుంబసభ్యులకు అవకాశం కల్పించే విధానం (కారుణ్య)లో నియామకాలు జరుగుతాయని సింగరేణి సంస్థ తన సర్క్యులర్‌లో స్పష్టంచేసింది. 16.03.2017న హైకోర్టు సూచించిన విధానాలకు అనుగుణంగా పలు మార్పులు చేసి, అనుబంధ సర్క్యులర్‌ను విడుదలచేసింది. కారుణ్య నియామకానికి భార్య లేదా భర్త, అవివాహిత కుమార్తె, కుమారుడు, చట్టబద్ధంగా దత్తత తీసుకున్న కుమారుడిని అర్హులను చేసింది. ఒకవేళ వారసులు లేనిపక్షంలో కారుణ్య నియామకం పొందేందుకు సదరు కార్మికుడి సోదరుడు, వితంతు కుమార్తె, వితంతు కోడలు లేదా కార్మికుడి సంపాదనపై ఆధారపడిన అల్లుడు ఉద్యోగం పొందేందుకు అవకాశం ఉంటుందని స్పష్టంచేసింది. పురుషులకు భూగర్భ గనిలో బదిలీ వర్కర్‌గా, మహిళలకు గని ఉపరితలం (సర్ఫేస్)లో పనిచేసే అవకాశం కల్పిస్తారు. కారుణ్య నియామకాల విషయంలో ఇదివరకే ఇచ్చిన సర్క్యులర్‌లో ఈ మార్పులు చేస్తూ సింగరేణి సంస్థ అనుబంధ సర్క్యులర్ జారీచేసింది. తాజా సర్క్యులర్ విడుదల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎంతో కసరత్తు చేశారు. గతంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై ప్రకటన చేసినా, కొందరు యూనియన్ నాయకులు అడ్డుకోవడంతో అది పూర్తిస్థాయిలో ఆగిపోయింది. దీంతో తాను కార్మికులకు ఇచ్చిన హామీని ఎట్టి పరిస్థితుల్లో అమలుచేయాలని భావించిన ముఖ్యమంత్రి ఆ దిశగా అడుగులువేశారు. న్యాయనిపుణులతో సుదీర్ఘంగా చర్చించి, కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా యాజమాన్యానికి మార్గదర్శకాలు జారీచేశారు. మరోవైపు ముఖ్యమంత్రి చెప్పిన విధంగా సింగరేణి వైద్యులతోపాటు గాంధీ, నిమ్స్ హాస్పిటళ్ల డాక్టర్లతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఇక కారుణ్య నియామకాల ప్రక్రియ ప్రారంభమైనట్టేనని సింగరేణి ఉన్నతాధికారులుచె ప్తున్నారు.


అర్హులు వీరే..

కార్మికుడి భార్య లేదా కార్మికురాలి భర్త, అవివాహిత కుమార్తె, కుమారుడు, చట్టబద్ధంగా దత్తత తీసుకున్న కుమారుడు.
వారసులు లేనిపక్షంలో సదరు కార్మికుడి సోదరుడు, వితంతు కుమార్తె, వితంతు కోడలు లేదా కార్మికుడిసం పాదనపై ఆధారపడిన అల్లుడు.
పురుషులకు భూగర్భ గనిలో బదిలీ వర్కర్‌గా, మహిళలకు గని ఉపరితలం(సర్ఫేస్)లోపని చేసేఅ వకాశం.

కోల్ బెల్ట్‌లో సంబురాలు

కారుణ్య నియామకాలపై సర్క్యులర్ విడుదలైన నేపథ్యంలో సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో కార్మికులు సంబురాలు జరుపుకొంటున్నారు. సర్క్యులర్ విడుదలైనట్టు తెలిసిన వెంటనే కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్‌లో టీబీజీకేఎస్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఎంపీ కల్వకుంట్ల కవిత ఫ్లెక్సీలకు కార్మికులు పాలాభిషేకాలు చేశారు. మిఠాయిలుతి నిపించుకునిఆ నందం పంచుకున్నారు.

కేసీఆర్‌కు కార్మికవర్గం రుణపడి ఉంటుంది



దూసుకుపోతున్నది. రాష్ట్ర సొంత ఆదాయం ఆశించిన స్థాయిలో పెరుగడంతో ఈసారి బడ్జెట్ మొత్తాన్ని భారీగా పెంచడానికి అవకాశం ఏర్పడింది. 2017-18లో రూ. 1,49,646 కోట్లుగా ఉన్న బడ్జెట్.. 2018-19లో 18 నుంచి 20 శాతం పెరుగవచ్చని సమాచారం. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి ఎన్నో ప్రతికూల పరిణామలను సైతం ఎదుర్కొని రాష్ట్రం ఆర్థికవృద్ధిలో అగ్రపథాన సాగిపోతున్నది. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు కేటాయింపులను భారీగా పెంచే అవకాశమున్నదని సమాచారం. బీసీల సంక్షేమానికి కేటాయించే నిధులను పదిశాతం పెంచనున్నట్టు తెలిసింది. తాజా బడ్జెట్‌లో ప్రగతి పద్దు, నిర్వహణ పద్దుల లెక్కలు పూర్తయ్యాయి. 2017-18 లో నిర్వహణ పద్దు కింద రూ.61,607 కోట్లు, ప్రగతి పద్దు కింద 88,038 కోట్లు ప్రతిపాదించారు. ఈసారి ప్రగతి పద్దు మరింత పెరిగే అవకాశమున్నది. 2017-18 లో రాష్ట్ర సొంత ఆదాయం సుమారు రూ. 70 నుంచి 79 వేల కోట్లుగా అంచనా వేశారు. కేంద్ర వితరణ కింద వచ్చే మొత్తాన్ని 43 వేల కోట్లుగా అంచనా వేశారు. సొంత రాబడులలో నిరుడు 17 శాతం ఉన్న వృద్ధిరేటు ఈసారి 19 శాతానికి పెరిగింది. వాణిజ్యపన్నుల (జీఎస్టీ+వ్యాట్) ద్వారా ఇప్పటివరకు 38 వేల కోట్ల వరకు రాబడి సమకూరింది. మార్చి నెలాఖరుకు ఈ రాబడి 42 వేల కోట్లను దాటవచ్చని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్ నమస్తే తెలంగాణకు చెప్పారు. గతంలో కంటే ఇది 19.57 శాతం ఎక్కువ. జీఎస్టీ అమల్లోకి వచ్చిన మొదటి నెలలో కేవలం 5.68 శాతంగా ఉన్న వృద్ధిరేటు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రత్యేక కృషి వల్ల ఫిబ్రవరి వరకు మొత్తంగా 19.57 శాతానికి పెరిగింది. ఫిబ్రవరి నెలలోనే జీఎస్టీ, వ్యాట్ రూపంలో దాదాపు నాలుగువేల కోట్ల రాబడి వచ్చింది. పెద్దనోట్ల రద్దు తర్వాత రియల్ రంగం కునారిల్లి రాబడి అంతగా రాకపోవచ్చని రాష్ట్రప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఆదాయాన్ని రూ.3వేల కోట్లుగా అంచనా వేసింది. కానీ విచిత్రంగా అంచనాలు మించి ఇప్పటికే జనవరి నాటికే రిజిస్ట్రేషన్ ఆదాయం 3,500కోట్ల రూపాయలను దాటింది. ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరుకు రూ.5వేల కోట్లు దాటినా ఆశ్చర్యం లేదని అధికారులంటున్నారు. ఆబ్కారీ ఆదాయం కూడా అంచనాలను మించి పదివేల కోట్ల రూపాయలను దాటే దిశగా పరుగులు పెడుతున్నది. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగానికి మొదట్నుంచీ అధిక ప్రాధాన్యమిస్తున్నది. వ్యవసాయరంగంపై అధికశాతం ప్రజలు ఆధారపడి ఉన్నప్పటికీ ఆ రంగం ద్వారా వస్తున్న రాబడి రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) లో చాలా తక్కువగా ఉన్నది. జీఎస్డీపీలో వ్యవసాయరంగం వాటా 15 నుంచి 18 శాతం వరకు మాత్రమే ఉన్నది. వ్యవసాయరంగానికి కేటాయింపులను పెంచడం ద్వారా పంట సాగును లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది.

రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్ నిర్ణయం!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో పోటీచేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. శుక్రవారం కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో ఒక అభ్యర్థి గెలువాలంటే 30 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్‌కు సొంత బలం లేకపోయినా విపక్షపార్టీలు, రెండో ప్రాధాన్య ఓటుపై ఆశలతో అభ్యర్థిని బరిలో దింపాలని నిర్ణయించినట్లు తెలిసింది. కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, మాజీ ఎంపీలు రవీంద్రనాయక్, అజహరుద్దీన్, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి పేర్లు అభ్యర్థికోసం ప్రచారంలో ఉన్నాయి. రాజ్యసభ ఎన్నికల్లో పోటీచేయబోతున్నానని, సోమవారం నామినేషన్ వేయనున్నానని బలరాంనాయక్ శనివారం మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే మూడు స్థానాలకు అభ్యర్థులను పోటీకి దించాలని టీఆర్ఎస్ నిర్ణయించింది.



వరంగల్‌లో అంబికా కృష్ణను సన్మానిస్తున్న వైశ్యసంఘం, వాసవీక్లబ్ సభ్యులు

కేసీఆర్ సీఎం కావడం ప్రజల అదృష్టం

ఏపీ ఫిలిం ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ చైర్మన్ అంబికా కృష్ణ

సుబేదారి(వరంగల్): 'విజన్ ఉన్న నేత కేసీఆర్.. ఆయన సీఎం కావడం తెలంగాణ ప్రజల అదృష్టం' అని ఆంధ్రప్రదేశ్ సినిమా పరిశ్రమ అభివృద్ధి చైర్మన్ అంబికా కృష్ణ పేర్కొన్నారు. వరంగల్‌లో వైశ్యసంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం అంబికా కృష్ణకు సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల సీఎంలు అభివృద్ధిలో పోటీపడుతున్నారన్నారు. తెలంగాణ, ఏపీ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. రాష్ట్రాలు భౌగోళికంగావిడి పోయినా ప్రజలు మాత్రం ఎప్పటికీ కలిసి ఉంటారన్నారు.

సంబురాలు

సింగరేణి కారుణ్య నియామకాలపై హర్షం

సీఎం కేసీఆర్, ఎంపీ కవిత ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

గోదావరిఖని/రామవరం: ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాలపై సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడంతో కార్మికలోకం హర్షం వ్యక్తం చేసింది. కార్మికులకు కారుణ్య సౌకర్యం కల్పిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో సంబురం అంబరాన్నంటింది. సింగరేణి వ్యాప్తంగా గనులపై కార్మికులు కేసీఆర్, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎంపీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పటాకులు కాల్చారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా కార్మిక ప్రాంతం రుద్రంపూర్‌లోని టీఆర్ఎస్ కార్యాలయం ఎదుట ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. కారుణ్య నిమామకాలకు సంబంధించి విధివిధానాలను కొన్నింటిని ఇప్పటికే ప్రకటించారని, ఇందులో దత్త పుత్రులకు, మహిళా డిపెండెంట్, వికలాంగులకు, తమ్ముడికి, అల్లుడు అవకాశం కల్పించి కారుణ్యమూర్తిగా సీఎం కేసీఆర్ నిలిచారని కార్మికులు కొనియాడారు.



కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్



మనమరాలికి అక్షరాభ్యాసం చేయిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలయోగి

అమ్మవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

బాసర: బాసరలో సరస్వతీ అమ్మవారిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలయోగి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. న్యాయమూర్తి బాలయోగి తన మనుమరాలు ప్రణవికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరికి శాలువాతో సన్మానించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.



చిన్నసాకరికుంటలో మిషన్ కాకతీయ పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ సిరికొండ

ప్రతి ఎకరాకు నీరు: స్పీకర్ సిరికొండ

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని ప్రతి ఎకరానికి సాగునీరిచ్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. మిషన్ కాకతీయ నాల్గో విడుతలో ఎంపికైన భూపాలపల్లి మండలం చిన్నసాకరికుంట, రేగొండ మండలం ఎర్రమ్మకుంట పునరుద్ధరణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆనందంగా ఉంటేనే, దేశం సుభిక్షంగా ఉంటుంది అనే ఆలోచనతో మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చారన్నారు.

సిరిసిల్ల నుంచే కేసీఆర్ కల సాకారం చేస్తాం

మిషన్ భగీరథ పథకం వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి



ప్రశాంత్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఏప్రిల్ 15లోగా ఇంటింటికీ నల్లా నీరందించి సీఎం కేసీఆర్ కలను సిరిసిల్ల నుంచే సాకారమయ్యేలా చూస్తామని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజారోగ్య, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో మిషన్ భగీరథ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే గొప్ప ఆలోచన చేసి ప్రజలందరికీ రక్షిత మంచి నీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రాజెక్టు పూర్తయి ఇంటింటికీ రక్షిత నీరు అందిస్తే దేశానికే ఈ పథకం ఆదర్శంగానిలు స్తుందన్నారు.

నవ భారత్ నిర్మాణమే కేసీఆర్ లక్ష్యం

కరీంగనర్ ఎంపీ వినోద్‌కుమార్



ఎంపీ వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: అభ్యుదయ ఆలోచనలు, ప్రజాస్వామ్యం పట్ల విలువలున్న ప్రాంతీయ పార్టీల సమ్మేళనమే దేశ రాజకీయాలకు అవసరమని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఓ కూటమితో నవ భారత్‌ను ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో సీఎం కేసీఆర్ ముందుకుపోతున్నట్టు తెలిపారు. ప్రాంతీయ పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో వేగంగా అభివృద్ధి జరుగుతున్నదన్నారు. తెలంగాణ అభివృద్ధితో పాటు దేశాభివృద్ధిని కాంక్షిస్తూ దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం పెంచే విధంగా ముందుకుపోతుంటే కొందరు దీనిపై అవహేళనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జాతీయ పార్టీలు కేవలం ఢిల్లీకే పరిమితమయ్యాయన్నారు. జాతీయ పార్టీలకు విశాల దృక్పథం ఉంటుందని, ప్రాంతీయ పార్టీలకుసం కుచితమైన ఆలోచన ఉంటుందన్న మాట సరికాదన్నారు.



నాసా నుంచి ఆహ్వానం అందిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

ఆర్మూర్ విద్యార్థులకు 'నాసా' ఆహ్వానం

ఆర్మూర్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పెర్కిట్‌లోని శ్రీభాషిత హైస్కూల్ విద్యార్థులకు అమెరికాలోని నేషనల్ ఎరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) అంతరిక్ష కేంద్రానికి రావాల్సిందిగా శనివారం ఆహ్వానం అందింది. ఏటా మే నెలలో నాసా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్ అమెరికాలో నిర్వహిస్తారు. మానవ మనుగడకు కావాల్సిన నూతన ఆలోచనలతో ప్రాజెక్టులను ఏటా విద్యార్థుల నుంచి నాసా ఆహ్వానిస్తున్నది. లాస్‌ఏంజిల్స్‌లో మే 24నుంచి 27వరకు జరుగనున్న సమావేశానికి ఆర్మూర్ మండలం పెర్కిట్ భాషిత పాఠశాల విద్యార్థులు ఏ ఈశ్వర్, ఏ మనోజ్‌కుమార్, ఎం సాకేత్‌గౌడ్, పీ భరత్, గైడ్‌గా వ్యవహరించిన పాఠశాలక రస్పాండెంట్‌పో లపల్లి భాషిత సుందర్‌కు ఆహ్వానం అందింది.



ములుకనూరు బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డితో ఇథియోపియా బృందం

ములుకనూరు బ్యాంకు సేవలు భేష్

భీమదేవరపల్లి(వరంగల్): ములుకనూరు సహకార గ్రామీణ బ్యాంకు రైతులకు చేస్తున్న సేవలు భేష్ అని ఇథియోపియా మంత్రుల బృందం కితాబిచ్చింది. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ద్వారా సౌత్ ఆఫ్రికా ఖండంలోని ఇథియోపియా దేశానికి చెందిన వ్యవసాయశాఖ మంత్రి యాసు అబ్రహ అల్లె, ప్రతినిధులు టీస్ఫాయే మెంగిస్టే డోరి, వ్యవసాయశాఖ డైరెక్టర్ లిమ్మా హాయితోపాటు మరో ఎనిమిదిమంది ప్రతినిధులు ములుకనూరు సహకార బ్యాంకుపై అధ్యయనం చేశారు. బ్యాంకు సభ్యులకు ఇస్తున్న పంట రుణాలు, సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యాంకు అభివృద్ధిపై అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వారికివివ రించారు.

అధికార యావలో కాంగ్రెస్

- అధికారంలో ఉన్నప్పుడు చేయరు
- మేం చేస్తే జీర్ణించుకోలేరు
- దేవాదుల ద్వారా 60 టీఎంసీలు తీసుకుంటాం
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్ రిజర్వాయర్ కాల్వ వద్ద గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మండలి విప్ బొడెకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ/నర్మెట(జనగామ): 'కాంగ్రెస్ పార్టీది అధికార యావ.. వారికి ప్రజా సంక్షేమం పట్టదు.. గత పదేండ్లలో మీరే కదా అధికారంలో ఉన్నది.. అప్పుడు ఎందుకు చేయలేదు?.. కర్ణాటకలో మీ ప్రభుత్వమే కదా అధికారంలో ఉంది. అక్కడ 24 గంటల కరెంటు ఎందుకు ఇవ్వడం లేదు?.. రుణమాఫీ ఎందుకు చేయడం లేదు?.. ఇవ్వాల యాత్రల పేరిట తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులు ఏవో నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నరు' అంటూ రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మండలి విప్ బొడెకుంటి వెంకటేశ్వర్లు, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంతో కలిసి మంత్రి శనివారం సాయంత్రం జనగామ జిల్లా నర్మెట మండలం బొమ్మకూరులోని రిజర్వాయర్ నుంచి దేవాదుల ఫేజ్-3లో భాగంగా కన్నెబోయినగూడెం రిజర్వాయర్‌లోకి నీటిని వదిలారు. అనంతరం కన్నెబోయినగూడెం సమీపంలోని కేసిరెడ్డిపల్లి వద్ద గేట్‌వాల్ ద్వారా సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాగా రాత్రి లద్నూరు రిజర్వాయర్ వద్ద ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన భారీ బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. గోదావరి నదిపై కాఫర్ డ్యాం నిర్మించడంతో ఆ జలాలను తీసుకోవడం సాధ్యమవుతున్నదన్నారు. ఎండాకాలంలో చెరువులు, కుంటలకు నీటి పంపింగ్ చేసేందుకు రిజర్వాయర్లు నింపుతున్నట్టు తెలిపారు. దేవాదుల నుంచి ప్రస్తుతం 8 టీఎంసీల నీటిని తీసుకుంటున్నామని, ఇకముందు 60 టీఎంసీల తీసుకోనున్నామని చెప్పారు. దేవాదుల ఫేజ్-1 ద్వారా రోజూ 350 క్యూసెక్కులు, ఫేజ్-2 ద్వారా 495 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నట్టు తెలిపారు. ఫేజ్-3 పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, దీని ద్వారా 1752 క్యూసెక్కుల నీళ్లు వస్తాయని చెప్పారు. దీంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, మద్దూరు మండలాలకు దేవాదుల, కాళేశ్వరం, గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల ద్వారా సాగు నీటిని అందించనున్నట్టు పేర్కొన్నారు. ఒకప్పుడు కరువు కాటకాలు, వలసలకు నెలవైన నర్మెట, బచ్చన్నపేట, మద్దూరు మండలాలు ప్రస్తుతం పచ్చటి పొలాలతో కళకళలాడుతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. చినుకు పడకముందే రైతుల చేతికి పెట్టుబడి చెక్కును మొదటి పంటకు అందిస్తామన్నారు.

మరో 20 ఏండ్లు తెలంగాణకు సీఎం కేసీఆర్

రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు మంచి విజన్‌తో ముందుకు సాగుతున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మరో 20 ఏండ్లపాటు కేసీఆర్ సీఎంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సభలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ, జాయింట్ కలెక్టర్ వనజాదేవీ, దేవాదుల ప్రాజెక్టు సీఈ బంగారయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో జాతీయ రహదారిపై టిప్పర్‌ను గుద్దుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్ బస్సు.. ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టిప్పర్

హైవేపై వాహనాల బీభత్సం

- మితిమీరిన వేగంతో ట్రావెల్ బస్సు-టిప్పర్ ఢీ
- టిప్పర్ డ్రైవర్ మృతి: ముగ్గురికి తీవ్రగాయాలు
- నుజ్జునుజ్జయిన వాహనాలు
- సీసీ ఫుటేజీలో రికార్డయిన ప్రమాద దృశ్యాలు

జహీరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ రహదారిపై రెండు వాహనాలు బీభత్సాన్ని సృష్టించాయి. మితిమీరిన వేగం కారణంగా ట్రావెల్ బస్సు-టిప్పర్ ఢీకొనడంతో రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇందులో టిప్పర్ డ్రైవర్ మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సీసీ ఫుటేజీలో నమోదైన దృశ్యాలు ప్రమాద తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో 65వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఇలా.. కరణ్ ట్రావెల్ బస్సు 36 మంది ప్రయాణికులతో ముంబై నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తున్నది. ఈ క్రమంలో జహీరాబాద్ సమీపంలో జాతీయ రహదారిపై రింగ్ రోడ్డు వద్ద టిప్పర్ క్రాస్ అవుతుండగా, ట్రావెల్ బస్సు అతివేగంగా గుద్దుకుంటూ రోడ్డు కిందకు దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. టిప్పర్ నుజ్జునుజ్జు కాగా, బస్సు ముందరి భాగం బాగా దెబ్బతిన్నది. ఈ ప్రమాదంలో జహీరాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ అక్బర్(36) మృతి చెందగా, బస్సు డ్రైవర్లు అంజార్, షకిల్‌తోపాటు ప్రయాణికుడు ప్రభురాం తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించారు. జహీరాబాద్ సీఐ సదా నాగరాజ్, ఎస్సైలు సత్యనారాయణ, చర్ల రాజశేఖర్, శ్రీకాంత్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కాగా, బస్సు వేగంగా వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టినప్పుడు ఒకవేళ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఉంటే ప్రాణ నష్టం భారీగా ఉండేది. ఈ బస్సు అరుణాచల్‌ప్రదేశ్ పర్మిట్‌తో తిరుగుతున్నది.



సూర్యాపేటలో బీజేపీ యువమోర్చా నాయకుడు గుండపనేని కిరణ్‌కుమార్‌కు కండువా కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



కరీంనగర్‌లో టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకుడు శ్రీధర్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లో రోజురోజుకూ చేరికలు పెరుగుతున్నాయి. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ యువమోర్చా నాయకుడు, సంకినేని వెంకటేశ్వర్‌రావుకు అత్యంత సన్నిహితుడు గుండపనేని కిరణ్‌కుమార్ 300 మంది యువకులతో జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ తీసి, అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సాంగిడిలో కాంగ్రెస్ ఉప సర్పంచ్‌తోపాటు వందమంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అటవీశాఖ మంత్రి జోగు రామన్న సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కరీంనగర్‌లో బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్‌తోపాటు 300 మందికిపైగా బీజేపీ నాయకులు [illegible]ర్తలు ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో [illegible]కం[illegible]ద్రంతోపాటు బొమ్మనపల్లి, రామంచకు చెందిన 200 మంది చిన్నముల్కనూర్‌లో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. జనగామ మండలం గానుగుపహాడ్‌లో టీడీపీ మండల నాయకుడు, చీటకోడూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ శానబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో 80 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్‌లో 200మంది మైనార్టీ యువత ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సమక్షంలో, మోపాల్ మండలం ముదక్‌పల్లికి చెందిన కుమ్మరి సంఘం ప్రతినిధులు, తండాలకు చెందిన పెద్దలు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం అభ[illegible]గపట్నం, శేర్‌పల్లి, కొత్లాబాద్‌కు చెందిన 80మంది కాంగ్రెస్, [illegible]జేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

ప్రముఖ సామాజిక, వ్యాపారవేత్త

ఇల్లెందుల అంజయ్య కన్నుమూత

సంతాపం తెలిపిన పలువురు వ్యాపారులు, వివిధ సంఘాలు



ఇల్లెందుల అంజయ్య(ఫైల్)

కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఇల్లెందుల అంజయ్య (64) శనివారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. ఈయన పుట్నాలు, రైస్ మిల్లులు, కుంకుమ మిల్లుల వ్యాపారాలు నిర్వహించడంతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పుట్నాల మిల్లు రాష్ట్ర అధ్యక్షుడిగా, అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడిగా, వైశ్య సంక్షేమ సమితి అధ్యక్షుడిగా, హిందూ శ్మశానవాటిక సలహాదారుగా, హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యుడిగా, భారతి తీర్థానందమఠం సభ్యుడిగా, కొండపాక ఆనంద నిలయం సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంజయ్య మృతికి పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల సభ్యులు సంతాపం ప్రకటించారు.

ప్రేమజంట ఆత్మహత్య



గణేశ్, పూజిత (ఫైల్)

రామన్నపేట: పెండ్లికి పెద్దలు నిరాకరించడంతో ప్రేమజంట శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కొమ్మాయిగూడెంలో ఆత్మహత్య చేసుకున్నది. రామన్నపేట ఎస్సై నాగన్న వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం పల్లెపహడ్‌కు చెందిన గణేశ్(22), పూజిత(15) ప్రేమించుకున్నారు. గణేశ్ ఇంటర్ చేయగా, పూజిత పదోతరగతి చదువుతున్నది. వీరి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురై, శనివారం ఉదయం కొమ్మాయిగూడానికి చేరుకొని రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నారు.

ఎనిమిదేండ్ల బాలికపై లైంగికదాడి

దేవరకొండ, నమస్తేతెలంగాణ: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన ఎనిమిదేండ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ భాస్కరాచారి(22) లైంగికదాడి చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. రెండోతరగతి చదువుతున్న బాలికను శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో టీవీ చూడటానికి పిలిచి ఈ దారుణానికి ఒడిగట్టాడు.

మూగ చిన్నారిపై లైంగికదాడికి యత్నం

దామరగిద్ద: మహబూబ్‌నగర్ జిల్లా దామరగిద్ద మండలం ఉడ్మలగిద్దలో ఐదేండ్ల మూగ చిన్నారిపై అదే గ్రామానికి చెందిన బాలుడు లైంగికదాడికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ఉడ్మలగిద్దలో మూగ బాలిక సోమవారం సాయంత్రం తన ఇంటి ఎదుట ఆడుకుంటుండగా, సమీపంలో ఉండే 17 ఏండ్ల బాలుడు లైంగికదాడికి యత్నించినట్టు చిన్నారి బంధువులు గురువారం దామరగిద్ద ఠాణాలో ఫిర్యాదు చేశారు.

కామారెడ్డిలో భారీ చోరీ

50 తులాల బంగారం, రూ.లక్షన్నర నగదు అపహరణ

కామారెడ్డి, నమస్తే తెలంగాణ: కామారెడ్డిలోని ఎన్జీవోస్‌కాలనీలో భారీ చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు పగులగొట్టి, బంగారంతోపాటు నగదు అపహరించుకెళ్లారు. పట్టణ సీఐ శ్రీధర్‌కుమార్ వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి జితేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో గురువారం తిరుపతి వెళ్లారు. శుక్రవారం రాత్రి దొంగలు తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న 50తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్షన్నర నగదు, విలువైన వస్తువులు దోచుకెళ్లారు. శనివారం ఉదయం చుట్టూ పక్కల వారు ఇంటి తాళం పగిలి ఉండటాన్ని గమనించి, పోలీసులకు సమాచారమందించారు.

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన ప్రెషర్ బాంబు

జవానుకు తీవ్రగాయాలు


భద్రాచలం, నమస్తే తెలంగాణ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడ్ ఠాణా పరిధి తోగ్గూడ గ్రామ సమీపంలో శనివారం బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు(ఐఈడీ) పేలి డీఆర్‌జీ జవానుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతనిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా దవాఖానకు తెచ్చి, ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. సంఘటన జరిగిన తోగ్గూడ గ్రామం భద్రాచలం నియోజకవర్గంలోని చర్ల మండల సరిహద్దులో ఉంది.

పెండ్లయిన కొద్ది గంటలకే..

సొమ్మసిల్లి వధువు మృతి.. సూర్యాపేటలో విషాదం

సూర్యాపేట వ్యవసాయం : సూర్యాపేట జిల్లా కేంద్రంలో పెండ్లింట పెనువిషాదం నెలకొంది. వివాహం జరిగిన కొద్దిగంటల్లోనే వధువు మృతి చెందడం రెండు కుటుంబాలను కలిచివేసింది. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేటకు చెందిన కటకం హనుమయ్య కూతురు కటకం గాయత్రి(23) వివాహం మహబూబ్‌నగర్ జిల్లా నెల్లికుదురుకు చెందిన వేణుతో శనివారం మధ్యాహ్నం 12గంటలకు వైభవంగా జరిగింది. సాయంత్రం వధూవరులు ఊరేగింపుతో వచ్చి వేంకటేశ్వర ఆలయానికి వచ్చి, తిరిగి మెట్లు దిగుతున్న క్రమంలో గాయత్రి ఒక్కసారిగా కుప్పకూలింది. ఆమెను బంధువులు హుటాహుటిన ఏరియా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు డాక్టర్లు చెప్పగా, మృతికి గల కారణాలు తెలియరాలేదు. గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు చెబుతున్నారు.

గీతం వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య



ఫణిభూషణ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది ఓ విద్యార్థి యూనివర్సిటీ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ వివరాల ప్రకారం.. నాట్కో పరిశ్రమ ఉద్యోగి పాలేరు రమేశ్ మియాపూర్ సమీపంలోని నిజాంపేట రోడ్డులోగల జయభారత్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇతడి పెద్ద కుమారుడు ఫణిభూషణ్(20) గీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గత నెల నిర్వహించిన మధ్యంతర పరీక్షలో రెండు సబ్జెక్టులు తప్పాడు. ఈ విషయమై తండ్రి రమేశ్ మందలించాడు. కాలేజీకి చేరుకున్న ఫణిభూషణ్ తన స్నేహితుడు శ్రీకాంత్‌తో తన తండ్రి తిట్టిన విషయాన్ని చెప్పి బాధపడ్డాడు. ఆ తరువాత కొద్దిసేపటికే కళాశాల ఐదో అంతస్తు నుంచి కిందికి దూకేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఫణిభూషణ్‌ను కళాశాల యాజమాన్యం వెంటనే మదీనాగూడలోని అర్చన దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు ప్రకటించారు.

పాస్‌పోర్టు వివరాలు తప్పనిసరి

■ రూ.50 కోట్ల కంటే అధిక రుణాలపై కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 10: బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్న వారిపై ఉక్కుపాదం మోపడానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. బ్యాంకుల వద్ద రూ.50 కోట్ల పైబడి రుణాలు తీసుకోవాలనుకునే ఖాతాదారులు ఇకనుంచి పాస్‌పోర్టు వివరాలు తప్పనిసరిగా అందించాల్సి ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సేవల కార్యదర్శి రాజీవ్‌కుమార్ స్పష్టంచేశారు. రుణాలు తీసుకునే మోసగాళ్లు విదేశాలకు పారిపోకుండా అడ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. బాధ్యతాయుతమైన, పారదర్శకమైన బ్యాంకింగ్ వ్యవస్థను తీర్చిదిద్దడానికి ఇది మరో ముందడుగు లాంటిదని ట్విట్టర్ ద్వారా ఆయన వెల్లడించారు. గతంలో రుణాలు తీసుకున్న వారి పాస్‌పోర్టు వివరాలను వచ్చే 45 రోజుల్లోగా సేకరించాలని ఆయన బ్యాంకులకు సూచించారు. ఒకవేళ సదరు ఖాతాదారులు వివరాలు ఇవ్వకపోతే బ్యాంకులు వారిపై కఠిన చర్యలు తీసుకోవచ్చునన్నారు. ఇటీవల పీఎన్‌బీలో జరిగిన రూ.12 వేల కోట్ల భారీ కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో కేంద్రం కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. ఈ స్కాంలో ప్రధాన సూత్రధారి నీరవ్ మోదీ, ఆయన బంధువు మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతాలు దొంగచాటున విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే.





శనివారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ సీ శుక్లా, రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అధియా

బిల్లు లేనిదే.. బండి కదలదు



■ వచ్చే నెల 1 నుంచి రాష్ట్రాల మధ్య సరకు రవాణాకు ఈ-వే బిల్లు తప్పనిసరి
■ 15 నుంచి దశలవారీగా రాష్ట్రాల్లోనూ అమలు ■ జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 10: ఇక బిల్లుల్లేనిదే.. బండ్లు కదలవు. వచ్చే నెల 1 నుంచి రాష్ట్రాల మధ్య సరకు రవాణాకు ఎలక్ట్రానిక్ వే బిల్లులు తప్పనిసరి. 15 నుంచి దశలవారీగా రాష్ట్రాల మధ్య కూడా ఈ-వే బిల్లులు అమల్లోకి రానున్నాయి మరి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో శనివారం ఇక్కడ సమావేశమైన వస్తు, సేవల పన్ను మండలి (జీఎస్టీ కౌన్సిల్) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రాల మధ్య వస్తు రవాణా కోసం ఓ ఎలక్ట్రానిక్ ఆధారిత బిల్లును తీసుకోవాల్సిందేనని జైట్లీ ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. అలాగే ఏప్రిల్ 15 నుంచి రాష్ట్రాల లోపల సరకు రవాణా జరుగాలన్నా ఈ-వే బిల్లులు అవసరమని చెప్పారు. అయితే దశలవారీగా ఇది అమలవుతుందని, జూన్ 1వరకు మాత్రం అన్ని రాష్ట్రాల్లో ఈ-వే బిల్లుల అమలు ఉండాల్సిందేనన్నారు. ఇందులో భాగంగానే దేశంలోని అన్ని రాష్ట్రాలను నాలుగు గ్రూపులుగా విభజించగా, తొలి గ్రూపులోని రాష్ట్రాలు ఏప్రిల్ 15 నుంచి తమతమ రాష్ట్రాల్లో ఈ-వే బిల్లులను అమల్లోకి తేవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 7న ఏయే రాష్ట్రాలు ఇందులో ఉంటాయనేది తెలుతుంది. ఇలా జూన్ 1కల్లా అన్ని రాష్ట్రాల్లోనూ ఈ-వే బిల్లులు ఉండి తీరాలని జీఎస్టీ కౌన్సిల్ తీర్మానించింది. నిజానికి ఫిబ్రవరి 1 నుంచే ఈ-వే బిల్లుల్ని పరిచయం చేయాలని అనుకున్నప్పటికీ సాంకేతిక కారణాల దృష్ట్యా సాధ్యపడలేదు. కాగా, రూ.50,000 మించి విలువ కలిగిన వస్తువుల రవాణాకు ఈ-వే బిల్లులు అవసరం. జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ అడిగినపక్షంలో దీన్ని చూపించాల్సి ఉంటుంది. ఈ-వే బిల్లులతో అక్రమాలకు అడ్డుకట్టపడి పన్ను వసూళ్లూ పెరుగుతాయన్న అంచనాలున్నాయి. ఇదిలావుంటే అక్టోబర్ 1 నుంచి జీఎస్టీ కింద ఎగుమతిదారులకు రిఫండ్స్ ఇవ్వడం కోసం ఈ-వాలెట్ పథకం అమలు చేయాలని కూడా ఈ 26వ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. అలాగే ఎగుమతిదారులకున్న పన్ను మినహాయింపుల్ని సెప్టెంబర్ 30దాకా పొడిగించారు. మరోవైపు జూన్ 30 వరకు టీడీఎస్, టీసీఎస్ మినహాయింపుల్నీ కౌన్సిల్ వాయిదా వేసింది.

జూన్ వరకు జీఎస్టీఆర్-3బీ పొడిగింపు

జీఎస్టీఆర్-3బీని జూన్ వరకు పొడిగించారు. వ్యాపారానికి సంబంధించి పన్ను రిటర్నుల దాఖలు విధానాన్ని సరళతరం చేయాలన్నదానిపై రాష్ట్రాల మధ్య ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ప్రస్తుత దాఖలు వ్యవస్థనే మరో మూడు నెలలపాటు పొడిగించారు. సరళతర రిటర్నుల విధానం కోసం మంత్రుల బృందం పనిచేయనున్నది. కేంద్ర, రాష్ట్రాలకు చెందిన పన్నుల శాఖ అధికారులు రిటర్నుల విధానం సరళతరం కావాలని కోరుతున్నట్లు జైట్లీ ఈ సందర్భంగా తెలిపారు. దీనివల్ల పన్ను ఎగవేతలకూ అడ్డుకట్ట పడుతుందని చెబుతున్నారన్నారు. 'పన్ను రిటర్నుల దాఖలు విధానం సులువుగా ఉండాల్సిన అవసరం ఉన్నది. అయితే సులభంగా ఎలా మార్చాలన్నదానిపై చర్చిస్తున్నాం. కాబట్టి మరో 3 నెలలు ఇప్పుడున్న జీఎస్టీఆర్-3బీ వ్యవస్థ కొనసాగుతుంది' అని మండలి సమావేశం అనంతరం విలేఖరులకు తెలిపారు. జూన్ వరకు తుది విక్రయాల రిటర్న్ జీఎస్టీఆర్-1తోపాటు, సమగ్ర అమ్మకాల రిటర్న్ జీఎస్టీఆర్-3బీ దాఖలు నడుస్తుందన్నారు. ఏప్రిల్ 20లోగా ఎప్పుడైనా మార్చి నెల 3బీ రిటర్ను దాఖలు చేయవచ్చని, మార్చి 20లోగా ఫిబ్రవరి నెల రిటర్ను దాఖలు పరుచవచ్చని ఈ సందర్భంగా కౌన్సిల్ తెలిపింది. అలాగే రూ.1.5 కోట్లు అంతకంటే తక్కువ వార్షిక టర్నోవరున్న పన్ను చెల్లింపుదారులు జనవరి-మార్చి జీఎస్టీఆర్-1 రిటర్నుల దాఖలు ఏప్రిల్ 30లోగా చేసుకోవచ్చు ఇంతకంటే ఎక్కువ టర్నోవర్ ఉన్నవారు తమ ఫిబ్రవరి, మార్చి నెలల రిటర్నులను ఏప్రిల్ 10, మే 10లోగా దాఖలు చేయవచ్చు.

నల్ల బజారుకు అడ్డుకట్ట

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఈ-వే బిల్లులతో నల్ల బజారుకు అడ్డుకట్ట పడనున్నది. రాష్ట్రాల మధ్య జీఎస్టీ వే-బిల్లులు లేకపోవడం వల్ల బ్లాక్ మార్కెటీర్లు రెచ్చిపోతున్నారు. రాష్ట్ర అధికారులు ఇటీవల వరుసగా జరిపిన దాడులలో భారీ ఎత్తున నల్ల దందా బాగోతం బయటపడింది కూడా. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి సరుకులను తరలిస్తున్న కంపెనీల యజమానులు, వ్యాపారులు ఇన్‌వాయిస్‌లు, వే-బిల్లులు లేకుండా అడ్డదారిలో సరుకులను అమ్ముకుని లాభపడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సరుకులను తీసుకువచ్చి ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ చెల్లించకుండా పన్నులను ఎగవేస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. జీఎస్‌టీ అమలులోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా.. కేంద్రం వే-బిల్లులను తయారుచేయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న తెలంగాణకే అధిక నష్టం వాటిల్లింది. నిజానికి రాష్ట్రంలో ఆగస్టు 10 నుంచే వే-బిల్లులను జారీ చేస్తూ.. పన్ను ఎగవేతదారులపై నిఘా వేసి ఉంచారు అధికారులు. కాగా, వచ్చే నెల నుంచి ఈ-వే బిల్లులను జారీ చేస్తే ఐజీఎస్టీ రాబడి పెరుగుతుందని రాష్ట్ర అబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు.

భారత్‌కొచ్చిన భయమేమీలేదు

■ అమెరికా సుంకాల పెంపు నేపథ్యంలో ఆనంద్ మహీంద్రా



న్యూఢిల్లీ, మార్చి 10: విదేశీ ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన నేపథ్యంలో భారత్‌కొచ్చిన భయమేమీలేదన్నారు మహీంద్రా గ్రూప్ సంస్థల అధిపతి ఆనంద్ మహీంద్రా. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సృష్టించిన ప్రపంచ వాణిజ్య యుద్ధంలో భారత్ నిలదొక్కుకోగలదన్న ప్రగాఢ విశ్వాసాన్ని వెలిబుచ్చారీ ప్రముఖ వ్యాపార, పారిశ్రామికవేత్త. వివిధ దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం చొప్పున సుంకాలు విధిస్తామని శుక్రవారం ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 15 రోజుల్లో అమల్లోకి రానున్న ఈ నిర్ణయంపై అన్ని దేశాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు, అభ్యంతరాలూ వ్యక్తమవుతున్న సంగతీ విదితమే. ఈ క్రమంలోనే శనివారం ట్విట్టర్ వేదికగా అమెరికా వైఖరి పట్ల స్పందించిన ఆనంద్ మహీంద్రా.. చిన్న, ఎగుమతులపైనే ఆధారపడ్డ దేశాలకు నష్టంగానీ, భారత్ వంటి భారీ ఆర్థిక వ్యవస్థలకు వచ్చిన ముప్పేమీ లేదన్నారు. అంతేగాక దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశించి, స్థిరపడాలనుకునే బహుళజాతి సంస్థలెన్నో ఇప్పుడు భారత్‌లోనే తయారీ కేంద్రాలను పెట్టాలని చూస్తున్నాయని, కాబట్టి అమెరికా టారీఫ్‌ల ప్రభావం భారత్‌పై చెప్పుకోదగ్గస్థాయిలో ఏమీఉ ండబోదన్నారు.

జేఎల్‌ఆర్ కార్లు మరింత ప్రియం!

కోల్‌కతా, మార్చి 10: టాటా మోటార్స్‌కు చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్‌ఆర్) కూడా ధరలను పెంచడానికి సిద్ధమైంది. కస్టమ్స్ డ్యూటీని ఐదు శాతం పెంచడంతో కార్ల ధరను 3.5 శాతం నుంచి 5 శాతం వరకు పెంచవచ్చని జేఎల్‌ఆర్ ఇండియా హెడ్ రోహిత్ సూరీ సంకేతాలిచ్చారు. ఈ పెంపు ఎప్పటి నుంచి అమలులోకి వచ్చేది మాత్రం ఆయన స్పష్టతనివ్వలేదు. కస్టమ్స్ డ్యూటీతోపాటు ప్రీమియం కార్లపై అధిక జీఎస్టీతో ప్రస్తుత సంవత్సరంలో అమ్మకాల్లో నిస్తేజం నెలకొననున్నదని చెప్పారు.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో శానిటరీ ప్యాడ్ వెండింగ్ మెషీన్లు



హైదరాబాద్, మార్చి 10: జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం మరోమారు మహిళలకు పెద్దపీట వేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా విమానాశ్రయంలోని దేశీయ, అంతర్జాతీయ టర్మినల్ వద్ద ఉన్న మహిళల టాయిలెట్స్ వద్ద శానిటరీ ప్యాడ్ వెండింగ్ మెషీన్లు ఏర్పాటు చేసినట్లు జీఎంఆర్ ఒక ప్రకటనలో వెల్లడించింది. అవసరమున్న మహిళలు ఐదు రూపాయల నాణేన్ని వేసి వీటిని పొందవచ్చుననితెలిపి ంది.

స్పైస్‌జెట్ దూకుడు

■ రూ.81 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ



న్యూఢిల్లీ, మార్చి 10: చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ దూకుడు పెంచింది. ఇప్పటికే దేశీయ విమానయాన రంగంలో తనదైన ముద్రవేసిన సంస్థ..తాజాగా 12.5 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఫ్రెంచ్‌కు చెందిన సఫ్రాన్ గ్రూపు తయారు చేస్తున్న సీఎఫ్ఎం ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్లను కొనుగోలు చేయడానికి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఈ ఒప్పందం విలువ రూ.81 వేల కోట్లకు పైమాటే. విమానయాన రంగంలో కుదిరిన అతిపెద్ద ఒప్పందాల్లో ఇది కూడా ఒకటి. లీఫ్-1బీ ఇంజిన్లను కొనుగోలు చేయడానికి స్పైస్‌జెట్, సఫ్రాన్ గ్రూపులు తుదిరూపం ఇచ్చాయి. ఈ ఇంజిన్లను 155 బోయింగ్ 737 మాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు వినియోగించనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. సఫ్రాన్, జనరల్ ఎలక్ట్రిక్ జాయింట్ వెంచర్‌లో ఏర్పాటైన సీఎఫ్ఎం ఇంటర్నేషనలే ఈ ఇంజిన్లను తయారు చేస్తున్నది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ భారత పర్యటన సందర్భంగా ఇండో-ఫ్రెంచ్ దేశాల మధ్య జరిగిన కార్యక్రమంలో ఈ ఒప్పందం జరిగింది.



హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2018 సదస్సులో వలయం క్రియేషన్స్ రూపొందించిన తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హెలికాప్టర్ నమూనాలో ఏర్పాటు చేసిన ఈ పెవిలియన్‌ను రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు.

'స్పేస్ అప్లికేషన్స్'లో 80 పోస్టులు

■ పీహెచ్‌డీ, డిగ్రీ, ఐటీఐ అభ్యర్థులకు అవకాశం
■ మంచి జీతభత్యాలు, ప్రత్యేక అలవెన్సులు
■ కేంద్రప్రభుత్వ కొలువులు
■ దరఖాస్తు దాఖలు చేయడానికి చివరితేదీ ఏప్రిల్ 2

ఇస్రో పరిధిలోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ సైంటిస్టు, టెక్నీషియన్లు తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ)లో ఈ ఖాళీలు ఉన్నాయి.

పోస్టులు - ఖాళీల సంఖ్య - అర్హతలు

- సైంటిస్ట్/ఇంజినీర్' ఎస్‌డీ'
- ఖాళీల సంఖ్య - 3
- **అర్హత:** ఎలక్ట్రానిక్స్/వీఎల్ఎస్ఐ లేదా మైక్రోవేవ్‌లో పీహెచ్‌డీతోపాటు ఎంఈ/ఎంటెక్‌లో ఎలక్ట్రానిక్స్ లేదా ఈసీ లేదా ఈటీ స్పెషలైజేషన్స్ ఉండాలి. దీంతోపాటుబీఈ/ బీటెక్‌లో ఈసీఈ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **పేస్కేల్:** రూ. 67,700 - 2,08,700/- (పే మ్యాట్రిక్స్‌లో లెవల్ 11)
- సైంటిఫిక్అ సిస్టెంట్ - ఏ (మల్టిమీడియా)
- ఖాళీల సంఖ్య - 1
- **పేస్కేల్:** రూ. 44,900 - 1,42,400/-
- **అర్హత:** ఫస్ట్‌క్లాస్‌లో బీఎస్సీ మల్టిమీడియా/ యానిమేషన్(మూడేండ్ల కాలవ్యవధి గల కోర్సు) ఉత్తీర్ణత.
- టెక్నీషియన్‌బీ(ఫిట్టర్)
- ఖాళీల సంఖ్య - 14. వీటిలో జనరల్ - 7, ఓబీసీ -3, ఎస్సీ - 2, ఎస్టీ - 2 ఉన్నాయి.
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఫిట్టర్ ట్రేడ్‌లో ఐటీఐ లేదాతత్స మాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్‌బీ(మెషినిస్ట్)
- ఖాళీల సంఖ్య - 4. వీటిలో జనరల్ - 2, ఓబీసీ - 1, ఎస్టీ - 1 ఖాళీ ఉన్నాయి.
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు మెషినిస్ట్ ట్రేడ్‌లో ఐటీఐ లేదాతత్స మాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (టర్నర్)
- ఖాళీల సంఖ్య - 1
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు టర్నర్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (ఎలక్ట్రానిక్స్)
- ఖాళీల సంఖ్య - 34. వీటిలో జనరల్ - 15, ఓబీసీ - 11, ఎస్సీ - 3, ఎస్టీ - 5 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఎలక్ట్రానిక్స్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (ఎలక్ట్రీషియన్)
- ఖాళీల సంఖ్య - 2 (జనరల్ కేటగిరీలో ఉన్నాయి)
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (ఎల్ఏసీపీ/ఏవోసీపీ)
- ఖాళీల సంఖ్య - 4. వీటిలో జనరల్ - 2, ఓబీసీ - 1, ఎస్టీ - 1 ఉన్నాయి.
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ల్యాబ్ అసిస్టెంట్ కెమికల్ ప్లాంట్/అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (డిజిటల్ ఫొటోగ్రాఫర్)
- ఖాళీల సంఖ్య - 2
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు డిజిటల్ ఫొటోగ్రఫీ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (ఆర్ఏసీ)
- ఖాళీల సంఖ్య - 2
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (ఐటీ/సీటీఎస్ఎం/ఐటీఈఎస్ఎం)
- ఖాళీల సంఖ్య - 9
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సిస్టమ్ మెయింటెనెన్స్ లేదా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ మెయింటెనెన్స్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ (సీహెచ్ఎన్ఎం)
- ఖాళీల సంఖ్య - 2
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్ మెయింటెనెన్స్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- టెక్నీషియన్ బీ పోస్టులన్నింటికి..
- **పేస్కేల్:** రూ. 21,700 - 69,100/-
- **వయస్సు:** ఏప్రిల్ 2 నాటికి 18 - 35 ఏండ్ల మధ్య ఉండాలి.

- క్యాటరింగ్ అటెండెంట్ 'ఏ' - 1 పోస్టు
- **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18 - 25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 18,000 - 56,900/-
- కుక్ - 1 ఖాళీ
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణత, కనీసం ఐదేండ్ల పాటు హోటల్/క్యాంటీన్‌లో కుక్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 18 - 35 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 19,900 - 63,200/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 12 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** ఏప్రిల్ 2 (సాయంత్రం 5.30 వరకు)
- **వెబ్‌సైట్:** http://www.sac.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఏఆర్ఐలో పీహెచ్‌డీ ప్రవేశాలు

న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) 2018-19 విద్యాసంవత్సరానికి వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఐఏఆర్ఐ అనేది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ.



- **కోర్సు పేరు:** పీహెచ్‌డీ (అగ్రికల్చరల్ సైన్సెస్)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. 2018లో పీజీ పూర్తిచేయనున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1000/- (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 500/-)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 23
- **రాతపరీక్ష:** జూన్ 3
- **వెబ్‌సైట్:** www. iari.res.in

యూపీఎస్సీ

కేంద్రప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టులను భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.



పోస్టులు - ఖాళీలు:

- ట్రాన్స్‌లేటర్ (బర్మీస్) - 1. ఈ పోస్టు రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలో ఉంది.
- ట్రాన్స్‌లేటర్ (దారి/పర్షియన్) - 1. ఈ పోస్టు రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలో ఉంది.
- గ్రేడ్ - II లీగల్ ఆఫీసర్ - 4. ఈ పోస్టులు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పరిధిలో ఉన్నాయి.
- పబ్లిక్ ప్రాసిక్యూటర్ - 4. ఈ పోస్టులు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ పరిధిలో ఉన్నాయి.
- స్టోర్స్ ఆఫీసర్ - 4. ఈ పోస్టులు గనుల మంత్రిత్వశాఖ పరిధిలోని జీఎస్ఐలో ఉన్నాయి.
- సీనియర్ లెక్చరర్ (టెక్స్‌టైల్ ప్రాసెసింగ్) - 1. ఈ పోస్టు టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ పరిధిలో ఉంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 29
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

జేఆర్ఎఫ్

భువనేశ్వర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ (ఐఎల్ఎస్)లో జేఆర్ఎఫ్ కోసం ప్రకటన విడుదలైంది.

వివరాలు:



కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ పరిధిలో ఐఎల్ఎస్ పనిచేస్తుంది. ఇది ఒక స్వతంత్ర సంస్థ.

- **పోస్టు:** జూనియర్‌రి సెర్చ్ ఫెలో
- డీబీటీ స్పాన్సర్ చేస్తున్న క్రానిక్‌మై యిలాడ్ లుకేమియా ప్రాజెక్టులో భాగంగా వీటిని భర్తీ చేస్తున్నారు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 16
- **ఇంటర్వ్యూ తేదీ:** ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.ils.res.in

సీడాక్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్లు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్) వివిధ విభాగాల్లోఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

సీడాక్ మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి అనుబంధంగా పనిచేస్తున్న సంస్థ.

- మొత్తం పోస్టుల సంఖ్య:13
- ప్రాజెక్ట్ ఆఫీసర్-1 పోస్టు
- **అర్హత:** ఎంబీఏ (మార్కెటింగ్) లేదా పీజీ (సంబంధిత విభాగంలో)తోపాటు మూడేండ్ల అనుభవం .
- ప్రాజెక్ట్ ఇంజనీర్-10 పోస్టులు
- **అర్హత:** ఎంసీఏ, బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, కంప్యూటర్ అప్లికేషన్‌లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- ప్రాజెక్ట్ అసోసియేట్-2 పోస్టులు
- **అర్హత :** ఎంసీఏ, బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, కంప్యూటర్ అప్లికేషన్‌లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** చివరితేదీ నాటికి 37 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి [illegible]
- **వెబ్‌సైట్:** www.c[illegible]ac.in

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ)లో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. భారత ప్రభుత్వ పరిధిలోని స్వతంత్ర సంస్థ.

- చీఫ్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/సీనియర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ - 1
- సెక్యూరిటీ అండ్ ఫైర్ ఆఫీసర్ - 1
- అసిస్టెంట్స్ 'ఏ' - 5 ఖాళీలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితే[illegible]:** ఏప్రిల్ 2
- **వె[illegible]సైట్:** [illegible]tps://[illegible]ww.arci.res.in

యూజీసీలో ఖాళీలు

న్యూఢిల్లీలోని యూనివర్సిటీ ఆఫ్ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)లో కింది ఖాళీలను భర్తీ చేయడానికి ప్రకటన విడుదలైంది.

పోస్టులు - ఖాళీలు:

- జాయింట్ సెక్రటరీ - 2, డిప్యూటీ సెక్రటరీ - 3
- ఎడ్యుకేషన్ ఆఫీసర్ -1
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.ugc.ac.in

ఐఐటీ బాంబేలో

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- డిప్యూటీ రిజిస్ట్రార్ - 2 ఖాళీలు
- **పేస్కేల్:** రూ. 78,800 - 2,09,200/ -
- అసిస్టెంట్ రిజిస్ట్రార్ - 7 ఖాళీలు
- **పేస్కేల్:** 56,100 - 1,77,500/-)
- అర్హతలు, వయస్సు కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 21
- **వెబ్‌సైట్:** www.iitb.ac.in

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
ఆదివారం 11 మార్చి 2018

భారత్‌కు ఐదో స్థానం

సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీ

ఇఫో: సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత హాకీ జట్టు ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. శుక్రవారం ఐర్లాండ్ జట్టుతో 3-2 స్కోరుతో ఓడిన భారత జట్టు..శనివారం అదే జట్టుతో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో బదులు తీర్చుకుంది. ఐర్లాండ్ జట్టుకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 4-1 గోల్స్ తేడాతో భారత యువజట్టు ఘన విజయంతో టోర్నీని ముగించింది. భారత జట్టులో వరుణ్‌కుమార్(5,32 నిమిషంలో), శీలానందర్ లాక్రా (28వ నిమిషం), గుర్జాంత్ సింగ్ (37వ నిమిషంలో) గోల్స్ కొట్టి భారత్‌కు తిరుగులేని విజయాన్నందించారు. ఐర్లాండ్ జట్టు ఆటగాడు జులైన్ డేల్ ఏకైక గోల్ చేసి జట్టుకు ఊరటనందించాడు.

బెయిర్‌స్టో సూపర్ సెంచరీ

ఇంగ్లండ్‌దే వన్డే సిరీస్


బెయిర్‌స్టో 104

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ 3-2తో కైవసం చేసుకుంది. శనివారం జరిగిన నిర్ణయాత్మక ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కివీస్ నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 32.4 ఓవర్లలో 229/3 స్కోరుతో అందుకుంది. బెయిర్‌స్టో(60 బంతుల్లో 104) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. కివీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ ఓపెనర్ అలెక్స్ హేల్స్(74 బంతుల్లో 61)తో కలిసి జట్టుకు అలవోక విజయాన్నందించాడు. తన ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లతో చెలరేగిన బెయిర్‌స్టో..హేల్స్‌తో కలిసి తొలి వికెట్‌కు 155 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. బౌల్ట్, సోధీ, సాంట్నర్‌కు ఒక్కో వికెట్ దక్కింది. తొలుత సాంట్నర్(67), నికోల్స్(55) అర్ధసెంచరీలతో కివీస్ 49.5 ఓవర్లలో 223 పరుగులు చేసింది. వోక్స్(3/32), రషీద్(3/42) మూడేసి వికెట్లు తీశారు. బెయిర్‌స్టోకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', వోక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.



చెలరేగిన ముష్ఫికర్

- శ్రీలంకపై బంగ్లా చారిత్రక విజయం

కొలంబో: ముష్ఫికర్ రహీమ్ (35 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సులు) అద్భుతమైన బ్యాటింగ్‌తో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చారిత్రక విజయాని నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక విధించిన 215 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 19.4 ఓవర్లలోనే ఛేదించి తొలి మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నది. టీ20ల్లో బంగ్లాకు ఇదే అత్యుత్తమ ఛేజింగ్. తమిమ్ (47), లిట్టన్ (43) శుభారంభం అందించగా..రహీమ్ 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి బంగ్లా విజయంలో కీలకపాత్ర పోషించాడు. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కుశాల్ (74), మెండిస్ (57) రాణించగా..చివర్లో తరంగ (32 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. ముస్తఫిజుర్‌కు 3, మహ్మదుల్లాకు 2 వికెట్లు దక్కాయి.

ఆధిక్యంలో దక్షిణాఫ్రికా

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా ఆధిక్యంలో కొనసాగుతున్నది. 39/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 95 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. టాపార్డర్‌లో ఎల్గర్(57), ఆమ్లా(56), డివిలీయర్స్(81 బంతుల్లో 74 నాటౌట్, 14ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. డివిలీయర్స్‌తో కలిసి ఫిలాండర్(14) క్రీజులో ఉన్నాడు. కమ్మిన్స్(2/55), మిచెల్ మార్ష్(2/26) రెండేసి వికెట్లు తీశారు.

- తుది జట్టులో స్థానం ఎవరిదో
- లోకేశ్ రాహుల్‌కు అవకాశం దక్కేనా..?
- అరంగేట్రం కోసం దీపక్ హుడా ఆరాటం

నలుగురిలో..

మేరా నంబర్ కబ్ ఆయేగా..అంటూ యువ క్రికెటర్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్న వేళ..శ్రీలంకతో జరుగబోయే మ్యాచ్ కోసం భారత్ తుది జట్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది..లోకేశ్ రాహుల్ వంటి ప్రతిభావంతమైన ఆటగాడు రిజర్వ్ బెంచ్‌కే పరిమితవగా, అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న దీపక్ హుడాకు నిరీక్షణ తప్పడం లేదు..రిజర్వ్ బెంచ్‌లో ఉన్న ఆ నలుగురు క్రికెటర్లదీ ఒక్కటే తపన..తుది జట్టులో స్థానం కోసం వారి ఆరాటం..ఈ నేపథ్యంలో గత మ్యాచ్‌ల్లో విఫలమైన శార్దూల్, రిషబ్ స్థానంలో కొత్తవారిని తీసుకుంటారా..? ప్రయోగాల కోసం సిరీస్ అన్న మాటను టీమ్ మేనేజ్‌మెంట్ నిలబెట్టుకుంటుందా..?

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు టీ20 టోర్నీలో తుది జట్టుపై ఆశలు పెట్టుకున్న భారత కుర్రాళ్లు మరో మ్యాచ్ కోసం ఎదురుచూస్తున్నారు. సోమవారం శ్రీలంకతో జరుగబోయే మ్యాచ్‌లోనైనా ఆడే అవకాశం వస్తుందేమోనని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రపంచకప్ కోసం బలమైన రిజర్వ్ బెంచ్ తయారు చేయాలన్న ఉద్దేశ్యంతో టీమ్‌మేనేజ్‌మెంట్ యువ జట్టును ఈ టోర్నీకి పంపగా..ప్రస్తుతం రిజర్వ్ బెంచ్‌లో ఉన్న నలుగురు క్రికెటర్లు మాత్రం ఇంకా తుదిజట్టు కోసం వేచి చూడాల్సి వస్తున్నది. కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, దీపక్ హుడా, మహ్మద్ సిరాజ్‌కు ఈ టోర్నీలో ఇంతవరకూ ఆడే అవకాశం రాలేదు. ఇంకా రెండు మ్యాచ్‌లే(ఫైనల్ కాకుండా) మిగిలి ఉండడంతో తమకు సత్తా చాటేందుకు చాన్స్ దొరికితే బాగుండునని ఆశలు పెట్టుకున్నారు. భారత్‌తో సిరీస్ సందర్భంగా దక్షిణాఫ్రికా సైతం ఓటములతో సంబంధం లేకుండా కొత్తవారికి అవకాశం ఇచ్చి తమ రిజర్వ్ బెంచ్ సామర్థ్యాన్ని పరీక్షించుకున్నది. భారత్ కూడా అదే ఫార్ములాను పాటిస్తే మంచిదని క్రికెట్ పండితులు సైతం సూచిస్తున్నారు.

రఫ్ఫాడించే రాహుల్


రాహుల్

కర్ణాటక సంచలనం కేఎల్ రాహుల్ అటు టెస్టుల్లో, ఇటు టీ20ల్లో తానేంటో రుజువు చేసుకున్నాడు. ఇప్పటి వరకు 12 టీ20 మ్యాచ్‌లు మూడు అర్ధసెంచరీలు, ఒక సెంచరీ నమోదు చేశాడు. 50కి పై చిలుకు సగటుతో సత్తా చాటాడు. రాహుల్‌ను తుది జట్టులోకి తీసుకోవడంపై టీమ్ మేనేజ్‌మెంట్ తర్జనభర్జన పడుతున్నది. ఇతడిని ఆడిస్తే ఓపెనర్‌గా అవకాశం ఇవ్వాలి. ధవన్ ఫాంలో ఉండటం, కెప్టెన్ రోహిత్ సీనియర్ ఆటగాడవడంతో రాహుల్‌ను తీసుకుంటే ఏ స్థానంలో ఆడించాలనే దానిపై ఆలోచనలో పడింది. పొట్టి ఫార్మాట్‌లో ఓపెనర్‌గా ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన రాహుల్ ఒకే ఒక్కసారి నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు చేశాడు. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగో నంబర్‌లో బ్యాటింగ్ చేసి శతకం బాదిన సంగతి తెలిసిందే. ప్రస్తుత టోర్నీలో రిషబ్, దినేశ్ ఇద్దరు వికెట్ కీపర్లను ఆడించడం కూడా రాహుల్ అవకాశాలపై ప్రభావం చూపింది. ఒకవేళ రిషబ్‌ను పక్కనపెట్టి రాహుల్‌కు తుది జట్టులో చోటు కల్పిస్తే..మూడో నంబర్ లేదా నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు దింపొచ్చు. మిడిల్ ఆర్డర్ కూడా పటిష్ఠమవుతుంది.

శార్దూల్ స్థానంలో సిరాజ్!


సిరాజ్

హైదరాబాదీ పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్ కూడా తుదిజట్టులో చోటు కోసం తపిస్తున్నాడు. దేశవాళీ టోర్నీల్లో వికెట్ల పండుగ చేసుకున్న ఈ యువ సేపర్‌ను..వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన శార్దూల్ ఠాకూర్ స్థానంలో ఆడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. లంకతో జరిగిన తొలిమ్యాచ్‌లో శార్దూల్ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. 3.3 ఓవర్లు వేసి 42 పరుగులు ఇచ్చిన సంగతి తెలిసిందే. శార్దూల్‌తో పోలిస్తే సిరాజ్‌ను ఆడించడమే మేలని క్రికెట్ పండితులు సైతం చెబుతున్నారు.130-140 స్పీడ్‌తో బంతులు వేయడంలో, యార్కర్లు సంధించడంలోనూ సిరాజ్ దిట్ట. అవకాశం ఇస్తే సత్తా చాటేందుకు ఈ హైదరాబాదీ స్పీడ్‌స్టర్ సిద్ధంగా ఉన్నాడు.

అక్షర్, దీపక్‌ల సంగతేంటో..?


అక్షర్


దీపక్

ఆల్ రౌండర్ కోటాలో జట్టులో విజయ్‌శంకర్ ఉండటంతో అక్షర్ పటేల్, దీపక్ హుడాలు రిజర్వ్ బెంచ్‌కే పరిమితమవాల్సి వచ్చింది. ప్రధాన స్పిన్నర్ చహల్‌తో పాటు ఆఫ్ బ్రేక్ బౌలర్ వాషింగ్టన్ సుందర్ కూడా తనవంతు పాత్ర పోషిస్తున్నాడు. ఒకవేళ చహల్‌కు విశ్రాంతి ఇవ్వదలిస్తే అక్షర్, దీపక్‌లలో ఒకరికి అవకాశం దక్కొచ్చు. అక్షర్‌పటేల్ 2017లో కేవలం మూడు టీ20 మ్యాచ్‌లే ఆడాడు. 2015లోనే అరంగేట్రం చేసిన ఈ గుజరాతీ లెఫ్టార్మ్ స్పిన్నర్..నిలకడగా రాణించలేకపోవడం, చహల్, కుల్దీప్‌ల హవా కొనసాగుతుండడంతో అవకాశాలు దక్కడం లేదు. మరోవైపు హార్డ్ హిట్టర్‌గా పేరున్న దీపక్ హుడాకు చాన్స్ దొరకడం ఖాయమనిపిస్తున్నది. బ్యాటింగ్‌లోనే కాకుండా ఆఫ్ బ్రేక్‌తోనూ ఆకట్టుకుంటాడు. స్వదేశంలో శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌కు సైతం ఇతడిని ఎంపిక చేసినప్పటికీ రిజర్వ్ బెంచ్‌కే పరిమితం చేశారు. దీంతో ఈ హర్యానా ఆల్ రౌండర్ అరంగేట్రం కోసం తహతహలాడుతున్నాడు.